

గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

కోట్లలో మరణాలు.. ఇంకా మనుగడలోనే ఆధార్ కార్డులు

నిమిషప్రియను క్షమించం.. బ్లడ్‌మనీ కాదు.. న్యాయమే కావాలి!

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 227 | గురువారం | 17-07-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## సిఐడి కస్టడీకి హెచ్‌సిఎ నిందితులు

అనుమతి ఇచ్చిన మల్కాజిగిరి కోర్టు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) కేసులో చర్లపల్లి జైలులో ఉన్న నిందితులను మల్కాజిగిరి కోర్టు సిఐడి కస్టడీకి అనుమతించింది. ఈ నెల 22 వరకు ఐదుగురు నిందితులను కస్టడీకి అనుమతించడంతో గురువారం ఉదయం చర్లపల్లి జైలు నుండి నిందితులను సిఐడి అధికారులు తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. కస్టడీకి తీసుకుంటే హెచ్‌సిఎలో జరిగిన అవకతవకలకు సంబంధించి మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు నిందితులు వేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఇదిలా ఉంటే హెచ్‌సిఎ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపిఎల్ మ్యాచ్ టికెట్ల వివాదంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. నకిలీ పత్రాలతో జగన్మోహన్ రావు శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేసినట్టు సిఐడి విచారణలో తేలింది. నకిలీ పత్రాలతో ఏర్పాటు చేసిన క్లబ్ ద్వారానే హెచ్‌సిఎలో అధ్యక్షుడిగా పోటీ చేసినట్టు గుర్తించారు. గౌలిపుర క్రికెట్ క్లబ్ బిఎస్ అధ్యక్షుడు సీ. కృష్ణ యాదవ్ సంతకాన్ని జగన్ మోహన్ రావు ఫోర్జరీ చేసినట్టు సిఐడి గుర్తించింది.



# కృష్ణా, గోదావరి జలాల సమస్యలపై నిపుణుల కమిటీ

నెలరోజుల్లో నివేదిక

ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల భేటీలో నిర్ణయం

ప్రాజెక్టులకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచన : అంగీకరించిన ఎపి సిఎం చంద్రబాబు

హైదరాబాద్‌లో గోదావరి, అమరావతిలో కృష్ణా యాజమాన్య బోర్డుల ఏర్పాటుకు సమ్మతి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదుల నీటి కేటాయింపులు, వినియోగం, పాత ప్రాజెక్టుల అనుమతులు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను గుర్తించి చర్చించేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి ఢిల్లీలోని జలశక్తి కార్యాలయంలో జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చొరవతో ఆయన అధ్యక్షతన బుధవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సమావేశంలో ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయంతో ప్రధానంగా నాలుగు అంశాలకు సంబంధించి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో ప్రధానంగా కృష్ణా నదీ జలాల వినియోగానికి సంబంధించి ఏ రాష్ట్రం ఎంత మేరకు నీటిని వినియోగిస్తుందో లెక్కలు తెల్చడానికి టెలిమెట్రీల తక్షణమే ఏర్పాటు చేసేందుకు పరస్పర అంగీకారం జరిగిందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంతో పాటు 2020లో జరిగిన సమావేశంలో నిర్ణయించిన మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయం, తెలంగాణలో గోదావరి నదీ యాజమాన్యం బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీశైలం డ్యామ్ నిర్వహణ బాధ్యత ఆంధ్రప్రదేశ్‌ది

తరువాయి 2లో

## 'స్థానిక' ఎన్నికలకు సిద్ధం చేయండి




- జిల్లా అధికారులను ఆదేశించిన ప్రభుత్వం
- ఎన్నికల సామాగ్రి కొనుగోలు చేయాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల సామాగ్రిని కొనుగోలు చేయాలని జిల్లా కార్యనిర్వహణ అధికారులను (సిఇఒ), జిల్లా పంచాయతీ అధికారులను రాష్ట్ర గ్రామ పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. హై కోర్ట్ విధించిన గడువులోపు (సెప్టెంబర్ 30) ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎన్నిల సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనుగోలు చేసిన విధంగానే ప్రస్తుత ఎన్నికల సామాగ్రిని కూడా కొనుగోలు చేయాలని, ఇందుకు జిల్లా కొనుగోలు కమిటీ(డిపిసి) అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎన్నికలసామాగ్రి కొనుగోలు విషయంలో ఎటువంటి లోపాలకు పాల్పడవద్దని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పంచాయతీ రాజ్ హెచ్చరించింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ముసాయిదాకు గవర్నర్ నుంచి ఆమోదం లభించగానే , ఆ వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లును పూర్తి చేసింది. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణ, బందోబస్తు, తదితర అంశాలపై ఆయా శాఖలను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

## 566 ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలు

- 5773 ఎంపిటిసి, 12,778 గ్రామ పంచాయతీలు
- జెడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రాష్ట్రంలో జెడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 566 ఎంపిపి,జెడ్‌పిటిసి స్థానాలను, 5773 ఎంపిటిసి స్థానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ పంచాయతీల సంఖ్య 12,778, వార్డుల సంఖ్య 12,694 ఉన్నట్టు గ్రామ పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి సారి 2019 సంవత్సరంలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు

తరువాయి 2లో

## పార్లమెంట్ ముందుకు 8 కొత్త బిల్లులు



వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే యోచనలో కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 8 కొత్త ముసాయిదా చట్టాలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అందులో భౌగోళిక వారసత్వ ప్రదేశాలు, భౌగోళిక అవశేషాలను సంరక్షించడానికి ప్రయత్నించే బిల్లు కూడా ఉంది. అదే విధంగా జాతీయ క్రీడా పాలన బిల్లు, భౌగోళిక వారసత్వ ప్రదేశాలు, భౌగోళిక అవశేషాలు (సంరక్షణ మరియు నిర్వహణ) బిల్లు, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు ఉన్నాయి. సమావేశాలు ఆగస్టు 21 వరకు కొనసాగనున్నాయి. రక్షా బంధన్, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఆగస్టు 12 నుండి ఆగస్టు 18 వరకు సమావేశాలకు విరామం

తరువాయి 12లో

## ఎసిబికి చిక్కిన పంచాయతీరాజ్ ఇఎన్‌సి

లంచం తీసుకుంటూ పట్టుబడిన కనకరత్నం అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్



లంచం డబ్బులు తీసుకుంటుండగా పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ వీరవల్లి కనకరత్నంని అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ (డిఇ)ని తాండూర్ నుంచి వికారాబాద్ కు బదిలీ చేసేందుకు కనకరత్నం రూ.50 వేలు డిమాండ్ చేశాడు.దీంతో బాధితుడు డిఇ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే కనకరత్నం ఎర్రమంజిల్‌లోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో బుధవారం బాధితుడి నుంచి రూ.50 వేలు ఆ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు చిక్కాడు. ఎసిబి అధికారులు అతని కార్యాయలంతో పాటు ఇంటిని కూడా సోదాలు నిర్వహించారు.అనంతరం కనకరత్నంను అరెస్టు చేసి ఎసిబి మెజిస్ట్రేట్ ముందు హాజరపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో కనకరత్నంను ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కనకరత్నం గతేడాదే పదవి నుంచి రిటైర్ అవ్వగా.. ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగించింది.

తరువాయి 2లో

## మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలి

మరో 10 మందికి ఉపాధి కల్పించాలి

మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులు పంపిణీ చేసిన మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, సీతక్క



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి

మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలో పర్యటించి గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క), ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ 4బాబు, రాష్ట్ర సెర్ప్ సిఇఒ డి.దివ్య, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ రాజ్ ఠాకూర్ లతో కలిసి పెద్దపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని అన్నారు. రాష్ట్రంలో మహిళలు భద్రాచలం, యాదాద్రి, వేములవాడ ఎక్కడికైనా ఉచితంగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్,

తరువాయి 2లో

## జైల్లో ఉండాల్సిన వారు చట్టసభల్లోకి..!

- కమ్యూనిస్టులకు అధికారం ఇస్తే తప్పులు ఎంచి ఊచలు లెక్కపెట్టేలా చేస్తాం
- విలాసాలతో జల్సాలు చేసేవారు దేశభక్తులా?
- ప్రజాసమస్యలు ప్రశ్నిస్తూ పోరాటాలు చేసేవారు దేశద్రోహులా?
- కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- ప్రజలకు కూడు, గూడు కల్పించడమే సిపిఐ లక్ష్యం : చాడ
- సిద్దిపేట జిల్లా సిపిఐ 4వ మహాసభ ప్రారంభం




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జైల్లో ఉండాల్సిన వారు చట్ట సభలైన అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఉన్నారని.. కమ్యూనిస్టులకు అధికారం ఇస్తే వారి చేసిన తప్పుల లెక్కించి ఊచలు లెక్కబెట్టిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విలాసాలతో జల్సాలు చేసేవారు దేశభక్తులైనారని..ప్రజల కోసం ప్రశ్నిస్తూ పోరుబాట పట్టిన మావోయిస్టులను దేశద్రోహులుగా ముద్రవేసి కాల్చిచంపుతున్నారని ఆరోపించారు. పరిపాలన చేసే పాలకులకు జాలి, దయలేదని, మావోయిస్టు నేతలను పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారన్నారు. బిజెపి నేతలకు ఎరుపురంగు చూస్తేనే

తరువాయి 12లో



## సిరియా రాజధానిపై ఇజ్రాయెల్ దాడులు

ముగ్గురు మృతి

సిరియా : సిరియా రాజధాని డమస్కస్‌లో కీలక ప్రదేశాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. అధ్యక్ష భవనం సమీపంలోని సిరియా రక్షణ మంత్రిత్వ శాఖ భవనంపై బుధవారం బాంబుల వర్షం కురిపించింది. ఈ పేలుళ్లో ముగ్గురు మరణించగా, 34 మంది క్షతగాత్రులైనట్లు తెలుస్తోంది. సిరియాలోని దక్షిణ ప్రాంతం నుంచి ప్రభుత్వ బలగాలను ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఇజ్రాయెల్ హెచ్చరిక నేపథ్యంలో బాంబు దాడులు జరిగాయి. ఆ ప్రాంతంలో డ్రూజ్ తెగకు, సిరియా బలగాలకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి.

**మెజారిటీ కోల్పోయిన నెతన్యాహూ ప్రభుత్వం**

ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ ప్రభుత్వం మెజారిటీ కోల్పోయింది. అధికార కూటమికి అతివాద సాంప్రదాయ షాస్ పార్టీ మద్దతును ఉపసంహరించుకోవడంతో నెతన్యాహూ ప్రభుత్వం పార్లమెంటులో మైనారిటీలో పడింది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరిస్తే...

## రూ.140 లక్షల కోట్లు ప్రైవేటీకరించడమే

- బ్యాంకులను లూటీ చేస్తున్నవారు విదేశాల్లో జల్సాలు చేస్తున్నారు
- కేంద్ర ప్రభుత్వం ఆర్థిక విధానాలను పునర్ సమీక్షించుకోవాలి
- పాలకుల చర్యలకు తగిన ప్రతిఘటన, గుణపాఠం తప్పదు
- 'ప్రజాపక్షం'తో ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం

ఇ.చంద్రశేఖర్

''బ్యాంకులను ప్రైవేటీకరించడమంటే దేశంలోని బ్యాంకులలో డిపాజిట్ల రూపంలో ఉన్న ప్రజలకు చెందిన దాదాపు రూ.140 లక్షల కోట్ల సంపదను ప్రైవేటీ కరించడమే. ఇది అత్యంత ప్రమాదకరమైన ఆలోచన. సంపన్నులు ప్రభుత్వ బ్యాంకులలోని ప్రజల డబ్బును లూటీ చేసి విదేశాలలో విలాసాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వారి ఆర్థిక విధానాలను పునర్ సమీక్షించుకోవాలి'' అని బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ అగ్ర నేత, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆయనతో 'ప్రజాపక్షం' ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

**ప్రశ్న : ప్రస్తుతం దేశ ఆర్థిక రంగ పరిస్థితి ఏమిటి?**

వెంకటాచలం: రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 బి ప్రకారం ధనిక, పేద ప్రజల మధ్య అంతరాన్ని తగ్గించాలి. కానీ నేటి పాలకుల ఆర్థిక విధానాలు వారి మధ్య అంతరాన్ని మరింత పెంచుతున్నాయి. సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతుండగా పెద్ద సంఖ్యలో ఉన్న సామాన్య ప్రజలకు జీవనోపాధి లభించడం లేదు. గతంలో అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెరిగేవి. 2020 దశకంలో కూడా అభివృద్ధి జరుగుతున్నప్పటికీ ఉపాధి అవకాశాలు పెరగకపోవడమే

తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## గాజాలో కాల్పుల విరమణపై ఖతార్ ప్రధానితో ట్రంప్ చర్చలు!

**దోహా:** గాజాలో యుద్ధ విరమణపై ఇటీవల హమాస్‌-ఇజ్రాయెల్ ప్రతినిధి వర్గం మధ్య చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిన తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దోహాలో ఖతార్ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్ తహానీతో చర్చలకు సిద్ధమయ్యారు. బుధవారం రాత్రి పొద్దుపోయాక వారిద్దరిమధ్యా విందు సమావేశం జరుగుతుందని వైట్‌హౌస్ ప్రకటించడంతో గాజా సమస్య పరిష్కారంపైనే వారిమధ్య చర్చ జరగబోతోందని ఇజ్రాయెల్ జర్నలిస్టు బరక్ రావిడ్ అత్యుత్సాహంగా ఎక్స్ వేదికగా ఒక కథనం రాశారు. గాజాలో 60 రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలని అమెరికా చేసిన ప్రతిపాదనపై ఈనెల ఆరో తేదీన ఇజ్రాయెల్‌-హమాస్ ప్రతినిధులమధ్య పరోక్ష చర్చలు జరిగినప్పటికీ ఇరుపక్షాలు కొన్ని విషయాల్లో మొండిపట్టుదల పట్టడంతో చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఈ రెండు వర్గాలకూ మధ్యప్రాచ్యంలో ట్రంప్ ప్రత్యేక దూత విట్‌కాఫ్ ప్రధాన మధ్యవర్తిగా వ్యవహరిస్తుండగా, హమాస్‌ను ఒప్పించే బాధ్యతలను ఖతార్, ఈజిప్టు దేశాలు స్వీకరించాయి.

### పాకిస్థాన్ రాజకీయ ముఖచిత్రంలో మార్పులు?

## జర్దారీని సాగనంపేందుకు రంగం సిద్ధం!



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ రాజకీయ ముఖచిత్రంలో మార్పులు సంభవిస్తాయని మళ్ళీ వదంతులు మొదలయ్యాయి. ఆ దేశ అగ్రశ్రేణి పౌర రాజకీయ-సైనిక నాయకత్వం బుధవారంనాడు తాజా సమావేశం జరిపిన నేపథ్యంలో దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులు వస్తాయని ఈసారి గట్టి ప్రచారం జరిగింది. దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీని పదవి నుండి తొలగించి ఆ స్థానంలో సైన్యాధిపతి చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను కూర్చోబెడతారని కొద్దిరోజులుగా వార్తలొస్తున్నాయి.

ప్రధానమంత్రి షరీఫ్‌తో సమావేశానికి ముందుగా ఆసిఫ్ మునీర్ వెళ్ళి జర్దారీని కలిశారు. ఈ పరిణామాలు వదంతులకు కారణమయ్యాయి. ఈ విధంగా పదవీ మార్పిడి గురించి పాకిస్థాన్‌లో వదంతులు రావడం ఇది మూడోసారి. ఈ వదంతులు ఎవరు పుట్టిస్తున్నారో తమకు తెలుసునని, విదేశీ శక్తులే ఈ ప్రచారం చేస్తున్నాయని హోంమంత్రి మొహిసిన్ నక్వీ విమర్శించారు. దీంతో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా జర్దారీని పదవి నుండి దించేస్తారన్న వార్తలను తోసిపుచ్చారు. బుధవారంనాటి పరిణామాలపై రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్పందిస్తూ, జర్దారీకి అన్ని విషయాలు ప్రధానమంత్రి చెప్పారనీ, ప్రభుత్వంమీద, ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మీద ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని అన్నారు. ప్రధానమంత్రి, సైన్యాధిపతి సమావేశం అసాధారణ విసయమేమీ కాదని, వారానికి మూడుసార్లు ఇద్దరూ కలుసుకుని వివిధ సమస్యలపై చర్చించుకుంటారని అన్నారు. ఆసిఫ్ మునీర్‌కు దేశాధ్యక్ష పదవిపై ఎలాంటి కాంక్షా లేదన్నారు. సైన్యంలో అత్యున్నతమైన పదవిని మునీర్ నిర్వహించారని, ఇంతకంటే ఆయనకు ఇంక కావాల్సింది ఏముంటుందని అన్నారు.


పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పిఎంఎల్‌-ఎన్)కు, పాకిస్థాన్ పీపుల్స్‌పార్టీ (పిపిపి)కి మధ్య కూటమి ప్రభుత్వంలో విభేదాలు వచ్చాయన్న ఆలోచనను కూడా ఖ్వాజా ఆసిఫ్ కొట్టిపారేశారు. "మేం ఐక్యంగా ఉన్నాం, మేం కేవలం ప్రభుత్వంలో భాగస్వాములం మాత్రమే కాదు, అంతకుమించిన స్థాయిలో ఉన్నాం" అన్నారు. 2024 ఫిబ్రవరి 8వ తేదీన పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎవరికీ పూర్తి మెజారిటీ రాకపోవడంతో షరీఫ్ ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పిపిపి నాయకుడు అసిఫ్ అలీ జర్దారీ పిఎంఎల్‌-ఎన్ పార్టీకి మద్దతు ఇచ్చి సహకరించారు. పాకిస్థాన్ రాజ్యాంగానికి 27వసారి సవరణ చేసే అవకాశాలు, ఆలోచనలు కూడా లేవని ఆయన చెప్పారు.

## మాస్కోపై ఉక్రేన్ దాడి చేయదు : ట్రంప్

### వాళ్ళకి ఆయుధ సరఫరా ప్రారంభించాం

**వాషింగ్టన్:** మాస్కో నగరంపై దాడులు చేయాలని ఉక్రేన్ సైన్యానికి ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ ఆదేశాలు జారీచేసే అవకాశం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. వైట్‌హౌస్ వెలుపల ఆయన పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తూ, "లేదు, ఆయన (జెలెన్స్కీ) మాస్కోను లక్ష్యంగా చేసుకుని దాడులకు ఆదేశాలు ఇవ్వరు" అని చెప్పారు. ఉక్రేన్‌కు అమెరికా నుండి అత్యాధునిక ఆయుధాల సరఫరా కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించామని ఆయన చెప్పారు. మాస్కో నగరం సహా రష్యాలో బాగా లో.. లోపలికి దూసుకెళ్ళి క్షిపణి దాడులు చేసేందుకు జెలెన్స్కీని ట్రంప్ ప్రోత్సహించే అవకాశం లేదని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లియావిట్ చెప్పారు. ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక తొలుత ఇందుకు విరుద్ధంగా మాస్కోపై దాడులకు అవకాశముందని ప్రకటించింది. దీనిపై కరోలినా ప్రకటన తర్వాత పాత్రికేయుల నుండి ఎదురైన ప్రశ్నలకు ట్రంప్ కూడా వివరణ ఇచ్చారు. ట్రంప్ ఏమి చేయాలనుకున్నాగానీ, ముందుగా అందుకు విరుద్ధ ప్రకటనలు చేస్తూ ఉంటారు. దీనిపై సందేహాలు తీర్చుకునేందుకే పాత్రికేయులు పైవిధంగా ప్రశ్నలు వేశారు. ఉక్రేన్‌తో యుద్ధ సమస్యను యాభై రోజుల్లో పరిష్కరించుకోకపోతే రష్యాపై అత్యంత తీవ్రమైన టారిఫ్‌లు, ఆంక్షలు అమలు చేస్తామని ట్రంప్ బెదిరించిన తర్వాత రష్యాకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తన సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ట్రంప్ చేసిన హెచ్చరికలను కూడా రష్యా ప్రభుత్వం కొట్టిపారేసింది.

**శాంతికోసం ప్రయత్నాలు**



ఉక్రేన్‌లో యుద్ధ విరమణకు తాను విసుగు లేకుండా కృషి చేస్తున్నానని ట్రంప్ చెప్పారు. ఉక్రేన్‌లో యుద్ధ నివారణ,శాంతిస్థాపన తన ప్రధాన ఎజెండా అని గత ఏడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రకటించారు. కానీ పదవి చేపట్టిన ఆరునెలల తర్వాత కూడా ఆ ప్రయత్నాలు ఫలించడంలేదు. ఇప్పటికి నాలుగుసార్లు తాను పుతిన్‌తో ఒప్పందం చేసుకుని శాంతి సాధిస్తారని నమ్మానని, ఆయన తనను తీవ్ర అసంతృప్తికి గురిచేశారని, ఐనాగానీ తన ప్రయత్నాలు విరమించబోననీ రెండు రోజులక్రితం ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. మరోవైపు యుద్ధాన్ని రెచ్చగొట్టేవిధంగా ఉక్రేన్‌కు అత్యాధునిక ఆయుధాలను నాటో ద్వారా సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ వైఖరిని పుతిన్ తీవ్రంగా తప్పుపడుతున్నారు. రష్యాపై మరిన్ని దాడులు చేసేందుకు వీలుగా ఎటిఎసిఎంఎస్ క్షిపణులను ఉక్రేన్‌కు సరఫరా చేస్తామని ఈనెల నాలుగోతేదీన జెలెన్స్కీతో ఫోన్ సంభాషణ సందర్భంగా ట్రంప్ చెప్పారు.

### రష్యాతో ప్రత్యక్ష చర్చలకు ఉక్రేన్‌పై ఒత్తిడి తీసుకురండి : పెస్కోవ్

యుద్ధ సమస్య పరిష్కారానికి రష్యాతో తదుపరి ప్రత్యక్ష చర్చలకు ఉక్రేన్‌పై బాగా ఒత్తిడి తీసుకురావాలని పంబంధిత భాగస్వామ్య పక్షాలన్నింటికీ క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమ్రీ పెస్కోవ్ పిలుపు ఇచ్చారు. "దయచేసి ప్రతిఒక్కరూ ఆ దిశగా చర్యలు తీసుకోండి, ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన బృందం ఈ విషయంలో చొరవ తీసుకోవడమే ఇక్కడ కీలకాంశం. తాము ఆశాభావంతో ఉన్నామనీ, అసంతృప్తి చెందామనీ అమెరికా వైపు నుండి ఎన్ని ప్రకటనలు వచ్చినప్పటికీ కూడా రష్యాతో ప్రత్యక్ష చర్చలు చేసేందుకు వీలుగా ఉక్రేన్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని టాస్ వార్తాసంస్థ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు దిమ్రీ పెస్కోవ్ సమాధానం చెప్పారు. యుద్ధం కొనసాగించేందుకే ఉక్రేన్‌వైపు నుండి సంకేతాలు వస్తున్నాయి తప్ప యుద్ధ పరిష్కారానికి, శాంతి చర్చలకు ఎలాంటి సంకేతాలు రావడం లేదని తాను ఇప్పటికి చాలాసార్లు చెప్పానన్నారు. ఉక్రేన్‌-రష్యా మధ్య ఈ ఏడాది జూన్‌నెలలో రెండో విడత ప్రత్యక్ష చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి శాంతి ఒప్పందం కుదరలేదు. కానీ బందీలైన సైనికులను పరస్పరం ఇచ్చిపుచ్చుకునేందుకు, ఆరువేలమంది ఉక్రేన్ సైనికుల మృతదేహాలు అప్పగించేందుకు మాత్రం ఒప్పందం కుదిరింది.

## జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్‌పై దాపరికం వద్దు

### కాంగ్రెస్‌లో బిల్లుకు డెమోక్రాట్ల ఒత్తిడి

**వాషింగ్టన్ :** లైంగికనేరాలకు పాల్పడి జైలులో మరణించిన జెఫ్రీ ఎప్స్టీన్ దాచిపెట్టిన సమాచారం గురించి అమెరికాలో రోజురోజుకూ ట్రంప్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయంలో దాపరికం ఉండకూడదని సర్వత్రా వైట్‌హౌస్‌పై గతంలో లేనంతగా ఒత్తిడి వస్తోంది. సొంతపార్టీలో ట్రంప్‌ను భుజాలమీద ఎత్తుకు మోసేవారూ వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్‌లో దీనిపై ఒక బిల్లును తెచ్చేందుకు ప్రతిపక్ష డెమోక్రటిక్‌పార్టీ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఫైల్స్‌ను విడుదల చేసి ఎప్స్టీన్‌కు, ట్రంప్‌కు మధ్య సంబంధాలపై ప్రజల్లో ఉన్న సందేహాలు నివృత్తి చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంలో అమెరికా దిగువసభ స్పీకర్ కూడా ఏకీభావం వ్యక్తం చేస్తున్నారు. ఎప్స్టీన్ ఫైల్స్‌కు సంబంధించి ఎలాంటి దాపరికాలు ఉండకూడదని గొంతు కలికారు. మరోవైపు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ఎప్స్టీన్‌కు సంబంధించి విశ్వసనీయ సమాచారంగా భావించిన పత్రాలను అటార్నీ జనరల్ పామ్ బాండీ విడుదల చేయాలని అన్నారు. ఐతే పామ్ బాండీ మాత్రం హౌస్ స్పీకర్ కు మాత్రమే ఇస్తామన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఇప్పటివరకూ ఎప్స్టీన్ ఫైల్స్ పేరుతో విడుదల చేసిన సమాచారం పట్ల 50 శాతం ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అమెరికా వార్తాసంస్థ సర్వేలో వెల్లడైంది. అసలు ఎప్స్టీన్ ఎలాంటి డేటానూ దాచిన దాఖలాలు లేవని పామ్ బాండీ గతంకంటే భిన్నమైన ప్రకటన చేయడంతో వివాదం చెలరేగింది. ఎఫ్‌బిఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బాంగినోకు, బాండీకి మధ్య వివాదంలో ట్రంప్ తన అటార్నీ జనరల్‌ను వెనకేసుకొస్తున్నారు. ఎప్స్టీన్ గురించి ప్రతి ఒక్కరూ ఎందుకు ఇంత ఆసక్తి చూపిస్తున్నారో తనకు అర్థం కావడం లేదని ట్రంప్ లేనిపోని ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, ఈ ఫైల్స్‌ను విడుదల చేయకపోతే ట్రంప్‌ను ఎవ్వరూ నమ్మబోరని ఎలాన్ మస్క్ హెచ్చరించారు. వేలాదిమంది పిల్లలను లైగింకంగా వేధింపులకు గురిచేసిన వీడియోలు ప్రభుత్వం వద్ద ఉంటే మరి ఇంతవరకూ నిందితులను ఎందుకు న్యాయస్థానం ముందు నిలబెట్టలేదని ఎలాన్‌మస్క్ ప్రశ్నించారు. చిన్న పిల్లలు సహా వేలాదిమందిని మభ్యపెట్టి, లైంగికంగా వేధించి వ్యభిచార వృత్తిలోకి దింపాడన్న నేరారోపణలపై రెండుసార్లు జైలుపాలైన జెఫ్రీ ఎప్స్టీన్ 2019 ఆగస్టులో రెండోసారి జైలులోనే అనుమానాస్పదంగా మరణించాడు. డోనాల్డ్ ట్రంప్ తనకు ప్రియమిత్రుడుని, ఆయన గురించి పూర్తి వివరాలు తనకు తెలుసుననీ ఎప్స్టీన్ తరచు చెప్పుకునేవాడు. ఎప్స్టీన్ జైలులో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పినప్పటికీ, అతడి మరణం ఇప్పటికీ మిస్టరీగా మారింది. ఎప్స్టీన్‌కు, ట్రంప్‌కు మధ్య ప్రపంచానికి తెలియని ఏదో విడదీయరాని అనుబంధం ఉందన్న సందేహాలు అందరినీ పీడిస్తున్నాయి.

## పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్‌పై నిషేధం తొలగించిన బ్రిటన్



**లండన్ :** పాకిస్థాన్ విమానాలపై విధించిన ఆంక్షలను బ్రిటన్ ఎత్తివేసింది. దీంతో విమాన భద్రతా ప్రమాణాలను పాటించడంలేదన్న కారణంగా ఈ నిషేధం అమలులోకి వచ్చింది. బ్రిటన్ తాజా నిర్ణయంతో ఇక సాధారణ స్థాయిలో పాకిస్థాన్‌-ఇంగ్లాండ్ మధ్య విమాన కార్యకలాపాలకు సమస్యలు తొలగిపోయాయి. 2020 జూన్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఎ-320 ఎయిర్ బస్ కరాచీలోని మోడల్ కాలనీపై కుప్పకూలిపోవడంతో 100 మంది ప్రయాణికులు మరణించారు. దీంతో బ్రిటన్, యూరోపియన్ యూనియన్, అమెరికాలు పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానాలపై నిషేధం విధించింది. పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్‌పై విధించిన నిషేధాన్ని యూరోపియన్ యూనియన్ గత ఏడాది నవంబరులోనే ఎత్తివేసింది. గురువారంనాడు బ్రిటన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం ఇస్లామాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో తనిఖీ కార్యక్రమాలను పూర్తిచేసిన తర్వాత బ్రిటన్ ఎయిర్ సేఫ్టీ కమిటీ విమాన భద్రత పాటించడంలో నాణ్యతా ప్రమాణాలు వృద్ధి చెందాయని సంతృప్తి వ్యక్తం చేసి క్లియరెన్స్ ఇచ్చింది.

## కోట్లు ప్రైవేటీకరించడమే..

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా ఉన్న ఉద్యోగులు, కార్మికులు తమ ఉద్యోగాలు, ఉపాధిని కూడా కోల్పోతున్నారు. క్రమంగా కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నది. గత పదేళ్లలో పేదరికం 17 శాతం పెరిగి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. ధరలు పెరుగుతున్నాయి. సామాన్యులు ఉపయోగించే ప్రతి వస్తువుపై జిఎస్‌టి పేరుతో భారాలను మోపుతూ సంపన్నులకు మాత్రం పన్ను రాయితీ ఇస్తున్నారు. తద్వారా పాలకులు ఎలాంటి ఆర్థిక వ్యవస్థను, సమాజాన్ని నిర్మిస్తున్నారో అర్థం కావడంలేదు.

**ప్రశ్న : దేశ ఆర్థిక రంగంలో ప్రభుత్వ బ్యాంకుల పాత్ర ఏమిటి?**

**వెంకటాచలం:** దాదాపు 200 ఏళ్ల కింద బ్రిటిష్ పాలకులు భారత దేశ సంపదను యథేచ్ఛగా దోపిడీ చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి ఆర్థిక వనరులు అవసరం. ప్రజల పొదుపే వనరులు. ఆ వనరులు బ్యాంకులలో ఉన్నాయి. ఆ బ్యాంకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండేవి. అందుకే దేశంలో బ్యాంకులను జాతీయకరణ చేయాలని పోరాటం చేసి సాధించుకున్నాం. ప్రస్తుతం దేశంలో ఒక లక్ష్యంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు కొనసాగుతున్నాయి. లక్షకు పైగా బ్యాంకుల శాఖలలో రూ.140 లక్షల కోట్ల ప్రజల డబ్బు డిపాజిట్లు ఉన్నాయి. 1969 లో లక్ష మంది ఉన్న బ్యాంకు ఉద్యోగులు నేడు 10 లక్షలకు చేరుకున్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల ఆర్థిక అభ్యున్నతికి, ప్రజలకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు, దారిద్ర్యాన్ని తగ్గించడానికి, గ్రామీణ అభివృద్ధికి, మహిళల సాధికారతకు, విద్య వైద్య రంగాల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక చేయూతను ప్రభుత్వ రంగ బ్యాంకులు అందిస్తున్నాయి. తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

**ప్రశ్న : బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు ఏమిటి?**

**వెంకటాచలం:** బ్యాంకులను ప్రైవేటీకరించడమంటే ఒక ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడం కాదు. బ్యాంకులను ప్రైవేటీకరించడమంటే దేశంలోని బ్యాంకులలో ఉన్న ప్రజలకు చెందిన దాదాపు రూ.140 లక్షల కోట్ల సంపదను ప్రైవేటీకరించడమే. అలా జరిగితే దేశ ప్రజల సంపద ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళుతుంది. దాంతో సంపన్నులు జూదం ఆడుతారు. ఒక వేళ లాభాలు వస్తే వారు అనుభవిస్తారు. నష్టాలు వస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే ప్రభుత్వ బ్యాంకులలో వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న పెట్టుబడిదారులు, సంపన్నవర్గాలు వాటిని ఎగవేసి విదేశాలలో విలాసాలు చేస్తున్నారు. ఒక వేళ ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ జరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల చేతుల్లోకి వెళుతుంది. ఫలితంగా దేశ పరిస్థితి ఇంకా ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటు బ్యాంకులలో యాజమాన్యాలు ఉద్యోగులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకుంటారు. దీంతో రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకులలో రిజర్వేషన్ విధానం తొలగిపోయి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగులు, మాజీ సైనికులు ఇలా అన్ని వర్గాల వారు వారికి దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలు కొల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

**ప్రశ్న: ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడేందుకు యూనియన్ల కార్యాచరణ ఏమిటి?**

**వెంకటాచలం:** ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడడం, బలోపేతం చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కృషి చేయడం, ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను, సదుపాయాలను సాధించడం, సమస్యల పరిష్కారం, ఖాతాదారుల డబ్బులకు రక్షణ, వారి ప్రయోజనాలు, బ్యాంకులలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల విధానాన్ని పరిరక్షించడం ద్వారా భవిష్యత్తులో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, ఇప్పటివరకు ఆర్థిక చేయూత లభించని వర్గాలకు సహకారం అందించడం, దేశం సమ్మిళిత వృద్ధిని సాధించడం లక్ష్యంగా ఎఐబిఇఎ పనిచేస్తున్నది. ఇందు కోసం బ్యాంకుల యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూనే ఉంటాం. అందుకు యాజామాన్యాలు సానుకూలంగా స్పందించకపోతే ధర్నాలు, ఆందోళనలు, సమ్మెలు తదితర రూపాల్లో పోరాటం తప్పదు. ఈ నేపథ్యంలో మరోవైపు జనరల్, లైఫ్ ఇన్సూరెన్స్, సంస్థల ఉద్యోగులతో సమన్వయం చేస్తున్నాం. ఇంకొక వైపు బ్యాంకింగ్ రంగంలోనే పోటీ పెరిగింది. యెఎస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్ తదితర అనేక ప్రైవేట్ బ్యాంకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రైవేటు బ్యాంకులలో పని చేస్తున్న ఉద్యోగులను ఇటీవలే సమీకరించి యూనియన్లు ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా మొత్తం ఫైనాన్షియల్ సెక్టార్ ఉద్యోగుల ఐక్యతకు చర్యలు చేపట్టాం.

**ప్రశ్న : దేశ ఆర్థిక, బ్యాంకింగ్ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏమి చేయాలంటున్నారు?**

**వెంకటాచలం:** భారతదేశంలో మిశ్రమ ఆర్థిక విధానం అమలులో ఉంది. ఇందులో పెట్టుబడిదారులు యాజమాన్యాలు,కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులు, కార్మికులు ఉంటారు. ఈ వ్యవస్థలో సమన్వయం అవసరం. కార్మికులు, పెట్టుబడిదారులు ఇద్దరూఉండాలి. కానీ ఒక వర్గాన్ని మరొక వర్గం దోపిడీ చేస్తే వ్యవస్థ మనుగడ అసాధ్యం. ఈ నేపథ్యంలో ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక, ప్రజాస్వామ్య హక్కులకు వ్యతిరేకంగా ఉన్న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ఆర్థిక విధానాలను మార్చుకోవాలి. ప్రభుత్వ సంస్థ అయిన ఆర్‌బిఐ దాదాపు రూ.2లక్షల కోట్లు ప్రభుత్వ నిర్వహణ ఖర్చుల కోసం బదిలీ చేసింది. ఆర్‌బిఐ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ లాంటి ప్రభుత్వ ఆర్థిక సంస్థలను ప్రభుత్వం మరింతగా బలోపేతం చేసి దేశ ఆర్థిక రంగం అభివృద్ధికి ఈ సంస్థలను ఇంజన్‌గా మార్చాల్సిన అవసరం ఉంది.

## 566 ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలు 570 ఉండగా, ఎంపిటిసిలు 5817 స్థానాలు, గ్రామ పంచాయతీలు 12,848 ఉన్నాయి. కాగా రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 33 జెడ్‌పిటిలు, 33 ఎంపిపిలు, 353 ఎంపిటిసి స్థానాలు ఉండగా, అత్యల్పంగా ములుగులో పది జెడ్‌పిటిసిలు, పది ఎంపిపిలు, 83 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి.

| | జిల్లా పేరు | జెడిపిపిలు | జెడ్‌పిటిసిలు | ఎంపిపిలు | ఎంపిటిసిలు |
|---|---|---|---|---|---|
| 1 | ఆదిలాబాద్ | 1 | 20 | 20 | 166 |
| 2 | భద్రాది కొత్తగూడెం | 1 | 22 | 22 | 233 |
| 3 | హనుమకొండ | 1 | 12 | 12 | 129 |
| 4 | జగిత్యాల | 1 | 20 | 20 | 216 |
| 5 | జనగాం | 1 | 12 | 12 | 134 |
| 6 | జయశంకర్‌భూపాలపల్లి | 1 | 12 | 12 | 109 |
| 7 | జోగులాంబ గద్వాల | 1 | 13 | 13 | 142 |
| 8 | కామారెడ్డి | 1 | 25 | 25 | 233 |
| 9 | కరీంనగర్ | 1 | 15 | 15 | 170 |
| 10 | ఖమ్మం | 1 | 20 | 20 | 283 |
| 11 | కుమురంభీమ్ ఆసిఫాబాద్ | 1 | 15 | 15 | 127 |
| 12 | మహబూబాబాద్ | 1 | 18 | 18 | 193 |
| 13 | మహబూబ్ నగర్ | 1 | 16 | 16 | 175 |
| 14 | మంచిర్యాల | 1 | 16 | 16 | 129 |
| 15 | మెదక్ | 1 | 21 | 21 | 190 |
| 16 | ములుగు | 1 | 10 | 10 | 83 |
| 17 | నాగర్ కర్నూల్ | 1 | 20 | 20 | 214 |
| 18 | నల్లగొండ | 1 | 33 | 33 | 353 |
| 19 | నారాయణపేట్ | 1 | 13 | 13 | 136 |
| 20 | నిర్మల్ | 1 | 18 | 18 | 157 |
| 21 | నిజామాబాద్ | 1 | 31 | 31 | 307 |
| 22 | పెద్దపల్లి | 1 | 13 | 13 | 137 |
| 23 | రాజన్న సిరిసిల్ల | 1 | 12 | 12 | 123 |
| 24 | రంగారెడ్డి | 1 | 21 | 21 | 230 |
| 25 | సంగారెడ్డి | 1 | 26 | 26 | 271 |
| 26 | సిద్దిపేట | 1 | 26 | 26 | 230 |
| 27 | సూర్యాపేట్ | 1 | 23 | 23 | 235 |
| 28 | వికారాబాద్ | 1 | 20 | 20 | 227 |
| 29 | వనపర్తి | 1 | 15 | 15 | 133 |
| 30 | వరంగల్ | 1 | 11 | 11 | 130 |
| 31 | యాదాద్రి భువనగిరి | 1 | 17 | 17 | 178 |
| మొత్తం | | 31 | 566 | 566 | 5773 |

## నిపుణుల కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

కావడంతో తక్షణమే నిర్వహణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా ఎన్‌డిఎస్‌ఎ సూచనల మేరకు డ్యామ్ మరమ్మతులను చేపట్టేలా నిర్ణయించినట్లు తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించిన అన్ని సమస్యలను శాశ్వత పరిష్కారం దిశగా ఇరు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ అధికారులు, ఇంజనీర్లు, నీటి పారుదల రంగ సాంకేతిక నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని సిఎం వివరించారు. ఈ కమిటీ అన్ని అంశాలను అధ్యయనం చేసి నెల రోజుల్లో నివేదిక అందజేస్తుందన్నారు. ఆ నివేదిక ఆధారంగా సమావేశాల్లో చర్చించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు.

**తెలంగాణ హక్కులను సాధించుకునేంత వరకు పోరాటం: ముఖ్యమంత్రి**

తెలంగాణ మాజీ సిఎం కె.చంద్రశేఖర్‌రావు తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు దారాదత్తం చేశారని, వాటిని తిరిగి సాధించుకునేందుకు తాము పోరాడుతున్నామని సిఎం రేవంత్‌రెడ్డి మీడియాకు చెప్పారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సమావేశం మాత్రమేనని, కేంద్ర జలశక్తి శాఖ వేదిక మాత్రమే కల్పించిందని సిఎం ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని ఆయన నిష్పక్షపాతంగా జడ్జి పాత్రను పోషిస్తున్నారని రేవంత్‌రెడ్డి మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. రెండు రాష్ట్రాల కమిటీకి విశ్వసనీయత ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన అంశాలే ఇప్పటివరకు పరిష్కారం కాలేదని, ఇలా ప్రతి దానిని అనుమానించుకుంటూ పోతే సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జఠిలం అవుతాయన్నారు. కొందరు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాలు ఇదే విధంగా కొనసాగాలని చూస్తున్నారన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరామ్ నాయక్, గడ్డం వంశీ, కడియం కావ్య పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర జలశక్తి మంత్రి ఈ సమావేశం ఏర్పాటు చేశారని, ఇది తెలంగాణ విజయంగా భావించాలని సిఎం వ్యాఖ్యానించారు.

**పూర్తి సానుకూల వాతావరణంలో భేటీ**

తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలపై చర్చించేందుకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు పూర్తి సానుకూల వాతావరణంలో జరిగింది. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం సుమారు గంటన్నర పాటు కొనసాగింది. ఇరు రాష్ట్రాల ప్రతిపాదించిన అంశాలనుతో కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన ఎజెండాపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎంపి మంత్రినిమ్మల రామానాయుడు, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ కార్యదర్శులు, పలువురు ఇంజినీర్లు హాజరయ్యారు. భేటీకి ముందు ఆయా రాష్ట్రాల అధికారులతో ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలు, సాంకేతికంగా ఇవ్వాల్సిన సమాధానాలపై చర్చించారు. ఇందులోభాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీలోని తమ తమ అధికారిక నివాసాల్లో గంటకు పైగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు, ఎపి మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశాల వివరాలను మీడియాకు వివరించారు.

**స్నేహపూర్వక వాతావరణంలో ఢిల్లీ సమావేశం : ఎపి మంత్రి నిమ్మల**

రాష్ట్రాలు వేరైనా, పార్టీలు వేరైనా తెలుగుజాతి ఒకటేనన్న స్నేహపూర్వక వాతావరణంలో ఢిల్లీ సమావేశం జరగటం గొప్ప శుభ పరిణామమని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మూడు ముఖ్యాంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన నివేదిక పైన , తెలంగాణ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాల పైన సానుకూల స్పందన వ్యక్తం అయినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నందున ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఒక కమిటీ వేయాలని ఉభయ రాష్ట్రాలు నిర్ణయించినట్లు నిమ్మల స్పష్టం చేశారు. ఈ కమిటీ సిడబ్ల్యుసి ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. కాలయాపన లేకుండా వచ్చే సోమవారం లోపు కమిటీ ఏర్పాటు అవుతుందన్నారు. అలాగే గోదావరి నది నుంచి ఏటా సముద్రంలో కలసిపోతున్న 3000 టిఎంసిల నీటి వృధాపై కూడా కమిటీ ఆరా తీసి తమ నివేదికలో పొందుపరుస్తుందని మంత్రి రామానాయుడు చెప్పారు.

## ఆత్మగౌరవంతో జీవించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు.గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డి లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని అన్నారు. కోటీ మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయల మహిళలకు వడ్డి లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పామాయిల్ పంట పెద్దపెల్లి జిల్లాలో విస్తారంగా పండించాలని, ఎకరానికి నాలుగు సంవత్సరాలలో 51 వేల రూపాయల సబ్సిడీ అందిస్తామని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబ రాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు 26 వేల కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని అన్నారు. మంథని కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో మహిళా సంఘాల ద్వారా మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటు న్నామని అన్నారు. మహిళల ద్వారా రైతులు పండించిన పంటను మద్దతు ధరతో కొనుగోలు చేశామని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ అందుకున్న విజయం అందరికి పంచుద్దామనే నినాదంతో మహిళా సంఘాలలో నూతన సభ్యులను చేర్చాలని, 60 సంవత్సరాల దాటిన వారు ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దివ్యాంగ సంఘం ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని మంత్రి అన్నారు. మహిళా సంఘాలకు అందించిన రుణాలు 99 శాతం తిరిగి చెల్లిస్తున్నామని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో కూడా నేడు 4 మహిళ సభ్యులకు కుటుంబాలకు 10 లక్షల రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. 60 సంవత్సరాల నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో 16 వేల 800 స్వశక్తి మహిళా సంఘాలకు 15 కోట్ల 74 లక్షల రూపాయలు వడ్డీ సబ్సిడీ కింద ఇప్పటి వరకు విడుదల చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 67 మంది సంఘ సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా క్రింద 87 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మరోసారి ప్రవేశపెట్టిందని, మహిళల చేతిలో డబ్బులు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించ లేదని అన్నారు. పెద్దపల్లి ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, సుల్తానాబాద్ మండల సమాఖ్యల ద్వారా ఆర్టీసీ సంస్థకు ఏర్పాటు చేసిన అద్దె బస్సుల మొదటి నెల ఆదాయం 3 లక్షల 47 వేల 340 రూపాయలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్య క్రమంలో అదనపు కలెక్టర్‌లు పి.వేణు, జే.అరుణ శ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగ య్య, సురేష్, జెడ్పీ సిఈఓ నరేందర్, డిఆర్డిఓ ఎం.కాళిందిని, డిపిఓ వీర బుచ్చయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారీ, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బిసి రిజర్వేషన్లపై బిజెపి గోబెల్స్ ప్రచారం మానుకోవాలి : జాజుల

ప్రజాపక్షం / హైదరాబాద్ : బిసి రిజర్వేషన్ల పెంపుపై బిజెపి, బిఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లపై జిఒ ఇచ్చినా, ఆర్డినెన్స్ తెచ్చినా కోర్టులలో నిలవదని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఒబిసి మహాసభ పోస్టర్‌ను ఆయనతోపాటు పలువురు బిసి నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు బిసి రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. 42శాతం బిసిల రిజర్వేషన్లలో 10శాతం ముస్లింలకు పోతున్నందున తాము ఈ బిల్లును ఆమోదించబోమని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు.

## రాష్ట్రంలో అగ్రభాగాన తెలుగు వర్సిటీ

### విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ

ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : రాష్ట్రంలోనే తెలంగాణ విశ్వవిద్యాలయం అగ్రభాగాన ఉందని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బుధవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో రెండవ స్నాతకోత్సవం జరిగింది. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం పేరుతో ఏర్పాటు చేసిన తెలంగాణ విశ్వవిద్యాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని గర్వంగా చెబుతున్నానని తెలిపారు. చైతన్యవంతమైన ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు విశ్వవిద్యాలయ అభివృద్ధికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. 2006 లో ఆరు కోర్సులతో ప్రారంభమై నేడు ఏడు విభాగాలలో 24 ఉప విభాగాలుగా 31 కోర్సులతో భిక్కనూర్, సారంగాపూర్ క్యాంపసుల్లో సహా ఇక్కడ క్యాంపస్‌లో విద్యావికాసం చెందడం ఆనందంగా ఉందన్నారు. గడిచిన 19 సంవత్సరాల కాలంలో ఇక్కడి అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకుల ఉమ్మడి కృషి అంకితభావం ప్రతిబింబిస్తుందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లు విద్య అంతిమ లక్ష్యం సృజనాత్మకమైన మానవుని తయారుచేయడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ, చారిత్రాత్మకమైన అభివృద్ధిని సృష్టించడం అన్నారు. ఈ స్నాతకోత్సవంలో ప్రొఫెసర్లు ప్రవీణ్, హారతి, నాగరాజు, కనకయ్య, విద్యావర్ధిని, నాగరాజు పాత, పిఆర్ఓ. డైరెక్టర్ పున్నయ్యలతో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.






**ప్రముఖులతో గవర్నర్ ఇష్టాగోష్టి**
**ఫొటో ఎగ్జిబిషన్ సందర్శన**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాకు చెందిన వివిధ రంగాలలో ప్రఖ్యాతి గాంచిన కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు పలు రంగాలకు చెందిన ప్రముఖులతో ఇష్టాగోష్టి జరిపారు. తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌కు విచ్చేసిన గవర్నర్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్య నారాయణ, రాకేష్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సిపి సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి గవర్నర్‌కు పూలబొకేలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మొదటగా సందర్శించారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ఆయా శాఖల కార్యక్రమాల వివరాలను తెలియజేయగా గవర్నర్ ఎంతో ఆసక్తితో ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారిని అభినందిస్తూ వారితో ప్రముఖులతో గవర్నర్, జిల్లా అధికారులతో కలిసి ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కార్మిక హక్కులకు మంగళం
# మత రాజకీయాలకు బిజెపి ఊతం

### పేదల పక్షాన సిపిఐ నిర్విరామ పోరాటం

**సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి**

ప్రజాపక్షం/దేవరకొండ: కార్మిక హక్కులకు మంగళం పాడి.. మత రాజకీయాలకు ఊతమిస్తున్న బిజెపిని ప్రజలు, కార్మికులు ఏకమై ఎప్పటికప్పుడు నిలువరించాల్సిందేనని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎంఎల్‌సి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా 23వ మహాసభలో ఆయన మాట్లాడుతూ మేకిన్ ఇండియా అన్నారు, అచ్చేదిన్ అన్నారు. స్వచ్ భారత్ అంటూ కాలక్షేపం చేస్తున్నారే తప్ప మోదీతో దేశ ప్రజలకు ఒరిగేదేమిలేదని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అడవుల్లో ఉన్న నక్సలైట్లను అంతం చేస్తామని మోదీ ప్రభుత్వం శపథం పూనడం సమంజసం కాదని దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగితే పేదరికం లేకుంటే ఉద్యమకారుల ఉద్యమం చేయాల్సిన అవసరం ఉండదని ఆ దిశగా ఆలోచించని అభివృద్ధి చేయని బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడవుల్లో సంపదను కొల్లగొట్టే ఆలోచనతో నక్సలైట్లను అంతం చేయాలని దుర్మార్గపు ఆలోచనకు తెరలేపిందని అన్నారు. కమ్యూనిస్టులను నిలువరించాలనే బిజెపి ఆలోచన మూర్ఖత్వం అని కమ్యూనిస్టులను అంతం చేయాలంటే బిజెపి తరం కాదని అన్నారు. ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే ఎజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడికి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలోని బిజెపి మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విధంగా మళ్ళీ సిలిండర్ ధర పెంచడం, ఎరువుల ధరలు పెంచడం అన్యాయం అని అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాలు సబ్సిడి మీద ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అధిక నిధులు కేటాయించి నక్కలగండి, ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టుల పనులతో పాటు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్‌లు పూర్తి చేసి నల్గొండ జిల్లా రైతాంగానికి తాగు, సాగు నీరు అందించి సస్యశ్యామలం చేయాలని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను బేషరతుగా ప్రజాపాలనలో అమలు చేసి ప్రతి పేద బడుగు బలహీన వర్గాలకుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. స్థానిక సంస్థల్లో పొత్తులో భాగంగా కాంగ్రెస్, సిపిఐ మెజార్టీ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు త్యాగాలు నేటి తరానికి అందించి యువతను కమ్యూనిస్టు పార్టీలోకి ఆహ్వానించాలని అన్నారు. పార్టీలో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండేలా కమిటీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహాసభలో భవిష్యత్ పోరాట కార్యక్రమాలకై పలు తీర్మానాలను చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభకు పల్లా దేవేందర్‌రెడ్డి , టి. వెంకటేశ్వర్లు, బొల్లె మంజుల అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, రత్నాకర్‌రావు, యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యానాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు వీరస్వామి, అంజాచారి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, నర్సింహా, రామచంద్రం, రామలింగయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, మురళీకృష్ణలు పాల్గొన్నారు.

> **సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా మరోసారి సత్యం**
>
> సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండ పట్టణంలో ఈనెల 15వ తేదీ మంగళవారం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. మహాసభలో జిల్లా కార్యదర్శిగా నెల్లికంటి సత్యం మరోసారి ఎన్నిక కాగా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్ లతోపాటు 45మంది కౌన్సిల్ సభ్యులు, 13మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ బలమైన ఉద్యమాలు

### పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులు నిర్ణీత కాలవ్యవధిలోనే పూర్తి

**సిపిఐ నూతన జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని, జిల్లాలో పోరాట చరిత్ర ఉన్న సిపిఐకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని సిపిఐ జిల్లా కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మహాసభ వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ సాగునిటీ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిర్ణీత కాలవ్యవధిని ప్రకటించి అందుకు సరిపడా అధిక నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాని కోరారు. కరువు పీడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజక



వర్గాలను సస్యశ్యామలం చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేయడనికి నీటిని తరలించుకుపోయేందుకు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టును సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మునుగోడు ప్రాంతంలోని కిష్టాపురం గట్టుప్పల చిట్యాల మండలంలోని వెలిమినేడు, పిట్టంపల్లి ప్రాంతాలలో విచ్చలవిడిగా ఫార్మ కంపెనీ నెలకొల్పేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని వాటిని తీవ్రంగా వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ ప్రాంతంలోని దివిస్ ఇలాంటి కెమికల్ కంపెనీ ద్వారా వెలువడే కాలుష్యం తో ఆ ప్రాంతం ప్రజలు తీవ్రమైన అనారోగ్యాల గురవుతున్నారని ఆ ప్రాంతంలో ఎక్కడ బోర్ వేసిన కెమికల్ ఆయిల్ తో కూడిన రంగు మారిన కెమికల్ నీరే వస్తుందని పేర్కొన్నారు. అలాంటి దివిస్ కంపెనీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు.

జిల్లా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నదని ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆయిల్ ఫామ్ పంటల సాగుకు మొగు చూపుతున్న నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమలను నెలకొల్పాన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు,ఎస్ సి వర్గీకరణ లాంటి అంశాలను సిపిఐ స్వాగతిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్లుగరి నర్సింహా, గురిజ రామచంద్రం, నల్ప రాజు రామలింగయ్య,టి వెంకటేశ్వర్లు,ప్రజ్యానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి లు పాల్గొన్నారు.



## పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం

### ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ బృందంతో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్: టెక్నాలజీ తదితర పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమైన ప్రాంతమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ మార్క్ లేమి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. రాష్ట్రంలో వనరులు ఇతర అంశాలను అధ్యయనం చేయాలని డిప్యూటీ సిఎం ఫ్రాన్స్ బృందానికి సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రైవేటీకరణకు బిజెపితో కలిసి కాంగ్రెస్ కుట్ర

ప్రజాపక్షం/హైదరాబాద్:తెలంగాణ రాష్ట్ర బొగ్గు గని కార్మిక సంఘం బిఆర్ఎస్‌కు అనుబంధంగా అనేక కార్యక్రమాలను చేపట్టాలని, ఆ దిశగా సింగరేణి ప్రాంత పరిధిలోని పార్టీకి చెందిన ఎంఎల్ఎలు, ఇన్‌చార్జులు, మాజీ మంత్రులతో సమన్వయం చేసుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సూచించారు. బిఆర్ఎస్ తరపున తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఇన్‌చార్జ్‌గా బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తారని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో కెటిఆర్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మిక సమస్యలపై మరింత పెద్ద ఎత్తున పోరాటం చేయాలన్నారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రభుత్వంపై అనేక రూపాల్లో ఒత్తిడి తీసుకురావాలని, పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల కోసం, అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగాకార్మికుల్లోకి తీసుకుపోవాలని సూచించారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణ కోసం బిజెపితో కలిసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై గళమెత్తాలన్నారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా బిఆర్ఎస్ అండగా నిలబడుతుందని, కార్మికుల కోసం పార్టీ లీగల్ సెల్ కూడా పూర్తిస్థాయి అండగా ఉంటుందని, ఏ కార్మికునికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసినా,చట్టబద్ధంగా ఎదుర్కొనేందుకు లీగల్ సెల్ సహకారం అందిస్తుందని కెటిఆర్ వివరించారు..

**మేడిగడ్డ బ్యారేజిపైన చర్చకు రావాలి**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూలేశ్వరం అని చెబుతున్న సిఎం రేవంత్‌రెడ్డి, మేడిగడ్డ బ్యారేజ్‌పైన చర్చకు రావాలని, తమ సవాల్‌ను స్వీకరించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు అన్నారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రతి ఒక్క దళిత బిడ్డకు దళిత బంధును వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన 'దళితబంధు సాధన సమితి' సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ దళితబంధుపై విధించిన ఫ్రీజింగ్‌ను వెంటనే తొలగించి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ 12 లక్షలదళితబంధును ప్రారంభించాలని, ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు బిఆర్ఎస్ తరపున లేఖ రాస్తామన్నారు.



కేవలం ఓట్లు, సీట్ల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం దళితబంధు కాదని, దళితుల జీవితాల్లో సంపూర్ణ, సమగ్ర మార్పును తీసుకొచ్చేందుకు చేపట్టిందే దళిత బంధు అని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన ప్రతి హామీని తుంగలో తొక్కి, వారిని నిలువున మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తమపైన ఎన్ని కేసులు పెట్టినా, అణిచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక, మోసపూరిత విధానాలను ఎండగట్టేందుకు తాము ఏమాత్రం వెనుకాడబోమని కెటిఆర్ అన్నారు. సిఎం దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థలల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన శాస్తి చెబుతారన్నారు. రాజకీయాలల్లో తిట్లు వాడడం తమకు ఇష్టం లేదని, కానీ సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన భాషలో చెబితేనే అర్థమవుతుందని కెటిఆర్ అన్నారు.

## సిపిఐ నేత చందు హత్యపై దర్యాప్తు ముమ్మరం

*** అదుపులో అనుమానితులు * సిసిటివిలో కీలక సమాచారం లభ్యం**

ప్రజాపక్షం/హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేతావత్ చందు రాథోడ్ దారుణ హత్య ఘటనలో హైదరాబాద్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

ముగ్గురు అనుమానితులను మలక్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై 150 సిసిటివిలను దర్యాప్తు అధికారులు పరిశీలించారు. సిసిటివిలలో నిందితులకు చెందిన కీలక సమాచారం లభ్యమైనట్లు తెలిసింది. నిందితుల అక్రమ వసూళ్లు, దందాలకు చందు అడ్డు వస్తున్నాడని.. అడ్డు తొలగించుకునేందుకే హత్యకు పాల్పడి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మలక్‌పేట పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో రాజేష్ అలియాస్ రాజన్న, ప్రశాంత్, ఏడు కొండలు తదితరుల పేర్లు చేర్చి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పలు పోలీసు బృందాలు వేరువేరు ప్రాంతాల్లో దర్యాప్తు జరిపాయి. ఒక పోలీసు బృందం మహబూబాబాద్ జిల్లాకు వెళ్లి అక్కడ ప్రధాన నిందితుడి కోసం గాలింపు చేపట్టింది. ప్రధాన నిందితుడు రాజేష్‌పై మహబూబాబాద్ జిల్లా, గార్ల బయ్యారం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 87/2012పై ఐపిసి 384, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అలాగే ఇదే పోలీసు స్టేషన్‌లో 2013లో క్రైమ్ నెంబర్ 13, 14 ఈ రెండు కేసుల నమోదయ్యాయి. అక్రమ ఆయుధాలు, కిడ్నాప్‌లు, బెదిరింపుల కేసులు ఉన్నాయి. అదుపులోకి తీసుకున్న అనుమానితులను డిసిపి చైతన్య, అదనపు డిసిపి శ్రీకాంత్‌లు విచారిస్తున్నట్లు సమాచారం. అయితే చందు హంతకులకు ఎవరెవరు సహకరించారనే అంశం పై పోలీసులు దృష్టి సారించారు. అనుమానితుల సెల్‌ఫోన్ డేటా, హతుడి సెల్‌కు వచ్చిన ఫోన్ కాల్ లిస్టులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.

**అదీ అద్దె కారు..**

చందు హత్యకు నిందితులు ఉపయోగించిన టిఎస్ 08 హెచ్‌డబ్ల్యూ 0875 స్విఫ్ట్ కారు అద్దె కారని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కారు ను ఏడు కొండలు తన ఆధార్ కార్డుతో లాగ్ డ్రైవ్ కార్ జోన్ కార్యాలయంలో అద్దెకు తీసుకున్నట్లు, తిరిగి అదే కారులో షాలివాహన నగర్ పార్క్ వద్దకు వచ్చి చందుపై కాల్పులు జరిపి పారిపోయినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం 7:30 గంటలకు కాల్పులు జరిపిన తరువాత 8:10 గంటలకు కారును తిరిగి యజమానికి ఏడు కొండలు అప్పగించి బిల్లు డబ్బులు కూడా చెల్లించినట్లు, అక్కడి నుంచి ఓలా బైక్ బుక్ చేసుకుని ఏడుకొడలు పారిపోయాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. హత్యకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## రాజేష్ లిబరేషన్ పార్టీ సభ్యుడు కాదు... మూడేళ్ల క్రితం తొలగించాం

### చందు హత్యను ఖండిస్తున్నాం: సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ నాయకుడు చందు నాయక్ హత్య ఘటనలో నిందితుడిగా ఉన్న దొంతి రాజేష్‌కు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తో ఏలాంటి లేదని, ఆయనను పార్టీ నుంచి మూడేళ్ల క్రితమే తొలగించామని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ ఇంఛార్జీ కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో లిబరేషన్ పార్టీలో కొంతకాలం రాజేష్ పని చేసిన మాట వాస్తవమే కానీ, సెటిల్మెంట్ దందాలు, ఇతర ఆరోపణల నేపథ్యంలో ఆయనను మూడేళ్ల క్రితం పార్టీ నుంచి తొలగించినట్లు వారు వెల్లడించారు. సిపిఐ నాయకులు చందు నాయక్ హత్య ఘటనను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, హత్య రాజకీయాలను ప్రోత్సహించబోదని వారు తెలిపారు. హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 2026 దసరాకి ఉప్పల్ ఫ్లైఓవర్ పూర్తి

### కాంగ్రెస్ హయాంలో శరవేగంగా పనులు

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

ప్రజాపక్షం/మేడ్చల్: హైదరాబాద్ ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేర కు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2026 దసరా నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఉప్పల్ నుండి నారపల్లి వరకు నిర్మాణంలో ఉన్న 6.25 కి.మీ పొడవైన ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి, ఆర్అండ్ బి జాతీయ రహదారి విభాగం ఎస్ఈ ధర్మారెడ్డితో కలిసి మంత్రి వెంకట్‌రెడ్డి ఫ్లైఓవర్ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాదగిరిగుట్ట, భువనగిరి, వరంగల్ రహదారిపై దాదాపు ఎనిమిదేళ్ల కింద ప్రారంభించిన ఫ్లైఓవర్ పనులు ఆర్థిక వనరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఫ్లైఓవర్‌పై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో సైతం చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మొన్నటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌ను సైతం మార్చి కొత్త వారికి పనులు అప్పగించామని, ప్రత్యేక శ్రద్ధతో పనుల్లో వేగాన్ని పెంచి పరితగతిన పూర్తి చేస్తామన్నారు. నగరంలో పివి ఎక్స్‌ప్రెస్ హైవే తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్‌గా ఉప్పల్ ఫ్లైఓవర్‌కు పేరున్నదన్నారు.

స్థానిక ఎంపి ఈటల రాజేందర్, ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి ఎప్పటికప్పుడు ఈ ఫ్లైఓవర్ పనుల వేగవంతంపై తనను కోరుతుంటారన్నారు. యాదగిరి గుట్టకు వెళ్లే భక్తులు, వరంగల్, జనగామ, యాదాద్రి జిల్లాల ప్రజలు ఈ రహదారిని అధికంగా ఉపయోగిస్తున్నారని, వారి ఇబ్బందులు తొలగించేందుకు ఇది కీలకమైన ప్రాజెక్ట్ అని మంత్రి పేర్కొన్నారు.





## బిసి రిజర్వేషన్లలో సబ్‌కోటా కల్పించాలి: ఎమ్మెల్సీ కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్:బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో, అందులో సబ్ కోటా కల్పించడం కూడా అంతే ముఖ్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో యుపిఎఫ్ యుపిఎఫ్ నాయకులు, 72 కులాల ప్రతినిధులతో కవిత బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు 25వేల మంది బిసి బిడ్డలకు రాజకీయ పదవులు దక్కితే, అందులో సగం పదవులు ఆడబిడ్డలకే వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.


**సర్టిఫికేట్స్ పోయినది**

బొడ్డుపల్లి దీప్తి తండ్రి లింగయ్య, ఇంటి నెంబర్ : 3-17/1, కుమ్మరి బజార్, ఎల్లారెడ్డిగూడెం, నార్కట్ పల్లి మండలం, నల్గొండ జిల్లా గారికి చెందిన ఎస్ఎస్‌సి మెమో, ఇంటర్ మెమో, బిటెక్ మెమో మరియు 1వ తరగతి నుండి బిటెక్ స్టడీ కండక్ట్‌లు ఇంటి నుండి మహాత్మా గాంధీ యూనివర్సిటీకి బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో పోయినవి. దొరికిన వారు తిరిగి అందజేసిన యెడల తగిన పారితోషికం ఇవ్వబడును.

సెల్ నెంబర్ : 99480 47900

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.9, చార్మినార్ జోన్.

NIT No.: Short Tender Notice No. 25/EE-Div.No9/GHMC/25-26 షార్ట్ టెండర్ ప్రకటన తేది: 14.07.2025

**పని వివరణ:** నిర్వహణ పనులు (10) నెం.లు, **అంచనా విలువ:** రూ.41.85 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 16.07.2025న మ.03.00గం.ల నుండి , స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 19.07.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరి కిషోర్, సెల్ నెం. 9849906768.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-9, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 5077-PP/CL/ADVT/1/2025-26, Date: 16-07-2025

**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, డివిజన్ :: గజ్వేల్

NIT No. 07/EE/R&B/GJWL/2025-26, తేది: 14.07.2025

**క్ర.సం.1, పని పేరు:** సిద్దిపేట జిల్లాలోని భూంపల్లి - దొమ్మట రోడ్డులోని అక్బర్‌పేట మరియు భూంపల్లి గ్రామ పరిమితుల్లో 0/320 నుండి 0/735 వరకు మరియు 1/740 నుండి 2/300 వరకు తుఫాను నీటి కాలువ నిర్మాణం, **అంచనా విలువ:** రూ.50.00లక్షలు, **బిడ్ దాఖలుకు ఆఖరి తేది:** 29.07.2025న మ.3.30గం.ల వరకు, **సంప్రదించవలసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), డివిజన్ : గజ్వేల్, సిద్దిపేట జిల్లా. ఫోన్: 8333922719. మరిన్ని వివరాలకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), డివిజన్ : గజ్వేల్.

DIPR R.O. No. : 5064-PP/CL/ADVT/1/2025-26, Date: 16-07-2025

ప్రజాపక్షం
గురువారం, 17 జులై

# గణాంకాలు కడుపు నింపవు

పేదరికంపై వెలువడుతున్న గణాంకాలు వాస్తవాలను మరుగునపడేస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ నివేదికల నుంచి కేంద్ర ప్రభుత్వ లెక్కల వరకూ అన్నింటిలోనూ లక్షలాది మంది పేదరికం నుంచి బయటపడ్డారన్న సమాచారమే. ఆకలి కేకల రోజులకు తెరపడిందంటూ సంబరమే. అయితే, వాస్తవం దీనికి పూర్తి విరుద్ధం. ఆకలి పెరుగుదల సూచీలు పేదరిక పరిస్థితులను కళ్లకు కడుతున్నాయి. మన దేశంలో కేవలం ఐదు శాతం మంది మాత్రమే పేదరికంలో ఉన్నారన్నది ప్రపంచ బ్యాంక్ నివేదిక సారాంశం. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోనేగాక, పట్టణ జనాభాలోనూ ఆకలి సూచీలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆకలి పెరిగినప్పుడు పేదరికం ఎలా తగ్గింది? ఆకలిది, పేదరికానిదీ అవినాభావ సంబంధం. వాస్తవంలో లేని లెక్కలు ఎవరికి అవసరం? గణాంకాలు కడుపు నింపవు. అధికారిక నివేదికలు పేదరికాన్ని తగ్గించవు. వాస్తవ పరిస్థితులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు.. ద్రవ్యోల్బణ సూచీ.. జీవన ప్రమాణం.. కొనుగోలు శక్తి తదితరాలు మాత్రమే వాస్తవాలకు ప్రతిబింబాలు. పోషకాహార లోపం గ్రామీణ భారతాన్ని పట్టిపీడిస్తున్నదని, లక్షలాది మందిని వేధిస్తున్నదని అధికారిక ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. దారిద్ర్య రేఖ నిర్వచనంలో 'పౌష్టికాహారం' ప్రస్తావన లేకపోవడం విచిత్రం. దారిద్ర్య రేఖను వినియోదారు ధరల సూచీ ఆధారంగా నిర్వచించడం మరింత గందరగోళాన్ని, అస్పష్టతను పెంచుతున్నది. పోషకాహారాన్ని విస్మరించిన దారిద్ర్య రేఖ నిర్వచనానికి అర్థం లేదు. ధరల సూచీదీ ఇదే పరిస్థితి. ఇది కేవలం ఆహార వస్తువులను మాత్రమే సూచించదు. ఇతర వస్తుసేవల ధరలు తగ్గినంత మాత్రాన కడుపు నిండదు. దారిద్ర్య రేఖ నిర్వచనంలో పోషకాహారాన్ని వ్యూహాత్మకంగా తప్పించడం ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదు. రెండు భిన్నమైన గవాక్షాల నుంచి ఆకలిని, పేదరికాన్ని వీక్షించడం, గణాంకాలతో ఆత్మస్తుతి చేసుకోవడం వల్ల సామాన్యుడికి ఒరిగేది ఏమీ లేదు. పేదరికం తగ్గిందనే నివేదికలు ప్రజల ఆకలి మంటలు చల్లార్చవు. వివిధ మాధ్యమాల సమాచారం అందిస్తున్న సహేతుకమైన అంచనాలు గ్రామీణ పేదరికం గరిష్ట స్థాయికి చేరుకుందని, 80 శాతం మంది పోషకాహార ప్రమాణాన్ని చేరుకోలేకపోతున్నారని స్పష్టం చేస్తున్నాయి. కానీ, ప్రభుత్వానిది పాత పాటే. డేటా సేకరణ పద్ధతిని మార్చేసి, కోట్లాది మందికి నిత్యావసరాలు సరఫరా చేస్తున్నామని చెప్తున్న కేంద్రం, దేశంలో పేదరికం తగ్గిందని ఏ ప్రాతిపదికన వాదిస్తున్నది? లెక్కల్లో జిమ్మిక్కులు చేయవచ్చు... కానీ, వాస్తవ పరిస్థితులను మార్చలేరు. మార్కెట్ లేదా ఎగుమతి ఆధారిత ఆర్థిక సమాచారం నిజాలను మరుగున పడేసినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్టు కాదు. ప్రజా వస్తువుల జాబితా నుంచి ఆరోగ్యం, విద్య, పోషకాహారాన్ని తొలగించడం సర్దుబాటు ధోరణేతప్ప, పేదరిక నిర్మూలనకు కొలమానం కాదు. ప్రస్తుత ఆర్థిక విధానాలతో ధనవంతులైన అతి కొద్ది మంది లాభపడితే, జనాభాలో ఎక్కువ మందికి తమ ఆదాయాన్ని ఆహారం, విద్య, ప్రాథమిక అవసరాలకు ఖర్చు చేస్తున్నారు. మధ్యతరగతి వర్గాలు పేదలుగా.. పేదలు నిరుపేదలుగా మారుతున్నారు. పేదరికాన్ని 'సున్నా' స్థాయికి తెస్తామన్న చైనా ప్రకటనకు పోటీగా, ప్రపంచ మూడో బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నామని కేంద్రం పదేపదే ప్రకటిస్తున్నది. దేశ ప్రజల్లో పేదలు ఐదు శాతం మాత్రమేనని ప్రకటించిన నీతి ఆయోగ్ వంత పాడుతున్నది. కానీ, ఈ వాదనను నిరూపించడానికి వీలుగా, దారిద్ర్య రేఖకు ఎంచుకున్న ప్రామాణికాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. రోజుకు సగటున వంద రూపాయలు ఖర్చు చేస్తే, పేదరికం నుంచి బయటపడినట్టే లెక్క. మారిన ధరల సూచీల అంశంగానీ, వస్తుసేవల ద్రవ్యోల్బణ ప్రస్తావనగానీ లేదు. జనాభాలో రెండు శాతం మంది మాత్రమే నిరుపేదలనే అధికారిక వాదన సత్యదూరం. పోషకాహార ప్రమాణం నుండి అంచనా విధానాన్ని వేరు చేయడం ద్వారా, దారిద్ర్యరేఖ భావననే ప్రతిసారీ తెరపైకి తెస్తున్నారు. అర్థంగానీ లెక్కలు చూపిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ నుంచి నీతి ఆయోగ్ వరకూ ఏ ఒక్క సంస్థ కూడా పేదరికాన్ని ఆహార ద్రవ్యోల్బణంతోగానీ... ధరల సూచీతోగానీ పోల్చడం లేదు. నిర్వచించడం లేదు. కాకి లెక్కలతో... కల్లబొల్లి మాటలతో పేదరికం తొలగదు. పేదల ఆకలి తీరదు. తార్కికంగాలేని పద్ధతుల్లో చేసే సమీక్షలు.. వేసే లెక్కలు.. ప్రకటించే నివేదికలు ఎవరి కోసం? ఇవి రాజకీయ ప్రయోజనాలకే తప్ప.. ఏ ఒక్కరి జీవితాన్నీ మెరుగుపరచవు.. ఏ ఒక్కరి ఆకలి బాధను తీర్చవు. గణాంకాలు కాదు.. ఆకలి తీరే మార్గాలు కావాలిప్పుడు.

# వ్యవసాయ భూముల్లో తగ్గిపోతున్న సారం

దేశంలో సారవంతమైన భూముల్లో మైదానాల్లో పాక్షిక శుష్క ప్రాంతాలలో, ఒక నిశ్శబ్ద సంక్షోభం బయటపడుతోంది, ఇది వ్యవసాయం స్థితిగతులను మారుస్తుంది. వర్షపాతం లోటు, పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు, అసాధారణ వర్షాలు, వరదలు లేదా మార్కెట్ ధరల తగ్గుదల ఒకెత్తయితే నేల సేంద్రీయ కార్బన్ వేగంగా తగ్గడం, సజీవ నేల సారాంశం అయిన నేల సేంద్రియ కార్బన్, తెలుగు రాష్ట్రాల్లో భయంకరమైన రేటుతో క్షీణిస్తోంది. ఈ నష్టం తీవ్ర ప్రభావాన్ని కలిగి ఉంది. రైతులకు ఆహార భద్రతకు మాత్రమే కాకుండా వాతావరణ స్థిరత్వం పర్యావరణ స్థిరత్వానికి కూడా ప్రభావాన్ని చూపుతుంది. నేల సేంద్రియ పదార్థం, కుళ్ళిపోతున్న మొక్కల పదార్థం, సూక్ష్మ జీవులు, వేర్లు హ్యూమస్ సంక్లిష్ట మిశ్రమం మట్టి ప్రధాన భాగంలో సేంద్రీయ కార్బన్, కిరణజన్య సంయోగ క్రియ ద్వారా మొక్కల నుండి ఉద్భవించి, వేర్లు, అవశేషాలు, సేంద్రీయ ఇన్‌పుట్‌ల ద్వారా తిరిగి భూమిలోకి చక్రీయంగా పంపబడుతుంది. ఆరోగ్యకరమైన నేలల్లో, ఈ కార్బన్ సూక్ష్మ జీవుల జీవితానికి ఇంధనంగా పనిచేస్తుంది, పోషకాలు నిలుపుకుంటుంది, నీటిని నిలుపుకుంటుంది, మనం పండించే భూమికి నిర్మాణాన్ని ఇస్తుంది. కానీ ఈ జీవనిరంతర చక్రం విచ్ఛిన్నమవుతోంది. దేశమంతటా దశాబ్దాలుగా సాగుతున్న ఇంటెన్సివ్ వ్యవసాయం, అధిక దున్నడం, రసాయన ఇన్‌పుట్‌ల అధిక వినియోగం, అవశేషాలను కాల్చడం, బయోమాస్ మట్టికి తగినంతగా తిరిగి రాకపోవడం ఈ సున్నితమైన సమతుల్యతను గందరగోళంలోకి నెట్టాయి. వ్యవసాయ నేలల్లో సేంద్రియ కర్బనం స్థాయిలను పెంచడం వల్ల వాతావరణ కార్బన్ డై ఆక్సైడ్‌ను సీక్వెస్టర్ చేయడంలో సేంద్రియ కర్బనం సహాయపడుతుంది. మొక్కలు కిరణజన్య సంయోగ క్రియ సమయంలో కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి, దానిని సేంద్రియ పదార్థంగా మారుస్తాయి, ఇది కుళ్ళిన తర్వాత మట్టిలో కలిసిపోతుంది.

నేలలో సేంద్రియ పదార్థాలు పెంపొందించే పద్ధతులు అవలంబించడం, కవర్ పంటలు, పంట మార్పిడి, పప్పు ధాన్యాల పంటలు పెంచడం, కంపోస్ట్ లేదా పేడ వంటి సేంద్రీయ సవరణలు జోడించడం ద్వారా, రైతులు కార్బన్ సీక్వెస్ట్రేషన్‌కు చురుకుగా దోహదపడవచ్చు వాతావరణ మార్పులను తగ్గించవచ్చు. నేల ఆరోగ్యం సంతానోత్పత్తికి సేంద్రియ కర్బనం ఒక ముఖ్యమైన భాగం. ఇది నేల నిర్మాణం, నీటిని నిలుపుకునే సామర్థ్యం, పోషకాల లభ్యతను, సూక్ష్మ జీవుల కార్యకలాపాలను మెరుగుపరుస్తుంది. అధిక సేంద్రియ కర్బనం కంటెంట్ ఉన్న ఆరోగ్యకరమైన నేలలు కరువు, భారీ వర్షపాతం వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు మరింత స్థితిస్థాపకంగా ఉంటాయి, ఎందుకంటే అవి తేమను బాగా నిలుపుకుంటాయి, పోషకాల లీచింగ్‌ను తట్టుకోగలవు. ఇది క్రమంగా, పంట ఉత్పాదకతను కొనసాగించడంలో సహాయపడుతుంది మరియు వాతావరణ వైవిధ్యానికి హానిని తగ్గిస్తుంది. అధిక సేంద్రియ కర్బనం స్థాయిలు కలిగిన నేలలు మెరుగైన నిర్మాణం, స్థిరత్వాన్ని కలిగి ఉంటాయి, ఇది గాలి నీటి ద్వారా నేల కోతను తగ్గిస్తుంది. సేంద్రీయ పదార్థం ఒక బైండర్‌గా పనిచేస్తుంది, నేల కణాలను ఒకదానితో ఒకటి పట్టుకొని వాటి నిర్లిప్తత, రవాణాను నిరోధిస్తుంది.

సేంద్రియ కర్బనం రూట్ జోన్‌లో పోషకాలను నిలుపుకోవడంలో సహాయపడుతుంది, పోషకాల ప్రవాహాన్ని తగ్గిస్తుంది, మొక్కల పోషకవినియోగ సామర్థ్యాన్ని పెంచుతుంది. నీటి వనరుల పోషక కాలుష్యానికి గురయ్యే ప్రాంతాలలో ఇది చాలా ముఖ్యమైనది. గత డెబ్భై సంవత్సరాల క్రిందట వ్యవసాయ భూములలో 1 శాతం ఉన్న సేంద్రియ కర్బనం ఇప్పుడు డెబ్భై శాతం క్షీణతతో 0.3 శాతానికి దిగజారింది. భూములలో సేంద్రియ కర్బనం పెంచకపోతే ప్రపంచ ఆహార భద్రతకు పోషకాహారానికి రాబోయే రోజుల్లో పెను ముప్పు పొంచి వుంది.

'అధిక సేంద్రియ కార్బన్ కంటెంట్ ఉన్న నేలలు మరింత సారవంతమైన ఉత్పాదకతను కలిగి ఉంటాయి, మంచి నీటిని శుద్ధి చేయగలవు, వాతావరణ మార్పుల ప్రభావాలకు జీవనోపాధి స్థితిస్థాపకతను పెంచడంలో సహాయపడతాయి'. దీనర్థం, ఐక్యరాజ్య సమితి 2030 ఎజెం డా ద్వారా



స్థాపించబడిన అనేక అంతర్జాతీయ అభివృద్ధి లక్ష్యాలను, ముఖ్యంగా ఆకలి పోషకాహార లోపాన్ని నిర్మూలించే రెండవ లక్ష్యం సాధించడానికి గ్రహం యొక్క నేలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వాటి సేంద్రీయ కార్బన్ కంటెంట్‌ను పెంచ డం చాలా కీలకం. విలువైన, హాని కలిగించే వనరు వాతావరణం నుండి మొక్కలు లేదా సేంద్రియ అవశేషాల ద్వారా 'స్థిరపరచబడిన' తర్వాత కార్బన్ భూగర్భంలో వేరు చేయబడుతుంది తర్వాత చాలావరకు సహజ ప్రక్రియల ద్వారా నేలల్లో కలిసిపోతుంది. నేల కార్బన్ కంటెంట్‌లో జీవించి ఉన్న అలాగే చనిపోయిన భాగాలను కలిగి ఉంటుంది ఫీల్డ్ స్టబుల్, అలాగే సహస్రాబ్దాల క్రితం నుండి కుళ్ళిన పదార్థాలను కూడా కలిగి ఉంటుంది. కానీ మట్టి చెదిరిపోయినప్పుడు లేదా క్షీణించినప్పుడు, చిక్కుకున్న కార్బన్ క్షయం ఫలితంగా ఏర్పడే ఇతర గ్రీన్‌హౌస్ వాయువులు మళ్లీ వాతావరణంలోకి విడుదల చేయబడతాయి. దీని అర్థం భూమి యొక్క నేల కార్బన్ రిజర్వాయర్ వాతావరణంలోకి భారీ మొత్తంలో గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేయగలదని లేదా మనం ముందుకు వెళ్లే నిర్వహణ నిర్ణయాలను బట్టి వాటిలో ఎక్కువ భాగాన్ని సీక్వెస్టర్ చేయగలదని నివేదిక పేర్కొంది.

ఇప్పటికే, గ్రహం మూడింట ఒకవంతు నేలలు క్షీణించాయి, ఇది ప్రపంచ నేల సేంద్రియ కార్బన్ నిల్వలలో అపారమైన తగ్గుదలకు దారితీస్తుంది వాతావరణంలోకి 100 గిగాటన్నుల వరకు విడుదలైంది. పేలవమైన నేల నిర్వహణ ద్వారా నేల కార్బన్ నిల్వలకు మరింత నష్టం జరగడం ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను పరిమితం చేసే ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తుంది పెరిగిన ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, కరువులు ఇతర వాతావరణ మార్పు ప్రభావాలను నివారించవచ్చు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు విపరీతమైన వాతావరణ సంఘటనల పౌనఃపున్యం మట్టి సేంద్రియ కార్బన్ యొక్క అదనపు నష్టానికి దారి తీస్తుంది, మెరుగుదల నిర్వహణను మరింత అత్యవసరంగా చేస్తుంది. పర్యావరణ వ్యవస్థ అనగా భౌతిక వ్యవస్థ లేదా జీవ క్రియలకు అస్థిరత, అసమానత, హాని లేదా అసౌకర్యం కలిగించే విధంగా కలుషితాలను పర్యావరణంలోకి విడుదల చెయ్యటాన్ని కాలుష్యం అంటారు.

జాతీయ మట్టి సర్వే–భూ వినియోగ ప్రణాళిక సంస్థ వారు స్థానిక సాగు భూముల తీరుతెన్నులు, వాతావరణ పరిస్థితులను బట్టి ఏయే పంటలు సాగు చేసుకుంటే ఫలితం బాగుంటుందో సూచనలు ఇస్తున్నారు. ఈ మధ్య వారు ప్రచురించిన నివేదికలో తెలుగు రాష్ట్రాల్లోని భూముల్లో సేంద్రియ కర్బనం అడుగంటిందని, ఇప్పటికైనా ప్రభుత్వం, రైతులు జాగ్రత్తపడి సేంద్రియ కర్బనాన్ని కనీసం 0.7కైనా పెంచుకోకపోతే భూములు సాగు యోగ్యం కాకుండా పోతాయి. భూమిని నమ్ముకోవడం అంటే, పంట భూములు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం చేస్తూ సేంద్రియ కర్బనాన్ని పెంపొందించుకోవడం. భూమి ఆరోగ్యానికి సేంద్రి య కర్బనం ఒక ముఖ్య సూచిక. మన భూముల్లో 0.5 % కన్నా సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడం కష్టసాధ్యమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, రసాయనిక ఎరువులకు పూర్తిగా స్వస్తి పలికి ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తున్న కొందరు రైతులు మాత్రం 2.0% వరకు పెంచుకోవడం సాధ్యమేనని నిరూపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో, స్వల్పకాలంలోనే సేంద్రియ కర్బనాన్ని పెంచుకునే అనేక మార్గాలున్నాయని సూచిస్తున్నారు.

శ్రమ తక్కువ ఫలితం ఎక్కువగా ఉండాలని రైతులు భయంకరమైన గడ్డి మందుల వినియోగం చేపడుతున్నారు. కలుపు మొక్కల నివారణకు కూలీలు దొరకడం కష్టసాధ్యం అలాగే దొరికిన ఎక్కువ కూలీ అడగడంతో గిట్టుబాటు కాక సంవత్సరం వరకు కలుపు రాకుండా ఉండడానికి గడ్డి, తుంగ, పార్థీనియం, పూల గడ్డి, గారభ తదితర నివారణకు ప్రత్యామ్నాయం లేక భూమి నిస్సారమైన పర్వాలేదు బాగు పడతానేమో అనే మూర్ఖపు పట్టుదలతో రైతులు ఉన్నారు. వేల సంవత్సరాలు భూమి నమ్ముకొని పంటలు సాగు చేశారు మన పూర్వీకులు. భూసారం తగ్గకుండా చాలా పద్ధతులు అవలంభించారు. అయితే, మన రైతులు, శాస్త్రజ్ఞులు భూమిని మరచిపోయి 50 సంవత్సరాలు దాటింది. 1966 నుంచి అధిక దిగుబడి వంగడాలు, రసాయనిక ఎరువులపై, వీలుంటే నీటి పారుదల మీద అత్యంత శ్రద్ధ కనబరుస్తూ వస్తున్నారు.

ఈ 50 ఏళ్లలో భూసారం కాలక్రమేణా తగ్గింది. అది ప్రస్తుతం ఏ స్థాయికి చేరిందంటే అసలు భూమి పంటలు పండించే శక్తిని పూర్తిగా కోల్పోయే స్థితికి చేరింది. 95% భూముల్లో అతి తక్కువ సేంద్రియ కర్బనం ఉంది. నేల నమూనాలలో 95 శాతం పైగా సేంద్రియ కర్బనం 0.5% కంటే తక్కువని తేలింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు వర్షాధారపు భూముల్లో 0.1 శాతం వరకు పడిపోయినట్లు నమోదయింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం క్షేత్రాలలో కూడా 0.1 నుంచి 0.5 % వరకు ఉన్నట్లు నేల పరీక్షా ఫలితాలు నిరూపించాయి. పశువుల ఎరువులు, ఇతర సేంద్రియ ఎరువులు వాడకపోవడం, కేవలం రసాయనిక ఎరువులకే పరిమితం కావడం ఈ దుస్థితికి కారణం. సేంద్రియ కర్బనం 0.5 % కంటే తక్కువ ఉంటే పంటల ఎదుగుదల, దిగుబడులు ఆశించినంతగా ఉండదు. అలాంటి నేలల్లో పంట దిగుబడి పెంచాలంటే రైతులకు రసాయనిక ఎరువుల సాయం తప్పనిసరి. రైతులు చేసే మొదటి పని నత్రజని ఎరువుల వాడకం పెంచడం. దీనివల్ల పురుగులు, తెగుళ్ల అధికమవుతాయి. రసాయనిక పురుగు మందుల వాడకం తప్పదు. వీటి కల్తీ పెరుగుతున్నది. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల దుకాణదారుల సలహాల మీద ఎక్కువ ఆధారపడుతున్నారు. మోసాలు ఎక్కువ, సాగుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. వాతావరణ వ్యత్యాసాల వల్ల పంట దిగుబడులు ఆశించినంతగా ఉండటం లేదు. ఉన్నా గిట్టుబాటు ధరలు లేక నష్టాలే మిగులుతున్నాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ కర్బనాన్ని పెంచుకుంటే గట్టెక్కవచ్చు. రసాయనిక ఎరువులు మరీ ఎక్కువగా వాడుతున్నారు. పశువుల ఎరువు, పచ్చి రొట్ట ఎరువులు చాలా మంది రైతులు వాడటం లేదు. ఆర్థిక వృద్ధి మాటేమోగానీ, పర్యావరణపరంగా మాత్రం భారత్ ఏటికేడాదీ క్షీణిస్తోందని, వెనుకబడిపోతోందని హెచ్చరిస్తోంది సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్. 2030 నాటికల్లా ఈ భూసార క్షీణతకు అడ్డుకట్ట వేస్తామని భారత్ ఐక్యరాజ్య సమితికి హామీ ఇచ్చినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు సరికదా, ఎడారిలా మారుతున్న ప్రాంతాలు ఎక్కువ అవుతున్నాయి. 2003–05, 2011–13, 20172019, 202123 మధ్య కాలంలోనే 49 లక్షల చదరపు హెక్టార్ల భూమి ఎడారిగా మారిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

– డా.ముచ్చుకోట సురేష్‌బాబు
9989988912

# హామీల అమలుకు ఇంకెంత టైం కావాలి?



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

తెలంగాణ రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలని, రాష్ట్రం కోసం త్యాగం చేసిన అమరుల ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాలని, రాష్ట్రంలో మార్పు రావాలని కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నికల్లో కీలక పాత్ర వహించింది విద్యార్థులు.. యువకులే. కాంగ్రెస్ కూటమికి ఓటు వేయించడంలో విద్యార్థి, యువకులు కీలక పాత్ర పోషించారు. తాము ఓడిపోవడానికి కూడా విద్యార్థి, నిరుద్యోగులే కారణమని బిఆర్ఎస్ సైతం చెప్పకనే చెప్పిం ది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన నైతికత ఎంతైనా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో విద్యార్థి, యువకులకు ఇచ్చిన హామీలు అమలు కావాలి. ఆ హామీల అమలుకు ఇప్పటికే చాలా సమయం తీసుకొన్నారు. అనేక హామీలను అమలు చేశామని చెప్తున్న ప్రభుత్వం విద్యార్థుల హామీలను ఒక్కటి కూడా ఇంకా ఇప్పటికే అమలు చేయలేదు. అనాడు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అప్పటి ప్రభుత్వం చేస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై విమర్శించారు. అలా విద్యార్థి, యువకుల ఓట్లతోనే అధికారంలోకి వచ్చారు. కాబట్టి అనాడు మాట్లాడిన మాటలను గుర్తుకు తెచ్చుకొని ఆ మాటలను అమలు చేసేలా సిఎం రేవంత్ రెడ్డి పాలన సాగించాలి. సిఎంగా బాధ్యతలు చేపట్టాక వెంటనే ఉద్యోగాల నోటిఫికేషన్లు జాబ్ క్యాలెండర్ అమలుపై సమీక్ష చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల, గెలిచాక సంవత్సరంలోపే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అసలు ఏయే శాఖలో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయి? ఏ శాఖ ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారు? అనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. నిరుడు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయడంలేదు. విద్యార్థులకు రూ.5 లక్షల విలువైన విద్యా భరోసా కార్డును వడ్డీ రహిత ఆర్థిక సహాయ కార్డు అందచేత, పరిశోధన పరికరాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ఇతర విద్యా సంబంధిత చెల్లింపులు చేసుకునేలా సదుపాయాల కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించారు. అదే విధంగా ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్స్, విద్యార్థుల ఇంటింటి ఉచిత ఇంటర్నెట్ వంటి హామీల అమలుకు సత్వరమే కృషి చేయాలి. నేడు సిఎం రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉంది. గత 10 ఏళ్లలో విద్యాశాఖ మంత్రి ఉన్నా లేనట్లు ఉండే. అనాడు సమీక్షలు లేవు. రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం విద్యా రంగానికి నిధులు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇప్పటికీ రెండు బడ్జెట్‌లల్లో 7.5 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. వచ్చే బడ్జెట్‌లోనైనా 15 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్య చదువు కోసం పట్టణాలకు ప్రయాణిస్తారు. వారికి ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి. బిఆర్ఎస్ విస్మరించిన యూనివర్సిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించకుండా, వెంటనే ఆ యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి యూనివర్సిటీల టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి. యూనివర్సిటీలలో ఈసీ సభ్యుల నియామకాలు లేక పాలనపరమైన నిర్ణయాలు వీసీలు తీసుకోలేని పరిస్థితి ఉంది.

ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేలా కఠిన చట్టాలు అమలు చేసి కామన్ విద్యా విధానం అమలు చేసేలా రేవంత్ రెడ్డి కృషి జరపాలి. రాష్ట్రంలో ప్రతి విద్యా సంస్థ తప్పకుండా ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేసేలా ప్రతి పాఠశాలలో విద్యా చట్టం అమలు జరిగేలా రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నియోజవర్గానికొకటి ఏర్పాటు చేస్తున్నామని, అందుకు ప్రతిచోట నిర్మాణానికి 200 కోట్లు నిధులు కేటాయిస్తున్నామని ప్రకటించారు. మంచిదే కానీ, ఈవిధమైన నిధులు మోడల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలలకు కేటాయిస్తే బాగుంటుంది. చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా నిధులు కేటాయించాలి. పేద విద్యార్థులు చదువుకోవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం. బీఆర్ఎస్ పాలనలో గత మూడేళ్లుగా విద్యార్థులకు ఫీజు బకాయిలు సకాలంలో విడుదల చేయకుండ వారిని అరిగోస పెట్టింది. దీంతో వేలాది మంది విద్యార్థులు బకాయిలు రాక, ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏకకాలంలో మొత్తం విడుదల చేస్తామని ఆనాడు చెప్పి 19 నెలలు అవుతోంది. రీయింబర్స్‌మెంట్ విడుదలపై పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేస్తే సమస్య కొంతమేర విద్యార్థులకు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలకు ఉపశమనం కలుగుతుంది. బకాయిల విడుదల లేక అటు కళాశాల యాజమాన్యాలు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటు విద్యార్థులు కూడా అప్పులు తెచ్చి మరి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకునే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే పూర్తి స్థాయిలో విడుదల చేసి విద్యార్థులకు, గ్రామీణ ప్రాంత బడ్జెట్ కళాశాలలు ప్రజల ఇబ్బందులను తీర్చాలి. ప్రజాపాలనలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యారంగానికి మొదటి ప్రాధాన్యమిచ్చి తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని ఆశిస్తున్నాం.

# ప్రపంచ అశాంతికి ఆజ్యంపోస్తున్న యుద్ధాలు!

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో అశాంతి, అసహనాలు అసాధారణంగా పెరుగుతున్నాయి. యుద్ధాల్లో చిన్నారులు సైతం సమిధలు అవుతున్నారు. మారణహోమాలు యధేచ్ఛగా రెక్కలు విచ్చుకుంటున్నాయి. మానవత్వం మంటగలుస్తున్నది. ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మానవ హక్కుల హననాలు నిత్యకృత్యం అవుతున్నాయి. రాజకీయ కీచులాటలు రక్తం చిందిస్తున్నాయి. యుద్ధ నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. అంతర్జాతీయంగా న్యాయదేవత ఒంటరై పోతున్నది. అంతర్జాతీయ న్యాయం దూరపు కొండవలె కనిపిస్తున్నది. అంతర్జాతీయ న్యాయం అంటే మారణహోమం, మానవాళికి వ్యతిరేకంగా నేరాలు, యుద్ధ నేరాలు, హింస, బలవంతపు కిడ్నాపులు లాంటి తీవ్రమైన నేరాలకు జవాబుదారీతనం పొందడం అని అర్థం చేసుకోవాలి. పలు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, పలు జాతుల మధ్య కొనసాగుతున్న సంఘర్షణలు ప్రపంచ శాంతికి విఘాతంగా నిలుస్తున్నాయి. యుద్ధాలు నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. యుద్ధాల్లో జరుగుతున్న అఘాయిత్యాలకు అంతర్జాతీయ పౌర సమాజమే బాధ్యత వహించాలి. న్యాయం కోసం ప్రపంచ మానవాళి గళం విప్పాలి. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసిసి) తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మానవ హక్కులను పునర్ ప్రతిష్టించాలి.

### ప్రపంచ శాంతి స్థాపనకు తీవ్ర విఘాతాలు

ఉక్రెయిన్, గాజా, ఆఫ్రికాల్లో సధారణ పౌర సమాజం ఆక్రందనాలు హద్దులు దాటుతున్నాయి. ప్రపంచ స్థాయిలో మానవాళి ఎదుర్కొంటున్న ఇలాంటి వేదనలకు అంతర్జాతీయ స్థాయిలో న్యాయం కల్పించాల్సిన అవసరం ఉంది. నేటి డిజిటల్ ప్రపంచంలో బహు పాక్షికవాదం, న్యాయ సూత్రాలు పలు సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ శాంతి, జవాబుదారీతనం, బాధితులకు హక్కులను కల్పించడం మరో సవాలుగా నిలుస్తున్నది. దేశాల సరిహద్దులు దాటి రాజకీయ ప్రాధాన్యాలను మరిచి సమ న్యాయ కల్పనకు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది. నేడు సాధారణ పౌరులకు న్యాయం, జవాబుదారీతనం, మానవ హక్కుల పరిరక్షణలు పొందే కనీస హక్కులను వారికి కల్పించాలి. మారణోమం, ఊచకోతల్ని మనందరం నిర్భయంగా వ్యతిరేకించాలి. ఐసిసికి పూర్తి స్వేచ్ఛను కల్పించి సత్వర న్యాయాన్ని సుసాధ్యం చేయాలి. తీవ్రమైన నేరాలను అంతర్జాతీయ న్యాయ స్థానం తీవ్రమైనవిగా భావించాలి. పరిస్థితి మారాలంటే చట్ట పాలన, మానవ హక్కుల రక్షణ, తీవ్రమైన నేరాలకు జవాబుదారీతనం, దురాక్రమణ చర్యలను నివారించడం, మారణహోమాలకు ఐసిసి నిబద్ధతను పునరుద్ఘాటించాలి. అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు తగు శిక్షలు విధించాలి. ప్రపంచ స్థాయిలో శాంతి భద్రతలను కాపాడడం, భవిష్యత్తు దురాగతాలను నివారించడానికి ఐసిసి మెరుగైన పాత్రను నిర్వహించాలి. ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేదికగా అవగాహనలు పెంచడం, మానవ హక్కుల పరిరక్షణ సంస్థలకు మద్దతు ఇవ్వడం, సెమినార్లు/కార్యశాలలు నిర్వహించడం, ఐసిసిని బలోపేతం చేయడం, ప్రపంచ న్యాయం కోసం పరితపించడం లాంటివి విధిగా నిర్వహించాలి. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం, అమాయక బాధితులకు సత్వర న్యాయం కల్పించడం మారణహోమాలకు అడ్డుకట్ట వేయడం, మానవీయతకు పట్టం కట్టడం, మానవాళి శ్రేయస్సుకు గొడుగులు పట్టడం లాంటివి నిరంతరం కొనసాగితేనే ప్రపంచ శాంతి పావురం స్వేచ్ఛగా తిరుగుతుంది.

– మధుపాళీ

# విద్యార్థుల జీవితాలు ఆగమాగం

తమ వద్ద నుంచి బయటకు వెళ్లే విద్యార్థుల వివరాలను వెల్లడించే విషయంలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మొండిగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఎన్నెన్నో. జిల్లా మండల విద్యాశాఖాధికారుల ఆదేశాలను కూడా యాజమాన్యాలు లెక్కచేయడం లేదు. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలల్లో చేరే విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచుతూ ఉన్నారు విద్యా సంవత్సరం ప్రారంభంలో యూడైస్ పోర్టల్‌లో ప్రతి విద్యార్థి వివరాలను నమోదుచేస్తారు. ఒకవేళ పాఠశాల మారినట్టయితే సదరు విద్యా సంస్థకు చెందిన యూడైస్ ఖాతా నుంచి సదరు విద్యార్థి పేరు తొలగించాలి. అలా తొలగించిన విద్యార్థి వివరాలను 'డ్రాప్ బాక్స్'లో వేయాలి. విద్యార్థి ప్రవేశం పొందిన పాఠశాల యాజమాన్యం ఆ డ్రాప్ బాక్స్ నుంచి వివరాలు తీసుకుని తమ యూడైస్ ఖాతాలో నమోదుచేయాలి. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లే విద్యార్థి వివరాలు డ్రాప్ బాక్సు నుంచి తీసుకుని యూడైస్ ఖాతాలో నమోదుచేసిన తరువాతే సదరు పాఠశాలలో హాజరువేస్తారు. అంత వరకూ విద్యార్థి హాజరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేరు. అయితే, దీని ని చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయి. తాజా సమాచారం మేరకు వేల మంది విద్యార్థుల వివరాలు యూడైస్ ఖాతా నుంచి డ్రాప్ బాక్సుకు చేరలేదు. దీంతో వారంతా హాజరు కోల్పోతున్నారు. ప్రస్తుతం దీనిపై విద్యా శాఖలో తీవ్ర చర్చ నడుస్తోంది. ప్రైవేటు పాఠశాలలు ఫీజులు చెల్లింపు కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకువస్తుంటాయి. దీంతో అప్పటివరకు చదివిన పాఠశాల నుంచి సమీపంలో మరో ప్రైవేటు లేదా ప్రభుత్వ పాఠశాలలో చేరతారు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో చేరాలంటే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ఉండాలి. అయితే విద్యాహక్కు చట్టం వరకు 14 ఏళ్ల వరకు ఒక విద్యార్థి పాఠశాలలో చేరడానికి టీసీ అవసరం లేదు. టీసీ కోసం యాజమాన్యాలు ఒత్తిడి చేయకూడదు. ఈ నేపథ్యంలో అనేకమంది ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో మారుతున్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు యాజమాన్యాలు టీసీలు ఇవ్వడం లేదు సరికదా యూడైస్ ఖాతా నుంచి వారి పేరు తొలగించి డ్రాప్ బాక్స్‌లో వేయడం లేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది విద్యార్థుల వివరాలపై గందరగోళం నెలకొంది. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతున్నా హాజరు వేయడం లేదు. దీనిపై మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలో ప్రైవేటు యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చినా ఎక్కువమంది పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు హాజరు వేయకపోవడంతో మధ్యాన్న భోజనం కి దూరం అవుతూ ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.


– కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా

# సామాన్యుడి సంకట జీవితం

లేఖ

ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగల దేశాల్లో ప్రస్తుతం ఉన్న ఐదో స్థానం మంది 3వ స్థానానికి చేరాలని, అది మన నినాదం కావాలని భారత ప్రధాని మోదీ పదే పదే ఊదరగొడుతున్నారు. ఈ ప్రయత్నం చేయడం మంచిదే కొందరికి సులువు కావచ్చు, కానీ సగటు సామాన్యుడి పరిస్థితి ఏంటి అనేది అంతుతోచని ప్రశ్న. ఒక రకంగా చెప్పాలంటే మధ్య తరగతి బ్రతుకులు మాడిపోతున్నాయి. పేరుకే ఉద్యోగాలు ఉన్న జీతాలు పెరగక ఆదాయాన్ని సమన్వయం చేసుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని ఆంగ్ల పత్రికలలో వచ్చిన సూచికల ప్రకారం భారతదేశంలో మధ్యతరగతి ఉద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నాయి. జీతాలు పెరగక, ఇతర ఖర్చులు ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రైవేటు ఉద్యోగి వచ్చిన జీతాలు పెరగక ఉన్న జీతంతోనే జీవనం సాగించేందుకు చేస్తున్న సర్కస్ ఫీట్లు అన్ని ఇన్ని కావు. జీతం వచ్చాక కూడా కొన్ని సందర్భాల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి. దానికి మళ్ళీ వడ్డీ భారం అధికం, ప్రైవేటు ఉద్యోగాలలో మానసిక శారీరక ఆందోళనలతో ఘోరమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు. మిడిల్ క్లాస్ వ్యక్తి అదనపు ఆదాయాల కోసం ఇతర మార్గాల్ని చూడాల్సి వస్తుంది. కుటుంబంలో భార్యాభర్తలు కలిసి పని చేస్తున్నా మంచి జీవితం, ఆర్థిక పరిస్థితి సరి కావడం లేదు. ఇద్దరు పిల్లల్ని మంచి జీవితం పెంచలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వస్తోంది. మరోపక్క ఎంతో కొంత ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దాలని సిటీలలో ఉన్న కంపెనీలలో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటే ఎంత కొంత ఆర్థికంగా బలం చేకూరుతుందని భావించి సిటీకి వచ్చిన ఉద్యోగులందరూ మధ్యతరగతి ప్రజలు ఇంటి కిరాయిలను కట్టుకోవడానికి పని చేస్తున్నట్లు వాస్తవరూపం కనిపిస్తూ ఉంది. ప్రైవేట్ కార్పొరేట్‌లలో ఏ వర్గం తీసుకున్నా అన్ని రేట్లు పెరిగి.. జీతాలు పెరగకపోవడంతో ఏర్పడ్డ పరిస్థితిపై యుద్ధం చేయాల్సి వస్తోంది. కరోనా టైమ్‌లో 'వర్క్ ఫ్రం హోం' అంటే ఇష్టపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇప్పుడు ఆఫీసులకు వెళ్లి పనిచేయడమే బెటర్‌గా ఫీల్ అవుతున్నారు. ఆఫీస్ అంటే ఒక టైమింగ్ ఉంటుంది కాబట్టి. వర్క్ ఫ్రం హోం అయినా జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియదు పరిస్థితి కూడా ఉంది. ఇచ్చే జీతం టైంకి ఇస్తే చాలు ఇంక పెరిగే పరిస్థితి అంటే చెప్పనక్కర్లేదు. అంతర్జాతీయ, భారతీయ కంపెనీలలో ఉండే ధనిక పరిస్థితి ఉన్నోళ్లకి, మన శ్రమ సాంప్రదాయానికి నష్టం కలిగించిన వాళ్లకు (కావాలనే జీతాలు, పన్నులు, ఇవ్వకుండా సంస్థలు మూసివేయడం) కేంద్రం ఎంతో ఉపశమనం కల్పించింది. అది మన దేశానికి భారీ నష్టమే తప్పితే ఎలాంటి ఉపయోగం లేదు.. అదేదో జీతం పెరగకుండా జీవితంతో సతమతమవుతున్న ఉద్యోగుల పరిస్థితికి ఆదాయపు పన్నుల్లో ఎంతో కొంత మినహాయింపు ఇస్తే మధ్యతరగతి మనిషికి కొంత ఆర్థిక భరోసా ఇచ్చినట్లు అవుతుంది. మన దేశ నినాదమైన ట్రిలియన్ డాలర్, 3వస్థానానికి ఆర్థిక పరిస్థితిని తీసుకెళ్లాలని లక్ష్యం చూడగలుగుతాం.

– పట్ట హరిప్రసాద్
8790843009



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## రాజా అనుకుంటున్నాడు.. త్వరలో జైలుకెళ్తాడు:రాహుల్ గాంధీ

**గువహటటి :** అసోం సిఎం హిమంత బిస్వా శర్మపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'ఆయన రాజా అనుకుంటాడు. కానీ త్వరలో జైలుకు వెళ్తాడు' అని అన్నారు. బుధవారం అసోంలోని చాయ్‌గావ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. అసోం సిఎం హిమంత బిస్వా శర్మను తీవ్రంగా విమర్శించారు. 'అస్సాం ముఖ్యమంత్రి తనను 'రాజా' అని అనుకుంటున్నారు. కానీ త్వరలోనే ఆయన జైలులో ఉంటారు' అని అన్నారు. రాష్ట్రంలో అవినీతికి సిఎం, ఆయన కుటుంబాన్ని ప్రజలు బాధ్యులుగా చేస్తారని తెలిపారు. 'కాంగ్రెస్ ఆయనను జైలులో పెట్టదు. ప్రజలే ఆయనను జైలులో పెడతారు' అని వ్యాఖ్యానించారు. కాగా, రాహుల్ గాంధీపై సిఎం హిమంత బిస్వా శర్మ ఎదురుదాడి చేశారు. ఆయన గతంలో కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని చెప్పారు. అయితే దేశవ్యాప్తంగా అనేక క్రిమినల్ కేసులు నమోదైన రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఉన్న సంగతి మరిచిపోయారని ఎద్దేవా చేశారు.



## ఢిల్లీ పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు

### మూడు రోజుల వ్యవధిలోనే 10వ ఘటన


**న్యూఢిల్లీ :** దేశరాజధాని ఢిల్లీలోని పలు విద్యాసంస్థలకు వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసగా మూడో రోజైన బుధవారం నగరంలోని ఐదు పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఢిల్లీలోని ద్వారక, వసంత్ కుంజ్, హౌస్ ఖాస్, పశ్చిమ్ విహార్, లోది ఎస్టేట్‌లో ఉన్న ఐదు పాఠశాలలకు బుధవారం ఉదయం ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చాయి. ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్, వసంత్ కుంజ్‌లోని వసంత్ వ్యాలీ స్కూల్, హౌజ్ ఖాస్‌లోని మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్, పశ్చిమ్ విహార్‌లోని రిచ్‌మండ్ గ్లోబల్ స్కూల్, లోది ఎస్టేట్‌లోని సర్దార్ పటేల్ పాఠశాలలకు ఈ బెదిరింపులు వచ్చాయి. తరగతి గదుల చుట్టూ ఉంచిన బ్యాక్‌ప్యాక్‌లలో పేలుడు పరికరాలు ఉంచినట్లు బెదిరింపు సందేశంలో పేర్కొన్నారు. రోడ్‌కిల్, బెంజీ పేరుతో ఈమెయిల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ బెదిరింపు మెయిల్స్‌తో అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఆయా పాఠశాలల వద్దకు చేరుకున్నారు. పాఠశాలలను ఖాళీ చేయించి తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. వీటితోపాటు ఇవాళ ఉదయం 7:15 గంటల సమయంలో సెయింట్ స్టీఫెన్స్ కళాశాలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చినట్లు గుర్తించారు. మంగళవారం కూడా ఈ కళాశాలను లక్ష్యంగా చేసుకొని ఆగంతకులు బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా, గత మూడు రోజుల వ్యవధిలోనే ఢిల్లీలోని దాదాపు 10 పాఠశాలలు, ఒక కళాశాలకు ఇటువంటి బాంబు బెదిరింపులు వచ్చాయి.

## అమెరికాలో ఇరానీ ప్రజల అరెస్టులకు ఖండన

**టెహ్రాన్:** అమెరికాలో నివసిస్తున్న ఇరానీజాతీయులను వరుసగా అరెస్టులు చేయడాన్ని ఇరాన్‌లోని ఖమేనీ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ఉద్దేశపూర్వక అరెస్టుల వెనుక సరైన, న్యాయబద్ధమైన కారణాలను పోలీసులు చూపించడంలేదని విమర్శించింది. అమెరికాలో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలను అరికట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం తీవ్ర అణచివేత చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఇరాన్ ఈ విమర్శలు చేసింది. ఇరానీయులకు ఉన్న మౌలిక ప్రాథమిక హక్కులను గౌరవించాలని, వారికి వెంటనే న్యాయవాదిని సంప్రదించే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసింది. అమెరికా తీవ్ర జాతి వివక్ష పాటిస్తోందన్న విషయం దీంతో రుజువు అవుతోందని విదేశాలలో నివసిస్తున్న ఇరానీయుల తరపున వాదించే ఆ దేశ విదేశీవ్యవహారాల విభాగం డైరెక్టర్ జనరల్ అలిరెజా హషిమీ రాజా విమర్శించారు. అరెస్టుచేసిన తర్వాత ఇరానీయులపట్ల అధికారులు అమానుషంగా వ్యవహరిస్తున్నారనీ, ఇది అంతర్జాతీయ చట్టాలకు చాలా భిన్నమైనదని ఆయన విమర్శించారు. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తూ ఇరాన్‌కు, ఇరాన్ సార్వభౌమత్వానికి, ప్రాదేశిక సమగ్రతకు వ్యతిరేకంగా చర్యలు చేపడుతున్న తరుణంలో ఈ అరెస్టులు చేసి వేధింపులకు గురిచేస్తున్నారనీ, ఈ రెండింటికీ ముడిపెట్టి అమెరికాలో నివసిస్తున్న ఇరానీయులను అరెస్టులు చేసి వేధిస్తున్నారని ఆయన విమర్శించారు.

## మతమార్పిడిపై సవరించిన పిటిషన్‌పై స్పందన కోరిన 'సుప్రీం'

### నోటీసు జారీ చేసిన 'అపెక్స్ కోర్ట్'




**న్యూఢిల్లీ :** చట్టవిరుద్ధమైన మతమార్పిడిపై 2024లో సవరించిన ఉత్తర్ ప్రదేశ్ చట్టంలోని కొన్ని నిబంధనలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవా రం ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వ స్పందన కోరింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం దీనిపై స్పందన కోరుతూ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీస్ జారీచేసింది. ఇలాంటి సమస్యలను లేవనెత్తుతున్న ఇతర పెండింగ్ పిటిషన్లతో పాటు విచారణ కోసం చేసిన అభ్యర్థనను కూడా ట్యాగ్ చేసింది. సవరించిన చట్టానికి వ్యతిరేకంగా లక్నోకు చెందిన విద్యావేత్త రూప్‌రేఖవర్మ, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. 2024లో సవరించిన ఉత్తరప్రదేశ్ చట్ట విరుద్ధ మతమార్పిడి నిషేధ చట్టంలోని కొన్ని నిబంధనలను పిటిషనర్లు 'అస్పష్టంగా', 'అతిగా విస్తృతంగా'ఉన్నాయని అత్యున్నత న్యాయస్థానానికి విన్నవించారు. వాటి అస్పష్టత ప్రసంగం 'మత ప్రచారంపై ఉల్లంఘన' అని వాదించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది మాట్లాడుతూ చట్టాన్ని సవాల్‌చేసే ఇలాంటి పిటిషన్లు ఇంకా ప్రధానన్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిటిషనర్ల తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ఈ పిటిషన్ 2024లో చట్టసవరణలను మాత్రమే సవాల్ చేస్తోందని అన్నారు.ఈ పిటిషన్‌ను మే2న పరిశీలించడానికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది.న్యాయవాది పూర్ణిమా కృష్ణ ద్వారా దాఖలు చేయబడిన ఈ పిటిషన్‌ను ఈ చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (చట్టం ముందు అందరూ సమానులే), ఆర్టికల్ 19 (వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ ఆర్టికల్ 21(జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ) ఆర్టికల్ 25(మతపరమైన స్వేచ్ఛ)లను ఉల్లంఘిస్తోందని వాదించారు. చట్టంలోని 2, 3 సెక్షన్లు 'అస్పష్టంగా' అతిగా విస్తృతంగా స్పష్టమైన ప్రమాణాలు లేకుండా' నేరం అంటే ఏమిటో గుర్తించడం కష్టతరం చేసింది. 'ఈ అస్పష్టత, వాక్ స్వాతంత్ర్యం, మతప్రచారం ఏకపక్ష అమలుకు వీలుకల్పించడం, వివక్షతతో కూడిన దరఖాస్తును ఉల్లంఘిస్తుంది. అస్పష్టమైన నిబంధనలు అధికారులకు అధిక విచక్షణను ఇవ్వడం ద్వారా రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘిస్తాయి. సహేతుకమైన నోటీసు ఇవ్వడంలో విఫలమవ్వడం, అమాయక వ్యక్తులపై తప్పుడు కేసు నమోదు చేసే ప్రమాదం ఉంది' అని పిటిషన్ పేర్కొంది.'చట్టంలోని సెక్షన్ 5ను ప్రస్తావిస్తూ మహిళలందరూ తమ నేపథ్యంతో సంబంధం లేకుండా చట్టవిర్ధుమైన మతమార్పిడులకు గురవుతున్నారని, వారి స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే హానికరమైన మూస పద్ధతులను బలపరుస్తున్నారని భావించడం తప్పు' అని పిటిషన్ పేర్కొంది. మతమార్పిడులపై వివిధ రాష్ట్రాల చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లను సుప్రీంకోర్టు సీజ్ చేసింది.

## జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చట్టం తీసుకురండి
- ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్‌గాంధీ సంయుక్త లేఖ



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి పూర్తి రాష్ట్ర హోదా కల్పించడానికి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చట్టం తీసుకురావాలని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశారు. లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ కింద చేర్చడానికి ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు. గత ఐదు సంవత్సరాలుగా జమ్ముకశ్మీర్ ప్రజలు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారని ఖర్గే, గాంధీ మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ డిమాండ్ చట్టబద్ధమైనదని, వారి రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులలో దృఢంగా పాతుకుపోయిందన్నారు. గతంలో కేంద్ర పాలిత ప్రాంతాలకు రాష్ట్ర హోదా మంజూరు చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, జమ్ముకశ్మీర్ కేసు స్వతంత్ర భారతదేశంలో అపూర్వమైనదని గుర్తించడం ముఖ్యమన్నారు. ఒక పూర్తి స్థాయి రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించడం ఇదే మొదటిసారి అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ మాజీ చీఫ్ గాంధీ అన్నారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ప్రభుత్వ నిబద్ధతను స్వయంగా అనేక సందర్భాల్లో పునరుద్ఘాటించారని, 2024 మే 19న భువనేశ్వర్‌లో జరిగిన ఇంటర్వ్యూలోనూ మోదీ ఈ విషయాన్ని పేర్కొన్నారన్నారు. 'రాష్ట్ర హోదా పునరుద్ధరణ మేము చేసిన గంభీరమైన వాగ్దానం, మేము దానికి కట్టుబడి ఉన్నాము' అని చెప్పినట్లు ఖర్గే, రాహుల్ గుర్తుచేశారు. మళ్ళీ, 2024 సెప్టెంబర్ 19న శ్రీనగర్‌లో జరిగిన ర్యాలీలోనూ మోదీ తన ప్రసంగిస్తూ ఈ అంశాన్ని ప్రస్తావించారన్నారు. అదే విధంగా ఆర్టికల్ 370 విషయంలో కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామ సుప్రీంకోర్టుకు హామీనిచ్చిందని వారు ఆ లేఖలో తెలిపారు. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి పూర్తి రాష్ట్ర హోదాను మంజూరు చేయడానికి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఒక చట్టాన్ని తీసుకురావాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లడాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ కింద చేర్చడానికి ప్రభుత్వం చట్టం తీసుకురావాలని కూడా కోరుతున్నామన్నారు. లడాఖ్ ప్రజల హక్కులు, భూమి, గుర్తింపును కాపాడుతూ, వారి సాంస్కృతిక, అభివృద్ధి, రాజకీయ ఆకాంక్షలను పరిష్కరించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు అవుతుందని ఖర్గే, గాంధీ తమ లేఖలో పేర్కొన్నారు.

## బెంగాలీల పట్ల బిజెపి వైఖరికి సిగ్గుపడుతున్నా

### ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**కోల్‌కతా:** బెంగాలీల పట్ల బిజెపి వైఖరికి తా ను సిగ్గుపడుతున్నానని పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ అన్నారు. బిజెపి పాలి త రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం కోల్‌కతాలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. సిఎం మమతా బెనర్జీ నేతృత్వం లో జరిగిన నిరసన ర్యాలీలో టిఎంసి జాతీ య ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆ పార్టీ సీనియర్ నేతలతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రసంగించారు. బెంగాలీ మాట్లాడే వారందరినీ బంగ్లాదేశీ రో హింగ్యాలు అని బిజెపి పిలుస్తున్నదని విమర్శించారు. రోహింగ్యాలు మయన్మార్‌లోని వసిస్తారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ పౌ రులందరికీ సరైన గుర్తింపు కార్డులు, గుర్తిం పు ఉన్నాయని అన్నారు. 'బెంగాల్ బయటకు వెళ్లిన కార్మికులు స్వయంగా వెళ్లలేదు. వారికి నైపుణ్యాలు ఉన్నందున వారిని నియమించారు. బెంగాలీ మాట్లాడే వారిని అరెస్టు చేసి జైలులో పెడుతున్నారు. ఎందుకు? పశ్చిమ బెంగాల్ భారతదేశంలో భాగం కా దా?' అని ప్రశ్నించారు. బెంగాలీల పట్ల బిజెపి వైఖరికి తాను సిగ్గుపడుతున్నానని అన్నారు. మరోవైపు ఆ రాష్ట్రంలోని జిల్లాల్లో కూడా టిఎంసి ఆధ్వర్యంలో ఇలాంటి నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్ పర్యటనకు ఒక రోజు ముందు ఈ నిరసనలు జరుగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

## బిజెడి నాయకులపై బాష్ప వాయువు ప్రయోగం

### హింసాత్మకంగా నిరసన ప్రదర్శన



**భువనేశ్వర్ :** ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలోఓ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై బుధవారం భువనేశ్వర్‌లో పెద్ద ఎత్తున బిజెడి నిరసన కార్యక్రమాలు చేపట్టింది. పోలీసులతో జరిగిన ఘర్షణలో ఇద్దరు మాజీ మంత్రులు సహా పలువురు బిజెడి కార్యకర్తలు, నాయకులు గాయపడ్డారు. బిజెడి చేపట్టిన నిరసన ప్రదర్శన దిగువ పిఎంజి స్వేర్ వద్ద హింసాత్మకంగా మారిందని ఓ అధికారి చెప్పారు. పార్టీ నాయకలు, కార్యకర్తలు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుంటూ సచివాలయం లోక్‌సేవా భవన్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, దీంతో పోలీసులకు, నిరసన కారులకు మధ్యకు ఘర్షణలు చోటు చేసుకున్నాయన్నారు. ఆందోళన చేస్తున్న బిజెడి కార్యకర్తలను చెదరగొట్టడానికి పోలీసులు నీటి ఫిరంగులు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారని ఆయన అన్నారు. తరువాత బిజెడి కార్యకర్తలను అరెస్టు చేసి ఆందోళన స్థలం నుండి తరలించినట్లు ఆయన అధికారులు తెలిపారు. ఘర్షణలో గాయపడిన వారిలో మాజీ మంత్రులు ప్రణబ్ ప్రకాష్ దాస్, ప్రీతి రంజన్ ఘరాయ్ కూడా ఉన్నారు. ఘరాయ్‌ను తొలుత క్యాపిటల్ ఆసుపత్రికి తీసుకెళ్లి, తరువాత భువనేశ్వర్‌లోని ఉత్కల్ ఆసుపత్రిలోని ఐసియుకు తరలించారని పార్టీ కార్యకర్త ఒకరు తెలిపారు. దాస్‌ను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని ఆయన చెప్పారు. లైంగిక వేధింపుల ఘటనలో న్యాయం నిరాకరించార నే ఆరోపణలతో నిప్పంటించుకున్న కళాశాల వి ద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బిజెడి ఈ నిరసన ప్రదర్శన నిర్వహించింది. బాలాసోర్ జిల్లాలో కళాశాల విద్యార్థి ని మృతిపై బిజెడి నిరసన వ్యక్తం చేస్తున్న దృష్ట్యా భువనేశ్వర్‌లోని లోక్ సేవా భవన్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్ర సచివాలయం సమీపం లో ఉన్న రాజీవ్ భవన్, ఖారవేల భవన్‌తో సహా నగరంలోని ఇతర ప్రభుత్వ భవనాల వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపా రు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి పోలీసు కమిషనర్ ఎస్ దేవ్‌దత్ సింగ్ లోక్ సేవా భవన్ సమీపంలో మోహరించారు. ఉద్యోగుల గుర్తింపులను క్షుణ్ణంగా ధృవీకరించిన తర్వాతే సచివాలయంలోకి ప్రవేశించడానికి అనుమతించారని అధికారులు తెలిపారు. సందర్శకుల ప్రవేశాన్ని కూడా పరిమితం చేశారని, ముందస్తు అపాయింట్‌మెం ట్ ఉన్న వ్యక్తులకు సంబంధిత విభాగాల సిఫార్సు మేరకు ఎంట్రీ పాస్‌లు జారీ చేస్తున్నామని వారు తెలిపారు.

### న్యాయపోరాటానికి మద్దతిస్తా : రాహుల్

ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో నిప్పంటించుకుని మరణించిన కళాశాల విద్యార్థిని తండ్రితో బుధవారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఫోన్‌లో మాట్లాడి న్యాయం కోసం పోరాటంలో మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. 'ఒడిశాలోని బాలాసోర్‌లో న్యాయం కోసం పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన ధైర్యవంతురాలైన కుమార్తె తండ్రితో మాట్లాడాను. అతని గొంతులో, అతని కుమార్తె బాధ, కలలు, పోరాటాన్ని స్వయంగా విన్నాను. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు నేను ప్రత్యక్షంగా ప్రతి అడుగులోనూ వారితో ఉంటామని అతనికి హామీ ఇచ్చాను' అని రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'జరిగినది అమానవీయం, సిగ్గుచేటు మాత్రమే కాదు, మొత్తం సమాజానికి గాయం. బాధితురాలి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా మేము అన్ని విధాలుగా సహకరిస్తాం' అని ఆయన అన్నారు. సంఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు నేడు ఒడిశా బంద్‌కు పిలుపునిచ్చాయి. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ మంగళవారం బాధితురాలి కుటుంబాన్ని కలిశారు. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా కూడా కుటుంబాన్ని కలవడానికి రాష్ట్రానికి వచ్చారు.


## టాయిలెట్ పై... ఆదేశాలు పాటించలేదేం?

### హైకోర్టుల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ :** దేశంలోని అన్ని కోర్టులు, ట్రిబ్యునళ్ల లో టాయిలెట్ సౌకర్యాలను నిర్ధారించాలని ఇచ్చిన తీర్పు తర్వాత కూడా 20 హైకోర్టులు సమ్మతి నివేదికలను దాఖలు చేయకపోవడంపై బుధవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే చివరి అవకాశమని న్యాయమూర్తులు జస్టిస్ జెబి. పార్దివాలా, ఆర్. మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తెలియజేసింది. రాబోయే 8వారాలలో నివేదికలను దాఖలు చేయడంలో విఫలమైతే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ధర్మాసనం తీవ్రంగా వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రకారం సరైన పారిశుధ్యం పొందడం ప్రాథమిక హక్కు అని అత్యున్న న్యాయస్థానం జనవరి 15న తీర్పు ఇచ్చింది. దానికి సంబంధించి అనేక మార్గదర్శకాలను జారీచేసింది. అన్ని కోర్టులు, ట్రిబ్యునళ్ల ప్రాంగణాలలో పురుషులు, మహిళలు, దివ్యాంగులు, లింగమార్పిడి వ్యక్తులకు ప్రత్యేక టాయిలెట్ సౌకర్యాల లభ్యతను నిర్ధారించాలని అన్ని హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను అడిగింది. నాలుగు నెలల్లో స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని కోరింది. జార్ఖం డ్, మధ్యప్రదేశ్, కోల్‌కతా, ఢిల్లీ, పాట్నా హైకోర్టులు మాత్రమే సుప్రీం తీర్పు ఆదేశాలకు అనుగుణంగా యాక్షన్ టేకెన్ వివరాల నివేదికను దాఖలు చేసినట్లు ధర్మాసనం బుధవారం గుర్తించింది. కాగా దేశంలో మొత్తం 25 హైకోర్టులు ఉన్నాయి.

## యుఎవిలు, సి-యుఎఎస్‌లో స్వావలంభన భారతదేశానికి 'వ్యూహాత్మక ఆవశ్యకత'

### చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి ఘర్షణలు డ్రోన్లు 'వ్యూహాత్మక సమతుల్యతను అసమానంగా మార్చగలవు' అని నిరూపించాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. మానవరహిత వైమానిక వాహనాలు (యుఏవీలు), కౌంటర్ మానవరహిత వైమానిక వ్యవస్థలు (సియుఏఎస్)లో స్వావలంభన భారతదేశానికి 'వ్యూహాత్మక ఆవశ్యకత' అని సిడిఎస్ చౌహాన్ పేర్కొన్నారు. ఇక్కడి మానెక్‌షా సెంటర్‌లో జరిగిన ఒక రోజు వర్క్‌షాప్ ప్రారంభోత్స కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు, 'యుఏవిలు, సియుఏఎస్ ప్రాంతాలలో విదేశీ 'ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యాన్యుఫాక్చరర్' (ఒఇఎం)ల నుండి ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న కీలకమైన భాగాల స్వదేశీకరణపై' బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధాన కార్యాలయం థింక్‌ట్యాంక్ సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్ సహకారంతో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సిడిఎస్ ప్రసంగిస్తూ మానవరహిత వైమానిక వాహనాలు, కౌంటర్‌మానవరహిత వైమానిక వ్యవస్థలు మన భూభాగం, మనఅవసరాల కోసం నిర్మించబడినవి ఎందుకు కీలకమైనవో ఇటీవల నిరూపించాయన్నారు. డ్రోన్లు వాస్తవికతకు రుజువు అన్నారు. ఇటీవలి సంఘర్షణలలో వాటి విస్తృత వినియోగం, డ్రోన్లు వాటి పరిమాణం లేదా ధరకు అసమానంగా వ్యూహాత్మక సమతుల్యతను ఎలా మార్చగలవో ప్రదర్శించాయన్నారు. 'అసమాన డ్రోన్ యుద్ధం పెద్ద ప్లాట్ ఫారమ్‌లను దుర్బలంగా మారుస్తోంది, సైన్యాలు సిద్ధాంతాల సంభావిత అంశాలు మానవరహిత వైమానిక వ్యవస్థల అభివృద్ధి నిశ్చితార్థ అనుకూల కదలికలను పునరాలోచించడానికి ప్రేరేపిస్తుంది' అని ఆయన చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మే 10న పాకిస్థానీయులు నిరాయుధ డ్రోన్‌లు, మందుగుండు సామాగ్రి ప్రయోగించారని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తెలియజేశారు. 'అయితే వాస్తవానికి వాటిలో ఏవి కూడా భారత సైనిక లేదా పౌర మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం కలిగించలేదు' అని వివరించారు. భారతదేశం తన రక్షణ సామర్థ్యాలను తక్షణమే మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. మన వ్యూహాత్మక మిషన్లకు కీలకమైన సాంకేతికత కోసం విదేశాలపై ఆధారపడటాన్ని బాగా తగ్గించుకోవాలి. దిగుమతి చేసుకున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడటం వల్ల మన సంసిద్ధత దెబ్బతింటుందని, అంతేకాకుండా ఉత్పత్తిని పెంచే మన సామర్థ్యాన్ని పరిమితం చేస్తుందన్నాని తెలిపారు. 24గంటల లభ్యత, జీవనోపాధి, కీలకమైన విడిభాగాల కొరతకు దారితీస్తుందని వెల్లడించారు. ఆయన తన ప్రసంగంలో సాంకేతిక యుద్ధం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. రేపటి టెక్నాలజీని వినియోగించి నేడు యుద్ధరంగంలో పోరాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు.అలాంటి సమయంలో నిన్నటి ఆయుధాలతో నేడు యుద్ధం చేసి జయించలేమన్నారు.

## కోట్లలో మరణాలు... ఇంకా మనుగడలోనే ఆధార్ కార్డులు!

### బయటపడ్డ విస్తుపోయే నిజాలు

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రధాన గుర్తింపు పత్రమైన ఆధార్ కార్డుల గురించి కీలక విషయాలు బయటపడ్డాయి. ఆధార్ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి కేవలం 1.15 కోట్ల కార్డు నంబర్లను మాత్రమే ఉడాయ్ డీయాక్టివేట్ చేసినట్లు తేలింది. ఇప్పటివరకు 16 ఏళ్లలో కోట్ల మంది చనిపోయినా నిలిపివేసిన కార్డు నంబర్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తు ద్వారా ఈ విషయం వెల్లడైందని ఓ జాతీయ మీడియా తన కథనంలో తెలిపింది. 2025 జూన్ నాటికి భారతదేశంలో 142.39 కోట్ల ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఐక్యరాజ్య సమితి జనాభా నిధి ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నాటికి దేశ జనాభా 146.39 కోట్లుగా ఉంది. కాగా, సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఎస్ఆర్) డేటా ప్రకారం 2007 2019 వరకు సగటున ప్రతి ఏటా 83.5 లక్షల మంది మరణించారు. ఇలా ఇన్నేళ్లలో కోట్లమంది మరణించినా ఉడాయ్ డీయాక్టివేట్ చేసిన కార్డు నంబర్ల సంఖ్య తక్కువగానే ఉంది. దాదాపు మరణించినవారి 10 శాతం ఆధార్ కార్డులనే మాత్రమే డీయాక్టివేట్ చేసింది. కాగా, ఇదే విషయంపై ఆర్‌టిఐ దరఖాస్తుదారుడికి ఉడాయ్ సమాధానమిచ్చింది. మరణించిన వారి ఆధార్ డీయాక్టివేట్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉంటుందని ఉడాయ్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే మరణ ధ్రువీకరణ పత్రాలు, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తామని వెల్లడించింది. మరణాల ఆధారంగా ప్రతి ఏటా జరిగిన ఆధార్ నంబర్ల డీయాక్టివేట్ గురించి సరైన సమాచారం తమ వద్ద లేదని స్పష్టం చేసింది. మరణించివారి ఆధార్ కార్డుల సంఖ్య గురించి తమ వద్ద ఎటువంటి ప్రత్యేక డేటా లేదని వెల్లడించింది. మృతుల ఆధార్ కార్డుల యాక్టివ్‌లో ఉండడంపై ఆందోళనలు కాగా, మరణించినవారి ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేయడకపోవడం, అలాగే మృతుల ఆధార్ యాక్టివేట్‌లో ఉండడం పట్ల ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. యాక్టివ్‌గా ఉన్న ఆధార్‌లను దుర్వినియోగం చేసే అవకాశాలుంటాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఈ ఐడీ లింక్ ఉన్న ఇతర సర్వీసులపైనా ప్రభావం ఉంటుందని సూచిస్తున్నారు. నకిలీలను నివారించేందుకు సివిల్ డెత్ రిజిస్ట్రీలు, ఆధార్ డేటాబేస్ నిర్వహణలో సమన్వయం ఉండాలని, ఇది తక్షణ అవసరమని హెచ్చరించారు.16 ఏళ్ల క్రితం అంటే 2009లో ఆధార్ ప్రోగ్రామ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఈ ఏడాది జూన్ వరకు దేశంలో 142.39 కోట్ల మంది ఆధార్ కార్డులు పొందారు. దేశంలో ఇదొక ప్రధాన గుర్తింపు పత్రంగా ఉంది. అయితే మృతుల ఆధార్ నంబర్ల డీయాక్టివేట్ సంఖ్య తక్కువ ఉండడంతో దేశ ప్రజల్లో ఒకింత ఆందోళన చెలరేగుతోంది.

## నిమిష ప్రియను క్షమించం.. బ్లడ్‌మనీ కాదు.. న్యాయమే కావాలి!

**న్యూఢిల్లీ :** యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. బాధిత కుటుంబాన్ని బ్లడ మనీకి ఒప్పించేందుకు సమయం చిక్కిందని అంతా భావించారు. కానీ, అంతలోనే మృతుడి సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహదీ బాంబు పేల్చాడు. నేరానికి క్షమాపణ అంటూ ఉండదని.. చేసిన తప్పుకు నిమిషకు శిక్ష పడాల్సిందేనని ఫేస్ బుక్ వేదికగా పోస్ట్ చేశారు. బుధవారం శిక్ష అమలు తాత్కాలికంగా నిలిపేసిన అనంతరం మృతుడి సోదరుడు ఫేస్ బుక్‌లో ఇలా పోస్ట్ చేశాడు. 'ఈ వాయిదాను మేం ఊహించలేదు. మా కుటుంబం రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరించింది. ఈ ప్రయత్నాలు మాకు కొత్తేమీ కావు. ఎన్ని విధాలా ఒత్తిడి చేసినా మేం మా అభిప్రాయాన్ని మార్చుకోం. బ్లడ మనీకి అంగీకరించే ప్రసక్తే లేదు. నా సోదరుడిని హత్య చేసిన ఆమెకు ఉరిశిక్ష పడితీరాల్సిందే. క్షమాపణ అనే మాటే లేదు. మాకు కావాల్సింది డబ్బు కాదు. న్యాయం' అని స్పష్టం చేశారు. భారతీయ మీడియా దోషిగా నిరూపితమైన నిమిషను బాధితురాలిగా చిత్రీకరిస్తోందని మండిపడ్డారు. యెమెన్ చట్టం ప్రకారం, మరణించిన వ్యక్తి కుటుంబం నిందితులను క్షమించి పరిహారానికి అంగీకరిస్తే శిక్షను రద్దు చేయవచ్చు. అందుకే ఈ విషయమై చాలా కాలం నుంచి భారత ప్రభుత్వం యెమెన్ స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్‌తో నిరంతర చర్చలు జరుపుతోంది. మరో పక్క మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ మృతుడి కుటుంబంతో క్షమాధనానికి ఒప్పుకునేందుకు తీవ్ర చర్చలు జరిపారు. నిమిష కుటుంబం బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనం ఇచ్చేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే.

## భవిష్యత్‌లో మంచి మార్గాన్ని ఎంచుకోవాలి



**ప్రజాపక్షం/మోతె:** విద్యార్థినిలు, తల్లిదండ్రుల కళలను నేరవేర్చడానికి క్రమశిక్షణతో చదువుకోవాలని మునగాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. పోలీస్ ప్రజా బరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె.నర్సింహ అదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల చదువు సమాజ అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం కలిగి ఉండాలని కోరారు. విద్యార్థినుల సమస్యలు వస్తే కుంగిపోకుండా వాటికి ధైర్యంగా ఎదుర్కొనే విధంగా ఉపాధ్యాయులకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు అధికారుల చర్యలు



**ప్రజాపక్షం/నందికొండ:** వర్షాకాలంప్రారంభమై నెల రోజులవుతున్నా.. దోమల నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు.నందికొండ మున్సిపాలిటీలో దోమల బెడదతో ప్రజలు వేగలేకపోతున్నారు. చీకటి పడితే చాలు ముసురుతున్న దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని మంగళ వారం ప్రజాపక్షం దినపత్రికలో దోమ లనివారణకు చర్యలేవి? ప్రచురితమైన కథనానికి స్థానిక మున్సిపల్ అధికారులు అప్రమత్తమై దోమల నివారణకు ప్రాథమిక చర్యలు చేపట్టారు పొంగి పొర్లుతున్న డ్రైనేజీలను మరమ్మతు చేసి తడిగా ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ నివారణ చర్యలు చేపట్టారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్



## రైతులు ఎవ్వరూ ఆందోళన చెందొద్దు

### ధర్మారెడ్డి కాల్వ మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ వలిగొండ :** వలిగొండ మండలం గోకారం చెరువు నుండి వెళ్లే ధర్మారెడ్డి కాలువ మరమ్మతు పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మారెడ్డి కాలువ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు రామన్నపేట, చిట్యాల, నార్కెట్ పల్లి, మండలాల ఇరు ప్రాంతాల రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన చెందొద్దని అందరికీ సమానమైన న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. కాలువ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. భువనగిరి నియోజకవర్గంలోని పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాలువలకు రూ.500 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు కాలువ పూర్తి కావడానికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు ,కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తి రెడ్డి, కంకల కిష్టయ్య, తుమ్మల యుగేందర్ రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, గూడూరు శ్రీధర్ రెడ్డి ,చెరుకు శివయ్య గౌడ్, బత్తిని లింగయ్య గౌడ్, బత్తిని సహదేవ్ గౌడ్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శించిన ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన బుద్ధవనాన్ని బుధవారం ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తిసందర్శించి పరిశీలించారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి ఇద్దరు కలసిమహా స్థూపం లో బుద్ధ జ్యోతిని వెలిగించారు. అనంతరం వీరు బుద్ధ చరితవనం, జాతకవనం ధ్యానవనం స్థూప వనాలను సందర్శించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్, బుద్ధవనం విశేషాలను వివరించారు. అనంతరం ఖమ్మం జిల్లా పర్యాటకశాఖ అధికారి సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా సంబంధాల మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు బుద్ధవనాన్ని సందర్శించినట్లుగా తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలోని నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి సమీపంలో సుమారు 8 ఎకరాల స్థలంలో బుద్ధిష్ట్ థీమ్ పార్కును ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు జరుగుతున్నాయని తెలిపారు. దీనికిగాను నాగార్జునసాగర్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనాన్ని సందర్శించి పరిశీలించామన్నారు. దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్, ఉన్నత స్థాయి అధికారులకు అందజేయనున్నట్లుగా తెలిపారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కోదాడ:** ద్విచక్ర వాహనంను కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం కోదాడ పట్టణంలోని బాలాజీనగర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామానికి చెందిన ఈదా వెంకటేష్ (23) వ్యక్తిగత పనుల కోసం కోదాడకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా బాలాజీనగర్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న కారు బైకును వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ మఠంపల్లి గ్రామంలో చాపల మార్కెట్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. వెంకటేష్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు వెంకటేష్ తండ్రి గోపయ్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నాడు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజవకర్గ అబివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నారాయణ్అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు తదితర సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్‌న ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఐదు వార్డుల చొప్పున ఆయా కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, చిరు వ్యాపారుల సమస్యలు, రోడ్డు వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజవకర్గ వ్యాప్తంగా 3500 ఇండ్లు మంజూరయ్యాయని ఇప్పటివరకు 2వేల ఇండ్ల పనులను ప్రారంబించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఇసుక కొరతను నివారించేందుకు సాండ్ బజార్ ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అర్హులందరికి రేషన్‌కార్డులు మంజూరు అయ్యాయని, రెండు రోజుల్లో పంపిణి చేస్తామన్నారు. పేదల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### ఆశ్రమ పాఠశాలను తనిఖీ, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని ముదిగొండ కమలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆర్డీవో రమణారెడ్డితో కలిసి బుధవారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్, పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, ఎంపిడివో డానియల్, సిఐ నర్సింహులు, రాంసింగ్, హరికృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలి**

మహిళలు ఆర్థికంగా ఎదగడం ద్వారానే ఆ కుటుంబాలు సంతోషంగా ఉంటాయని, ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ధృఢ సంకల్పంతో ఉందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, లోన్ బీమా, ప్రమాద చెక్కులను మహిళలకు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటి చైర్మన్ జ మున, డిఆర్‌డివో పిడి శేఖర్‌రెడ్డి, మహిళా సమాఖ్యల ప్రతినిధులు, సంఘాల సభ్యులు ఉన్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్య

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిడమనూరు :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుణాత్మక విద్యను అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం ఆమె నిడమనూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేజీబీవీ ఆవరణను, మౌలిక వసతులు ,వంటగది, డ్రైనేజీ సిస్టం, స్టోర్ రూమ్ ,అన్నింటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు .విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకోవడమే కాకుండా, వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలువేసి జవాబులను కాబట్టి వారిని చైతన్యవంతం చేసి చాక్లెట్లు పంచారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం విషయంలో రాజీ పడవద్దని ,ఎక్కడా అపరిశుభ్రతకు తావివ్వవద్దని, మధ్యాహ్నం భోజనం నాణ్యతగా ఉండాలని, అదే విధంగా గుణాత్మక విద్యను అందించాలన్నారు. తాజా కూరగాయలు వాడడమే కాకుండా, ఎప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా విద్యార్థులను చైతన్యం చేయాలని, పాఠశాల ఆవరణలో శుభ్రంగా ఉంచుకోవాలని, వంటగది శుభ్రంగా ఉండాలని, తాగునీరు, భోజనం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో రాత్రి భోజనం మరుసటి రోజు విద్యార్థులకు పెట్టవద్దని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వంట గదిలోని వంట సరుకులను తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నిడమనూరు తహసిల్దారు, ఎంపీడీవో ,ఎంఈఓ, ఏఈ ,తదితరులు ఉన్నారు.

### రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులపై తక్షణమే విచారణ

**ప్రజాపక్షం/చండూరు:** రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులపై వెంటనే విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చండూరు ఆర్‌డిఓ శ్రీదేవికి సూచించారు.బుధవారం ఆమె చండూరు ఆర్‌డిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు .భూభారతి కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక దరఖాస్తులను పరిశీలించారు. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు భూభారతి దరఖాస్తులను కేటగిరి వారిగా విభజించుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి తగు సూచనలు చేశారు.రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులన్నిటిపై తక్షణమే తగు విచారణ చేయించి పరిష్కారించాలన్నారు.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై తెలుసుకున్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి,సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



బంగారు ఆభరణాలు నగదు స్వాధీనం

నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పగలు రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారని నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి వెల్లడించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో మొత్తం 13 నేరాలు చేసిన ముఠా,ను అరెస్ట్ చేసి వారి నుండి 12 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు,300 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు 25వేల రూపాయల నగదు మొబైల్ ఫోన్, ఒక బైక్ని స్వాదీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 28 కేసులలో పాత నేరస్తులని నరేష్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బీసపోగు శాంసన్, చిన్న బేతపూడి గ్రామానికి చెందిన కందర కొండ కృష్ణ కిశోర్, కాకినాడ చెందిన ధర్మాడి దుర్గాప్రసాద్ లు ఉన్నారు. వీరు గత కొంత కాలంగా నల్లగొండ జిల్లాలో తాళం వేసిన ఇళ్లల్లో పగలు, రాత్రి సమయాల్లో దొంగతనాలు బైక్ డీక్కి ల నుండి దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సిసిఎస్, నల్లగొండ వన్ టౌన్ పోలీసులు, చందంపేట్,పెద్దవూర పోలీసులు వివిధ ప్రాంతాలలో వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో చందంపేట మండలం పోలేపల్లి ఏక్స్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి పాప్లాన్ డివైస్ చెక్ చేయగా వీరు పాత నేరస్తులుగా గుర్తించడం జరిగిందన్నారు. ముఠా సభ్యులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన నల్లగొండ సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఎమ్.జితేందర్ రెడ్డి,వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి,డిండి సర్కిల్ ఇన్స్పెక్టర్ బీసన్న, సిసిఎస్ ఎస్ఐ శివకుమార్,విజయ్ కుమార్,వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి, పుష్పగిరి, నాగరాజూ, వహీద్ పాషా, సిసిఎస్, కానిస్టేబుల్స్ గులాం దస్తాగిరి, గణేశ్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డ్ లను ప్రకటించారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/ఆత్మకూరు(యం):** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) మండల కార్యవర్గ సమావేశం జేఏఎస్ గార్డెన్‌లో సోలిపురం లింగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడం స్వాగతిస్తూ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు. బతుకు తెరువు కోసం వలస పోయిన వారు హైదరాబాద్లో ఉంటున్నారని, వారికి ఇళ్లను తొలగించడం సరికాదని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో ప్రగతిశీల పోరాటాలు నిర్వహించి పేద ప్రజలకు అండగా ఉంటామన్నారు. వితంతు, వృద్ధాప్య, వికలాంగులకు కొత్త పెన్షన్లను నమోదు చేసుకున్నప్పటికి విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వెంటనే పెన్షన్లు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, సహాయ కార్యదర్శి మహ్మద్ నయీమ్, మండల కార్యవర్గ సభ్యులు జల్ది రాములు, జక్క దయాకర్ రెడ్డి, యాస బుచ్చిరెడ్డి, గుర్రం రాజమణి, కల్వల నరసయ్య, మారుపాక అంజయ్య, బొబ్బల లాల్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ వేదాద్రి సస్పెన్షన్

**ప్రజాపక్షం/దేవరకొండ :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా వంట చేసే నాలుగవ తరగతి ఉద్యోగులకు నాణ్యమైన భోజనం తయారీ పట్ల సరైన సూచనలు ఇవ్వకపోవడం వల్ల దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థినిలు ఈనెల 14న అనారోగ్యానికి కారణమైన ముదిగొండ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. వేదాద్రిని తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈమేరకు మంగళవారం రాత్రి ఆమె సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేశారు. సదరు ప్రధానోపాధ్యాయులు విధులకు హాజరుకావడంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా, నాణ్యమైన భోజనం తయారు చేసే విషయంలో నాలుగో తరగతి ఉద్యోగులకు సరైన సూచనలు ఇవ్వకపోవడం పట్ల విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఆధారాలను బట్టి నిర్ధారణకు రావడం జరిగిందని, అందువల్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వేదాద్రిని సిసిఏ రూల్స్ ప్రకారం తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని, క్రమశిక్షణ చర్యల ప్రక్రియ పూర్తయేంతవరకు అమలులో ఉంటాయని వెల్లడించారు.

## బంగారు భవిష్యత్తును కోల్పోవద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్ ఎస్) :** విద్యార్థులు పెద్ద లక్ష్యాన్ని ఎంచుకొని ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, ఆకర్షణలకు లోనై బంగారు భవిష్యత్‌ను కోల్పోవద్దని, ఆకతాయిల వేధింపులను గుర్తించి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, చిన్న చిన్న సమస్యలకు భయపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. బుధవారం పోలీస్ ప్రజా బరోసా కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బరోసా కల్పించడానికి వచ్చాం అంటూ బాలికలకు సామాజిక అంశాలు, చదువుల ప్రాముఖ్యత, విద్యార్ధలకు సోషల్ మీడియా ప్రభావం, ఆకర్షణలకు, బాలికలకు దృడ సంకల్పం, మానసిక దైర్యం, వేధింపులపై ఫిర్యాదు చేయాలని సూచించారు. వేధింపులపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. 100, షీటీమ్స్ 87126 86056 కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు. బాలికల, మహిళల రక్షణలో శాఖ నిరంతరంగా పనిచేస్తుందని అన్నారు. పోలీస్ కళాబృందం సభ్యులు సోషల్ మీడియా ప్రభావం, వేధింపులు నిర్మూలించడంపై సాంస్కృతిక, జానపద పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖర్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, మండల విద్యాధికారి దారాసింగ్, ఎస్ఐ శ్రీకాంత్, పాఠశాల హెడ్‌మాస్టర్ సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఉద్యమాలే ఊపిరిగా... పోరాటాలే ప్రాణంగా జీవించిన దొడ్డ

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఉద్యమాలే ఊపిరిగా... పోరాటం ప్రాణంగా తన యావత్ జీవితాన్ని గడిపిన దొడ్డ నారాయణరావు ధన్యజీవి అని ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బొమ్మగాని ధర్మబిక్షం భవన్‌లో జరిగిన దొడ్డ నారాయణరావు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆ తర్వాత జరిగిన ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు అనేక ప్రజా ఉద్యమాలు ముఖ్యంగా నందికొండ ప్రాజెక్టు సాధనలో భూపోరాటంలోను, తాగునీరు, సాగునీరు సాధనకై నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధికై జరిగిన ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన చరిత్ర నారాయణ రావుది అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లెంల యాదగిరి, మేకల శ్రీనివాసరావు, బూర వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లేశ్వరి, కత్తి శ్రీనివాసరెడ్డి, ఉప్పతల కోటమ్మ, చిలకరాజు శ్రీను, గొంగడి భద్రారెడ్డి, పున్నయ్య పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై చర్చకు సిద్ధమా?

### సిఎంకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు సిద్దమా అని సిఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సవాల్ విసిరారు. అద్భుతమైన ప్రాజెక్టుపై కాంగ్రెస్ వర్గం మీడియా దృష్పచారం చేస్తుందని మండిపడ్డారు. కూలిందన్న ప్రాజెక్టుపై నేను స్వయంగా కారులో తిరిగి వచ్చానని పవర్ ప్రజంటేషన్‌లో చూపించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్‌హల్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన స్వయంగా కొంతమంది రైతులకు పవర్ ప్రజంటేషన్ చేశారు. మాజీ సిఎం, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కెసిఆర్ ప్రాజెక్టును చూసి ఓర్వలేక ఆయనపై ఉన్న కసితో నేడు రైతులకు సాగుకు నీళ్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నీళ్లుబారే కాలువల్లో నేడు తుమ్మలు, సర్కార్ చెట్లు మొలిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక దందా కోసమే కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడంలేదన్నారు. దీంతో సిఎం రేవంత్‌రెడ్డికి స్వామికార్యం, సౌకార్యం రెండు నేరవేరుతున్నాయని అన్నారు. కాళేశ్వరం కూళేశ్వరం అయిందని, కాంగ్రెస్, బిజేపి విషప్రచారం చేస్తుందని అన్నారు. పోయిన యాసంగిలో పొలాలు ఎండిపోయాయని, దీనికి ప్రధాన కారణం కాళేశ్వరం నీరు విడుదల చేయకపోవడమేనని అన్నారు. చంద్రబాబు లాంటి నీటి దొంగలతో చర్చలు ఎందుకు జరుపుతున్నారని ప్రశ్నించారు. ఆయన పంపిన సలహదారులను పెట్టుకుని సిఎం రేవంత్‌రెడ్డి మరింత దిగజారాడని అన్నారు. కుంగిపోయిన ఫిల్లర్లను రిఫేర్ చేయకుండా కుంటిసాకులతో రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డలో ఒకటి, రెండు ఫిల్లర్లు మాత్రమే కుంగిపోయాయని అన్నారు. వాటిని సరిచేస్తే సరిపోతుందని చెప్పారు. మోటార్లు పాడైతే రిఫేర్లు చేసుకోమా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా గోదావరి 38 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఉందన్నారు. కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు అని చెప్పారు. 19 సబ్ స్టేషన్లు, 21 పంపు హౌజ్‌లు ఉన్నాయని, 203 కిలో మీటర్ల మేర సొరంగాలు, 1531 కిలో మీటర్ల మేర గ్రావిట్ కెనాల్స్ నిర్మించడం జరిగిందన్నారు. 98 కిలో మీటర్ల మేర ప్రజర్ మెయిన్స్, 101 టిఎంసిల స్టోరేజ్ కేపాసిటి కలిగి ఉందన్నారు. 500 మీటర్ల ఎత్తున లిఫ్ట్, 240 టిఎంసిల నీటి వినియోగం అవుతుందన్నారు. ఇది కాళేశ్వరం సమగ్ర రూపమని వివరించారు. దమ్ముంటే పెన్‌పహడ్ మండలం ఉన్న చిన్న సీతరాంపురం తండాకు వెళ్దామా అంటూ సిఎంకు సవాల్ విసిరారు. ఈసమావేశంలో ఎమ్మెల్సీ ఎంసి కోటరెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, రవీందర్‌నాయక్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగ య్య, నలబోతు బాస్కర్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ మాజీ జడ్పి చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగులు ఉత్పత్తి పెంచడానికి కృషి చేయాలి : జిఎం రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఇటీవల జరిగిన అండర్ మేనేజర్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఉద్యోగం పొందిన వారు సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకాలను పెంచే విధంగా కృషి చేయాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి కోరారు. ఇటీవల జరిగిన అండర్ మేనేజర్ (ఇంటర్నల్) పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఉద్యోగుల ను ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి జిఎం కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఎంతో శ్రమకోర్చి అండర్ మేనేజర్ గా సెలెక్ట్ అయిన మీరు సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కవింద్ర, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ



**ప్రజాపక్షం/నర్సంపేట :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయాలని సిఐ శ్రీనివాస్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నర్సంపేటలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో ఆవరణలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నారావుపేట ఎస్ఐ జి.రాజేశ్ రెడ్డి, కళాశాల ఓఎస్‌డి చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జానకి, డీన్ ఆఫ్ అకాడెమిక్స్ డాక్టర్ హమీద్ పాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సందీప్, శారీరక విద్య ఉపాధ్యాయులు వేంగల్ రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు : కమిషనర్ చాహత్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** బల్దియా పరిధిలోని కొత్తపేట పైడిపల్లి, నవ భారత్ కాలనీ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులలో నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు జరుగుతోందని వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి పేర్కొన్నారు. బుధవారం బల్దియా పరిధిలోని వర్ధన్నపేట నియోజకవర్గంలోని కొత్తపేట పైడిపల్లి, నవభారత్ కాలనీ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు నిమిత్తం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎంబి రికార్డ్ ప్రకారమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, నాణ్యతలో లోపం ఉంటే బిల్లులలో కోతలు విధిస్తామన్నారు. కమిషనర్ వెంట ఇఇ సంతోష్ బాబు, స్మార్ట్ సిటీ పిఎంఇ ఆనంద్ వోలేటి, డిఇ రవి కిరణ్, ఎఇలు తదితరులు ఉన్నారు.

## మొక్కల్ని విరివిరిగా నాటాలి

అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** వనమహోత్సవంలో భాగంగా వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో విరివిరిగా మొక్కలు నాటాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పిలుపునిచ్చారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం జనగామ జిల్లాలోని 13 సెడ్యూల్డ్ కులాల వసతి గృహాలు, 5 రెసిడెన్సియల్ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ విక్రమ్‌కుమార్, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 1వ వార్డుల్లోని గురుకుల పాఠశాలలో రెండు వందల మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్‌తరాల సంక్షేమమే లక్ష్యం

భూపాలపల్లి జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భవిష్యత్తు తరాల సంక్షేమమే వనమహోత్సవ లక్ష్యమని జిల్లా ఎస్‌పి కిరణ్‌ఖరే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించగా, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్‌పి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా పోలీసులు ముందుండాలని, అన్ని పోలీసుస్టేషన్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌పి పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్‌పి ఎ.నరేష్‌కుమార్, వర్టికల్ డిఎస్‌పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎసిబి తనిఖీలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం ఎసిబి, తూనికలు కొలతలు, ఫుడ్ సేఫ్టీ, స్టేట్ ఆడిట్ అధికారుల సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని హాస్టల్, పాఠశాలకు సంబంధించిన రిజిష్ట్రర్లు, స్టాక్ రిజిష్టర్లు, సిబ్బంది హాజరు రిజిష్టర్లు, వార్డెన్ రూం రికార్డులు, మెటీరియల్ రిజిష్టర్లు, బోర్డర్, నాన్ బోర్డర్ తేడాచూడడం, ఫుడ్ క్వాంటిటీ, జీతాలకు సంబంధించిన రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఆయా శాఖల అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ సోదాలు చేస్తూనే ఉన్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ స్వర్ణకుమారి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ ఉత్తర్వుల ప్రకారం డాక్టర్ జి.స్వర్ణకుమారి ఎంబిబిఎస్ ఎండి డివిఎల్ కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ స్థాయి నుండి పదోన్నతిపై గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ములుగుకు ప్రిన్సిపాల్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన వైద్యులు, అన్ని విభాగాల సిబ్బంది నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ స్వర్ణకుమారి శుభాకాంక్షలు తెలిపారు.

# ‘ఆయిల్ పామ్’ సాగుతో అధిక లాభాలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/వేలేరు :** ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు ఉన్నాయని, రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు రావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం గుండ్ల సాగర్ గ్రామంలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్న మండ సారంగపాణి అనే రైతు తన పంట క్షేత్రంలో ఆయిల్ పామ్ గెలల మొదటి కోత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, అధికారులు, స్థానిక రైతుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. మిగతా పంటల కంటే ఆయిల్ పామ్ పంటకు రైతులకు మంచి గిట్టుబాటు అయ్యే ఆదాయం లభిస్తుందన్నారు. వరి, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందవచ్చు అని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాలు ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాలు వడగండ్లు, కోతుల బెడద, పందుల బెడద ఈ పంటపై ప్రభావం చూపదన్నారు. వరి సాగులో నీటి వినియోగం ఎక్కువ అని, అదే ఆయిల్ పామ్ పంట సాగులో నీటి వాడకం తక్కువగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ గెలల కోత కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆయిల్ పామ్ పంటను సాగుచేసిన రైతు మండ సారంగపాణికి కలెక్టర్ చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు అనసూయ, శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, హనుమకొండ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సుస్మిత, కెవిన్ బయోసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ రంజిత్ కుమార్, తహసీల్దార్ సదానందం, ఎంపిడిఒ అనిల్ కుమార్, వ్యవసాయ అధికారులు, వేలేరు, ధర్మసాగర్ భీమదేవరపల్లి, హసన్ పర్తి, ఐనవోలు, కాజీపేట, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక పురోగతి లక్ష్యం



వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హనుమకొండ :** మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హన్మకొండలోని డి కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినేత్రి మహిళా నాయకత్వ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకే అధినేత్రి మహిళా నాయకత్వ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. రాబోయే రోజుల్లో సర్పంచ్, ఎంపిటీసీ, జడ్పిటిసి తదితర ఎన్నికల్లో నిలబడి విజయం సాధించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, జాతీయ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సాగరిక రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కెఆర్ దిలీప్ రాజ్, పరమేష్, కరుణాకర్, క్రాంతి కుమార్ తో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళా నాయకత్వ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వం పెద్దపీట వేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయడానికి మహిళలు ఎదగాలన్నారు. ప్రతి ఇంటికి స్వయం ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో డైరీ, స్కిల్ డెవలప్మెంట్‌ను పరకాల నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

## విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆత్మకూరు :** విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవలర్చుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ తెరిసా పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడంతో భవిష్యత్తులో వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితంలో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు అన్నారు. విద్యార్థి నాయకులు పాఠశాల నియమాలు విలువలు పాటిస్తూ తమ బాధ్యతలు నిర్వహించాలన్నారు. నాయకత్వం కేవలం రాజకీయ రంగానికే పరిమితం కాదని, అన్నిరంగాల్లో నాయకత్వ లక్షణం వ్యక్తి ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే భవిష్యత్తులో అన్ని ఒడిదొడుకులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడగలరన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ప్రజలకు న్యాయం అందించాలి : సిపి సన్‌ప్రీత్‌సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైం :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి పూలమొక్కను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా,కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఎస్.ఐలు నవీన్‌కుమార్,లవణ్‌కుమార్,శివ తదితరులు పాల్గొన్నారు.

## టిబి నిర్మూలనలో ప్రైవేట్ వైద్యుల సహకారం అవసరం

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** టిబి రహిత జిల్లాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాను తీర్చిదిద్దాలని, జిల్లాలో టిబి వ్యాధిని నిర్మూలించడంలో ప్రైవేటు వైద్యుల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఒసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, సింగరేణి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 95వేల మందికి టిబి పరీక్షలు చేయడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1695 మందికి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. జూన్ 9 జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని 100 రోజుల్లో 95 వేల మందికి టిబి పరీక్షలు చేయాల్సి ఉన్నదని, ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్ రే కేంద్రాలున్నాయని, వీటితో నిర్ణీత వ్యవధిలో పరీక్షలు పూర్తి చేయలేకపోతున్నామన్నారు. ప్రయివేటు వైద్యులు, ఎక్స్‌రే కేంద్రాల నిర్వాహకులు సహకారం అందించాలని సూచించారు. టిబి వ్యాధిగ్రస్థులను త్వరితగతిన గుర్తించి వైద్యసేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గుర్తించిన కేసులను డిజిటల్ నిక్షేపణ యాప్‌లో నమోదు చేయాలని, వ్యాధిగ్రస్థులకు పోషకాహారం అందిచాలని వైద్యులను కోరారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ సోకిన వ్యక్తులను గుర్తించిన వారి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల సమాచారం మేరకు రోగి నివసించే ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టి, మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధి వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా నవీన్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వెంకటేశ్వర్లు, ఇంఛార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీదేవి, డా.ఉమారాణి, ఐఎంఏ ప్రెసిడెంట్ డా కిరణ్ కుమార్, సింగరేణి సూపరింటెండెంట్ డా గోపి, రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీనివాస్, డెమో శ్రీదేవి, ఎక్స్ రే యూనిట్లు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో రైతులకు సత్ఫలితాలు

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి :** వ్యవసాయరంగంలో నానో యూరియాతో సత్ఫలితాలు పొందవచ్చునని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలోని స్నేహ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కేంద్రంలో వ్యవసాయ శాఖ, ఇఫ్‌కో సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్, నానో డిఏపిపై(డ్రోన్‌తో పిచికారి చేసే ) అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా క్షేత్రస్థాయిలో డ్రోన్ ద్వారా నానో యూరియా ద్వారా పొలాల్లో వేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయరంగంలో నానో యూరియా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నానో సాంకేతికత పరిజ్ఞానంతో మొట్టమొదటిసారిగా యూరియాను ద్రవ రూపంలో తీసుకవచ్చిన ఘనత ఓ భారతీయుడిదని ఇది దేశానికే గర్వకారణమన్నారు. సత్వర ప్రయోజనం అందించే నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించుటకు వ్యవసాయాధికారులు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నానో యూరియా వాడకంతో అధిక దిగుబడి ఖర్చు తగ్గడం, భూసార పరిరక్షణ, పర్యావరణహితం కలుగుతుందన్నారు. లాభదాయకమైన ఆయిల్ ఫామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. పంట సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వ సబ్సిడీలతో పాటు, ఇతర అన్ని విధానాలతో తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, ఇఫ్‌కో డిఎం విశాల్ షిండే, స్నేహ ఎఫ్‌పిఒసి ఇఒ చాంద్ పాషా, ఎఫ్‌పిఒ డైరెక్టర్లు అశోక్, పోరికా ప్రమేలా, కవిత, ఎంపిడిఓ హనుమంత్‌రావు, టిజివిబి బ్యాంక్ మేనేజర్, మండల వ్యవసాయాధికారులు నల్లెల్లా శ్రీధర్, పరమేశ్వర్, ఎఇఒ రామచంద్రపూర్ కావ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్ అన్నారు. బుధవారం స్టేషన్‌ఘనపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణం లో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వసతులను పరిశీలించారు. పిల్లల సామర్థ్యాలను తెలుసుకున్నారు. టాయిలెట్ నిర్మాణాన్ని పరిశీలించి మార్పులు చేయాలని ఆర్‌అండ్‌బి డిఇ సతీష్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని భవిత కేంద్రాల్లో మౌలిక వసతులను మెరుగు పర్చేందుకు నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల జీవితాలలను మెగురుపరచడంలో భవిత కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని, భవిత కేంద్రాల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలన్నారు. పిల్లల ఆట వస్తువులను అలాగే కృత్యాధారిత అభ్యసన పుస్తకాలను మార్చ్‌లో పంపిణీ చేశామన్నాను. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడిఓ జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, భవిత కేంద్రం టీచర్లు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్‌గడ్‌లోని కూనూరు నుండి వెంకటాపూర్ వరకు నిర్మించిన బిటీ రోడ్డు, తిడుగు గ్రామంలో ఇజిఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ వెంకటాపూర్ క్రాస్‌నుండి వయా రఘునాథపల్లి, కూనూరు, కోనాయిచలం మీదుగా జఫర్‌గడ్ క్రాస్ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని వచ్చే ఉగాది నాటికి రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. కూనూరు గ్రామంలో 35 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్నారు. ఆకేరు వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించానని త్వరలోనే మంజూరు వస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు తప్పకుండా వస్తాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ లావణ్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఐలయ్య, నాయకులు బిక్షపతి, మోహన్, ఎల్లయ్య, సోమయ్య, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ రేషన్‌కార్డులు

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కడియం హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో మొక్కలు నాటి వనమహోత్సవం కార్యక్రమంలో పా ల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న పాలకులు ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. జిల్లాలో 9,700ల కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అవినీతికి ఆస్కారం లే కుండా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామన్నారు. కా ర్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన కర్నాకర్‌రావు, మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, వైస్‌చైర్మన్ ఐలయ్య, ఆర్‌డిఒ వెంకన్న, డిఎస్‌ఒ, తహసీల్దార్ శంకరయ్య, ఎంపిడిఒ సుమన్, డిటి అనిల్‌బాబు, ఆర్ఐ బలరాములు తదిలరులు పాల్గొన్నారు.

## కెజిబివి వసతులు పరిశీలించిన తహశీల్దార్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సత్య నారాయణపురంలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి)ని తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంతో పాటు ఇంటర్మీడియట్ కళాశాల వసతులను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి బోజనం చేసి వారితో మాట్లాడి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడక్కడ సమస్యలను గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించాలని, నిర్వాహకులను సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ మూడ్ శ్రీనివాస్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ అయేషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యువతి తల్లిదండ్రుల బెదిరింపుతో యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రియురాలి తల్లిదండ్రుల బెదిరింపులతో భయపడిన ప్రియుడు పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన ఖమ్మంరూరల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పడమటితండాకు చెందిన టి.సరస్వతి, ఉపేంద్రచారిల ఏకైక కుమారుడు విఘ్నేష్ చారి(20) ఖమ్మంలో ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. ఇతనికి ఆ పరిధిలోని ఓ ముస్లిం యువతితో పరిచయం ఏర్పడి ఫోన్‌లో సంభాషించుకుంటున్నారు. ఇది యువతితల్లిదండ్రులు పఠాన్ రఫీ, షకీలాకు తెలిసి, యువకుడిని చావు లేకపోతే చంపేస్తాం అని ఈనెల 1న బెదిరించారు. ఈ నేపథ్యంలో భయపడిన యువకుడు ఈనెల 3న తన గ్రామ శివారులో కలుపుమందు తాగి, తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. తక్షణమే సదరు యువకుడిని చికిత్స నిమిత్తం ప్రశాంతి ఆసుపత్రిలో చికిత్స చేపిస్తుండగా .బుధవారం మృతి చెందాడు.
తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ ముష్క రాజు తెలిపారు.



## ప్రజల పక్షాన పోరాడేది సిపిఐ

### పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మధిరలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం నగరంలోని సిపిఐ కార్యాలయంలో బాగం ప్రసాద్ అధ్యక్షతన సిపిఐ రఘునాథపాలెం మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ ఈనెల 19, 20 తేదీల్లో మధిరలో సిపిఐ 23వ జిల్లా మహాసభలుజరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు రఘునాథపాలెం మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రజల పక్షాన పోరాడేది సిపిఐ పార్టీ అన్నారు. మండలంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలన్నారు. కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా కేంద్ర మాత్రం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి లచ్చిరాం, జామ్లా, చీనా, రావెళ్ల సురేష్, సత్యనారాయణ, నాదం, కురువెళ్ల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

### కోటి మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం

### మహిళా శక్తి సంబరాల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/దమ్మపేట :** రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమంలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను, కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 18 నెలలుగా సంకల్పబద్ధంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం దమ్మపేట మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన మహిళా శక్తి సంబరాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు ఉదయం నుండే నియోజకవర్గంలో నుండి వచ్చిన వేలాదిమంది డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలో నిర్వహించారు. అనంతరం మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం వయో పరిమితితో డ్వాక్రా సంఘాలలో లేకుండా చేశారని, ఈ ప్రభుత్వం ఆ నిబంధనలను తొలగించి, ప్రతి మహిళకు అవకాశాన్ని కల్పిస్తోందనీ అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రూ.865 కోట్ల రుణాలను మహిళల ఖాతాల్లోకి జమ చేశామనీ, నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూ.3.23కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేశాం అని వివరించారు. ఇళ్ల పంపిణీ విషయంలో ప్రభుత్వం కీలకంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ నియోజకవర్గంలో మొదటి విడతలో 4,500 ఇళ్లు మంజూరు చేశామనీ, రాబోయే రోజుల్లో మరో మూడు విడతల్లో ఇళ్ల పంపిణీ చేస్తామని అన్నారు. ఆర్టీసి ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్నబియ్యం, రైతు రుణమాఫీ వంటి పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మహిళ సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు వెల్లడించారు. ఇది మాటల ప్రభుత్వం కాదనీ, చేతల ప్రభుత్వమని, ఎలాంటి ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రూ.8.50లక్షల కోట్ల రాష్ట్రాన్ని అప్పులుపాలు చేశారని. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి పథకాల ద్వారా వేలాది కోట్లు కెసిఆర్ దోచుకున్నారని అన్నారు. ఆ ప్రభుత్వానికి రేషన్ కార్డులు ఇవ్వడం కూడా చేతకాలేదని, ఈ ప్రభుత్వం రేషన్ కార్డులతో పాటు ప్రతి అర్హుడికి సన్న బియ్యం అందిస్తుందని అన్నారు. అనంతరం రేషన్ కార్డులు, రూ.2.50 కోట్ల వడ్డీరహిత రుణాల చెక్కులు, బీమా చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కను నాటారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాను. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పివో రాహుల్, ఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు, టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, ఏఎంసీ చైర్మన్ వాసం రాణి, సొసైటీ చైర్మన్ రాఘవరావు, కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పాగడల రాంబాబు, సాయిల నరసింహారావు, పర్వతనేని ప్రసాద్, యేసుమణి, కాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ జిల్లా మహాసభలకు ముస్తాబైన మధిర

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం రెడ్డిగార్డెన్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఖమ్మం జిల్లా 23వ జిల్లా మహాసభలకు మధిర పట్టణం ముస్తాబైంది. పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా సభను జయప్రదం చేయాలని బుధవారం పార్టీ శ్రేణులు మధిర పరిధిలోని ఆత్కూరు రింగ్ సర్కిల్ ఏరియా నుండి అంబేద్కర్ సెంటర్ వరకు జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో పట్టణాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు మాట్లాడుతూ జిల్లా మహాసభలకు సంబంధించి గత వారంరోజులుగా పార్టీ కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దేశ ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం వందేళ్లుగా సుదీర్ఘమైన పోరాటాలను నడిపించిన సిపిఐ వందేళ్ల స్ఫూర్తితో ఖమ్మం జిల్లా మహాసభలను జయప్రదం చేయడం కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యారని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా నాయకులు ఎం.ఎ.రహీం, తలారి రమేష్, జల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, కొండూరి నాగేశ్వరరావు, మల్లారం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంపై ఎందుకువివక్ష?

## విద్యా సంబంధిత బకాయిలను వెంటనే విడుదల చేయాలి ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

### కలెక్టరేట్ ముట్టడి ...ఉద్రిక్తం, తోపులాట




**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని ఇది విద్యార్థులకు శాపంగా మారిందని ఎఐఎస్‌ఎఫ్ ఆరోపించింది. విద్యా సంబంధిత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం ఉపకార వేతనాలను, బోధన రుసుములను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో హాజరైన విద్యార్థులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఒక దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించడం లేదని ఉపకార వేతనాలను ప్రభుత్వం విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం మారితే తమ జీవితాలు బాగుపడతాయని భావించిన విద్యార్థులకు ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తుందని రామకృష్ణ తెలిపారు. విద్యా రంగానికి సంబంధించి ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రూ.2వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని విద్యాశాఖకు సంబంధించి నాలుగు వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు సైతం నిరవధిక సమ్మె నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన తెలిపారు. ఉపకార వేతనాలపై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారని ఇప్పుడు విద్యను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ తీరు మారకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, భవిష్యత్తులో జరిగే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యతవహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు నాగులమీరా, మధు, శివనాయక్, వంశీ, జిల్లా నాయకులు మనోజ్, సురేష్, పవన్, వెంకటేష్, లక్ష్మణ్, నాగేంద్రబాబు, గోపి, నరేందర్, పావని, మల్లిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## 19,20 తేదీలలో సిపిఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభలు

### మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 19,20 తేదీలలో జరగనున్న ఖమ్మం జిల్లా సిపిఐ 23వ మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల సిపిఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో ఉదయం 9గంటలకు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రతినిధులలో పురుషులు ఎర్రచొక్కా, మహిళలు ఎర్ర చీరను ధరించుకుని హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సహాయకార్యదర్శులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ నాయకులు దండి రంగారావు, వెంపటి సురేందర్, పొన్నెకంటి రామకృష్ణ, బద్దల మల్లయ్య, అబూబకర్, వడ్లకుంట వీరబాబు, యువజన సంఘం సభ్యులు రెబ్బగొండ్ల గోపి, రంజిత్, కొక్కు రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌బిఐటిలో కృత్రిమ మేధా ప్రశంసా దినోత్సవం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రపంచ గతిని మార్చగల శక్తి కృత్రిమ మేధాకు ఉందని ఎస్‌బిఐటి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బుధవారం కళాశాలలో కృత్రిమ మేధా ప్రశంసా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ రేపటి భవిష్యత్తు నేటి ఆవిష్కరణలు నిర్ణయిస్తాయన్నారు. ఇంటర్‌నెట్ తర్వాత విప్లవాత్మక మార్పులను కృత్రిమ మేధానే సాధించగలిగిందన్నారు. సిఎస్‌ఇ (ఎఐఎంఎల్) విభాగాధిపతి డాక్టర్ కె.స్ఫూర్తి మాట్లాడుతూ అతిచిన్న స్పామ్ ఫిల్టర్స్ నుండి అత్యంత కఠినమైన రోబోటిక్స్, సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, రక్షణ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు. సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ సుప్రియ మీనన్ విద్యార్థులకు ప్రజంటేషన్ ద్వారా ఎఐ ఉపయోగాల గురించి వివరించారు. ఎఐ వలన భవిష్యత్తులో ఉద్యోగాల కొరత ఏర్పడదని, కానీ వాటి నైపుణ్యాల వల్ల ఉద్యోగ స్వభావం మారుతుందన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ ఈ రోజుల్లో కేవలం ఒక విభాగానికి మాత్రమే పరిమితం కాదని, ప్రతి రంగంలో కృత్రిమ మేధను జోడించడం అనివార్యమన్నారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఒక సాధనమని, దానిని సమాజ శ్రేయస్సు కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి. శివప్రసాద్, జె.రవీంద్రబాబు, డిప్లొమా ఇన్‌చార్జి జహీరుద్దీన్, వివిధ విభాగాల అధిపతులు, టిపిఓ ఎన్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ పాల్గొన్నారు.

## 16 మంది కార్మికుల సమస్యలను ఎజెండాలో చేర్చాలి

### మేయర్‌కు సిపిఐ కార్పొరేటర్ బిజి.క్లెమెంట్ వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 16 మంది ఉద్యోగులను కెఎంసియే నేరుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకునే అంశాన్ని ఎజెండాలో పెట్టాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం కార్పొరేటర్ బిజి క్లెమెంట్ మేయర్ పునుకొల్లు నీరజను కోరారు. బుధవారం మేయర్ పునుకొల్లు నీరజను వారి చాంబర్‌లో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తో కలిసి బిజి క్లెమెంట్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పబ్లిక్ హెల్త్‌లో పనిచేసి ప్రస్తుతం మిషన్ భగీరథ వాటర్ ఫిల్టర్ ఆపరేటర్లు, పంపు ఆపరేటర్లు, లీకేజీ వర్కర్లుగా పని చేస్తున్న 16 మంది ఉద్యోగులకు 2024 ఫిబ్రవరి మూడున జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు వారిని కెఎంసినే నేరుగా వారిని అవుట్ సోర్సింగ్ విధానంలో తీసుకోవాలన్నారు. ఈనెల 23న జరిగే జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలో పొందుపర్చాలని మేయర్‌ను కోరారు. బడ్జెట్ సమావేశాల సమయంలో కూడా కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మేయర్‌కు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు గుడ్ల మహేష్, వేముల హరీష్, పద్మాల వెంకటేశ్వర్లు, సాంపాటి మహేష్, బత్తిని శివకృష్ణ, చోరపాటి గురుమూర్తి, వీరపనూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్లుగా సిపిఐతో అత్యంత సన్నిహితం

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సిపిఐకి ప్రాధాన్యం

### వైరా శాసన సభ్యుడు రాందాస్ నాయక్




**ప్రజాపక్షం/ఖమ్మం :** 30ఏళ్లుగా సిపిఐతో తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తాను ఎక్కడ ఉన్నా సిపిఐతో తన అనుబంధం కొనసాగుతుందని వైరా శాసన సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సిపిఐకి తగు ప్రాధాన్యత కల్పిస్తానని ఆయన స్పష్టం చేశారు. బుధవారం వైరా శాసన సభ్యుడు రాందాస్ నాయక్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖమ్మం గిరిప్రసాద్‌భవన్ సిపిఐ కార్యాలయంకు చేరుకుని సిపిఐ, కాంగ్రెస్ వైరా నియోజకవర్గ నేతల సంయుక్త సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యర్రాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాందాస్ నాయక్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా కొత్తగూడెం, వైరా (సుజాతనగర్) నియోజక వర్గాల్లో ఏ ఎన్నికలైనా సిపిఐతో కలిసి పనిచేస్తున్నానని ఆయన తెలిపారు. వైరా నియోజకవర్గంలో 2023 ఎన్నికల సందర్భంగా సిపిఐ నేతలు అందించిన సహకారం మరువలేనిదని, ఎన్నటికీ మరిచిపోనని రాందాస్ నాయక్ తెలిపారు. మతోన్మాద రాజకీయాలు దేశాన్ని కుదిపేస్తున్న సమయంలో కాంగ్రెస్ వామపక్షాలు, ఇతర లౌకిక శక్తులు మరింతగా కలిసి పనిచేయాల్సిన అవసరం పెరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైరా నియోజక వర్గంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న చిన్న చిన్న పొరపచ్చాలను సరిదిద్దుకుని ముందుకు సాగుతామన్నారు.
ఈ సందర్భంగా సిపిఐ నాయకులు రాందాస్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, కాంగ్రెస్ నాయకులు వడ్డే నారాయణరావు, సూరంపల్లి రామారావు, సిపిఐ నాయకులు అజ్మీర రామ్మూర్తి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వైరా నియోజక వర్గ పరిధిలోని సిపిఐ మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

### విద్యా బోధనకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి

### స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలపై కలెక్టర్‌తో కలిసి సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి బుధవారం మధిర నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద 11 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ ఛైర్మన్ మురళి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా మన మంతా ధృఢచిత్తంతో పని చేయాలన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ తరుపున ప్రభుత్వానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రవేశపెట్టాలని సిఫారసు చేశామన్నారు. మధిర నియోజక వర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో టీచింగ్ సరిగా జరిగేలా, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆహ్లాదకర వాతారణం సృష్టించాలన్నారు. ఈ దిశలో 11 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించినట్లు అందులో రెండు పాఠశాలలను కేటగిరి ఒకటి క్రింద తొమ్మిది పాఠశాలలను కేటగిరి రెండుగా విభజించాలన్నారు. కేటగిరి ఒకటిలోని రెండు పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో 1000 నుంచి 1200 మంది విద్యార్థులకు సరిపడ తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్స్, స్పోర్ట్స్, కిచెన్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ వంటి సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. కేటగిరి 2లోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో కోటి నుంచి రెండు కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కేటగిరి 1లో సిరిపురం, జమలాపురం పాఠశాలలను ఎంపిక చేస్తున్నట్లు వీటిలో పూర్తి స్థాయిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయాలన్నారు. కార్పోరేట్ స్థాయిలో తరగతి గదులను డిజైన్ చేయాలన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఈ కమిటీలో విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే 30 మంది సభ్యులుగా ఉండాలని వారిలో 50 శాతం మహిళలు ఉండాలన్నారు. పాఠశాలల్లోని ఒక్కో విద్యార్థి నుంచి నామినల్‌గా రూ. 1000 వసూలు చేసి స్కూల్ కార్పస్ ఫండ్ సృష్టించాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ డిప్యూటీ సిఎం ఆదేశాల మేరకు మధిర నియోజక వర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో ఎంపిక చేసిన 11 ప్రభుత్వ పాఠశాలలు పైలెట్ ప్రాజెక్టు క్రింద సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్నారు. దీనిని ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి సత్యనారాయణ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఈఈ విన్సెంట్ రావు, మండల విద్యాశాఖాధికారులు, డిఈలు, ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీతో ప్రజలకు సేవలు

### మోడల్ సిఎస్‌సి శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిజాయితీతో ప్రజలకు సేవలు అందించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సిఎస్‌సి శిక్షణ పొందుతున్న ఎస్‌హెచ్‌జి మహిళలకు సూచించారు. ఖమ్మం ఐటి హబ్‌లో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి డిజిటల్ ఇండియా మోడల్ సిఎస్‌సి శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం సందర్శించారు. జిల్లాలో 153 మంది స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణలో భాగంగా మొదటి విడతలో 70 మందికి తరుణీ హాట్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వగా మిగిలిన వారికి ఐటి హబ్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా ఈడిపి, ఐటి స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కామన్ సర్వీస్‌సెంటర్ శిక్షణ పూర్తి చేసుకుని గ్రామాల్లో వ్యాపారవేత్తలుగా కెరియర్ ప్రారంభించుచున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికత విపరీతంగా పెరిగిందని ప్రస్తుతం ఫోన్ ద్వారా ప్రతి ఒక్కరికీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. పట్టణాలకు మాత్రమే పరిమితం కాదన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ సేవలను మరింత విస్తరించవచ్చునన్నారు. ఆధార్‌కార్డు అప్‌డేట్, బ్యాంకింగ్ సేవలు , కేంద్ర ప్రభుత్వ పథకాలు, రవాణా టికెట్ బుకింగ్, పాసు పోర్టు సేవలు, హెల్త్ కార్డు సేవలు వంటి అనేక రకమైన సేవలు మనం సిఎస్‌సి ద్వారా ప్రజలకు అందించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌సి ప్రాజెక్టు మేనేజర్ హరికృష్ణకుమార్, టాస్క్ రిజినల్ మేనేజర్ అశోక్‌కుమార్ నాయక్, ఖమ్మం ప్రాజెక్టు మేనేజర్లు షేక్ ఫయాజ్, సురేష్‌కుమార్, ఈడిపి ట్రైనర్ బాలు ప్రవరక్య, డిజి పే ఆధార్ సర్వీస్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్‌కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

### వన మహోత్సవంలో మొక్కలు నాటిన కమిషనర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 32 కిలో మీటర్ల మేర రోడ్డు డివైడర్లపై అర్కానట్ (వక్క) చెట్లు నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. శ్రీశ్రీ సర్కిల్ నుండి విజయ ఇంజనీరింగ్ కళాశాల వరకు సుమారు 810 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 32 కిలో మీటర్లు డివైడర్ల మధ్య వక్క చెట్ల నాటడం వల్ల నగరం ఆహ్లాదకరంగా మారడంతో పాటు కార్పోరేషన్‌కు ఆదాయ వనరుగా మారే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గమన్నారు. ఖమ్మం నగరంలో పచ్చదనం పెంచేందుకు విరివిగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ

## ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

### 'నెంబర్ వన్' బ్యాట్స్‌మెన్‌గా జో రూట్.. బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా..!



ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌ను బుధవారం విడుదల చేసింది. ఇంగ్లాండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ ఐసిసి నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇక టాప్ టెన్‌లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉన్నారు. లార్డ్స్ టెస్టులో వీరోచితంగా పోరాటం చేసిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 34వ స్థానానికి చేరుకున్నాడు. లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లిష్ ప్లేయర్ జో రూట్ తొలి ఇన్నింగ్స్‌లో 104, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేయడంతో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 888 పాయింట్లు ఉన్నారు. ఇక మరో ఇంగ్లాండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ రెండుస్థానాలు దిగజారి మూడోస్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇక టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం దిగజారి ఐదోస్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా ఆరు, శ్రీలంక ప్లేయర్ కమిందు మెండిస్ ఏడు, టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఎనిమిది, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు. పంత్ ఒక స్థానం, గిల్ మూడుస్థానాలు దిగజారాడు. ఇక పదో స్థానంలో ఇంగ్లాండ్ ప్లేయర్ జేమీ స్మిత్ పదో స్థానంలో నిలిచాడు. అయితే, లార్డ్స్‌లో 72 పరుగులు, 61 నాటౌట్‌గా నిలిచిన జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 100, సెకెండ్ ఇన్నింగ్స్‌లో 39 పరుగులు చేసిన కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో ఉన్నాడు. లార్డ్స్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 77 పరుగులకు ఐదు వికెట్లు సాధించి, బ్యాట్స్‌మెన్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలువడంతో రెండుస్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ టీమిండియా మిస్టరీ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం బుమ్రా ఖాతాలో 901 పాయింట్లు ఉన్నాయి. ఇక దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబాడా రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ గణనీయంగా ఎగబాకి ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా ఆరో స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 62 వికెట్లు 16.53 సగటుతో వికెట్లు తీసిన బోలాండ్. ఐసిసి హాల్ ఆఫ్ ఫేమర్స్ జార్జ్ లోహ్మాన్, సిడ్నీ బారన్స్ మాత్రమే మెరుగైన సగటుతో వికెట్లు పడగొట్టారు. ఇప్పటికే టాప్10లో ఆస్ట్రేలియా ప్లేయర్లు పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్ నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో ఐసిసి ర్యాంకింగ్స్ టాప్ టెన్‌లో చోటు దక్కించుకున్నాడు. 1958లో ఇంగ్లాండ్ జట్టు టాప్ 12లో ఆరుగురు బౌలర్లు ఉండగా.. తాజాగా ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఐసిసి ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఇక టీమిండియా ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి చేరుకున్నాడు.

## తప్పేం లేదు..

### టెస్టుల నుంచి కోహ్లీ రిటైర్మెంట్ వెనక్కి తీసుకోవాలి : మాజీ క్రికెటర్



విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గి తిరిగి టెస్ట్ క్రికెట్ ఆడాలని భారత మాజీ ఆల్ రౌండర్, 1983 ప్రపంచ కప్ హీరో మదన్ లాల్ విజ్ఞప్తి చేశారు. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతను తీసుకున్న నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 12తో వెనుకబడి ఉంది. సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకపోవడం భారత్‌కు సవాలుగా మారిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మదన్‌లాల్ తాజాగా ఓ షోలో పాల్గొనగా కోహ్లీ రిటైర్మెంట్ విషయం ప్రస్తావనకు వచ్చింది. 'భారత క్రికెట్ పట్ల విరాట్ కోహ్లీకి ఉన్న మక్కువ అసమానమైనది. అతను మళ్లీ టెస్టు క్రికెట్ ఆడాలనేది నా కోరిక. రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గడంలో తప్పు లేదు. ఈ సిరీస్‌లో కాకపోయినా తదుపరి సిరీస్‌లో కోహ్లీ తిరిగి రావాలి. కోహ్లీ పునరాగమనం టీమ్ఇండియాకు పెద్ద బూస్ట్‌ను ఇస్తుంది. అతని ఎనర్జీ, అనుభవం, ప్రభావం అమూల్యమైనవి. ఈ లక్షణాలు యువ ఆటగాళ్లకు స్ఫూర్తినిస్తాయి. ఒత్తిడిలో జట్టు స్థిరంగా ఉండటానికి సహాయపడతాయి' అని మదన్‌లాల్ అభిప్రాయపడ్డారు.



## భారత్‌తో మొదటి వన్డే.. టాస్ గెలిచిన ఇంగ్లాండ్

ఇంగ్లాండ్ మహిళల జట్టుతో జరిగిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను 32తో కైవసం చేసుకున్న భారత జట్టు.. ఇప్పుడిక వన్డే సిరీస్‌పై గురిపెట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు తొలి వన్డే మరికాసేపట్లో ప్రారంభంకానుంది. ఇంగ్లాండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ సిరీస్‌నూ గెలిస్తే స్వదేశంలో జరిగే ప్రపంచకప్‌నకు మరింత ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావొచ్చని హర్మన్‌ప్రీత్ సేన భావిస్తోంది. టీ20ల్లో సత్తా చాటిన స్మృతి మంధానపై మంచి అంచనాలున్నాయి. టీ20 సిరీస్‌లో అదరగొట్టిన తెలుగమ్మాయిలు శ్రీచరణి, అరుంధతిరెడ్డి బౌలింగ్‌లో కీలకం కానున్నారు. ఇంగ్లాండ్‌ను సొంతగడ్డపై తక్కువ అంచనా వేస్తే కష్టమే. ప్రపంచ నంబర్‌వన్ వన్డే బౌలర్ సోఫీ ఎకిల్‌స్టోన్ ఫామ్‌లో ఉంది. బ్యాటింగ్‌లో నాట్ సీవర్, సోఫీ డంక్లీ, క్యాప్సీ, బ్యూమాంట్‌లను కట్టడి చేయడం కీలకం.

**భారత ప్లేయింగ్ XI:** ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), దీప్తి శర్మ, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, శ్రీ చరణి, క్రాంతి గౌడ్

**ఇంగ్లాండ్ తుది జట్టు:** టామీ బ్యూమాంట్, అమీ జోన్స్ (వికెట్ కీపర్), ఎమ్మా లాంబ్, నాట్ సీవర్ (కెప్టెన్), సోఫియా డంక్లీ, ఆలిస్ డేవిడ్సన్ రిచర్డ్స్, షార్లెట్ డీన్, సోఫీ ఎకిల్‌స్టోన్, కేట్ క్రాస్, లారెన్ ఫైలర్, లారెన్ బెల్.

# ఫోకస్ కళారంగం



## అఫ్గాన్ పరిస్థితులకు.. అద్దం పట్టే ప్రదర్శనలు

అఫ్గానిస్థాన్ అంటే తాలిబన్లు... పౌర హక్కుల అణచివేత... మహిళల స్వేచ్ఛా హననం వంటి ప్రతికూల విషయాలు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ, అక్కడ కూడా అద్భుతమైన కళాకారులు ఉన్నారు. దేశంలో తగిన ఆదరణ లేకపోవడంతో కొందరు, దాడులు జరుగుతాయన్న భయంతో మరికొందరు... కళాకారులు తరచు వలస వెళుతున్నారు. శరణార్థులుగా మారుతున్నారు. అయినప్పటికీ, తన కళాసృజనాత్మక ప్రదర్శనలతో అఫ్గాన్ స్థితిగతులను కళ్లకుకడుతున్నారు. భారత్‌సహా పలు దేశాల్లో అఫ్గాన్ శరణార్థ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకోవడం మాత్రమే కాదు.. ఆలోచింప చేస్తున్నాయి కూడా. తమ అనుభవాలను, ఆలోచనలను, నిరసనలను ప్రపంచానికి తెలియజేస్తున్న ఎంతో మంది కళాకారుల్లో జహాన్ అరా రఫీ ముందు వరుసలో నిలుస్తుంది. ఆమె ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందింది. ఆమె గీసిన చిత్రాలు అఫ్గాన్‌లో మహిళలపై కొనసాగుతున్న అణచివేతకు ప్రతీకలు. తాజాగా ఆమె అమెరికా, ఐరోపా దేశాల్లో పలు ప్రదర్శలను నిర్వహించి, తన చిత్రకళతో ప్రపంచ ప్రజల దృష్టిని ఆకట్టుకుంటున్నది. షమ్సియా హసనే అమెరికా, జర్మనీ, ఇంక్ అనేక దేశాలలో గొప్పగొప్ప ప్రదర్శనలు ఇస్తున్న స్ట్రీట్ ఆర్టిస్ట్. అఫ్గానిస్థాన్ అంటే యుద్ధంకాదని, కళారంగమని ప్రజలకు గుర్తు చేయమే లక్ష్యంగా ఎంచుకుంది. గ్రాఫిటీ, మెటల్‌వర్క్, పెయింటింగ్‌లో తనదైన రీతిని చూపుతున్న ఒక ప్రముఖ కళాకారిణి మలినా సులైమాన్. బురా ధరించడాన్ని ఆమె నిరసించింది. అందుకే భిత్తి మీద ఎముకలు ఉన్నట్టు చిత్రాలు వేస్తూ, చూపరుల మెదళ్లలో కొత్త ఆలోచనలను ప్రేరేపిస్తున్నది. పెర్ఫార్మెన్స్ ఆర్టిస్టుగా పారిస్‌లో పనిచేస్తున్న కుబ్రా ఖదమీపై తాలిబన్ ప్రభుత్వం ఫత్వా జారీ చేసింది. గత్యంతరం లేక ఫ్రాన్స్‌కు వలస వెళ్లినప్పటికీ, అఫ్గాన్ ప్రస్తుత పరిస్థితులను తన కళారూపాల ద్వారా వివరిస్తున్నాడు. ఫర్జానా వహీదీ ఒక డాక్యుమెంటరీ ఫోటోగ్రఫర్‌గా, అఫ్గాన్ మహిళల జీవితాలను ప్రపంచానికి తెలియజేస్తోంది. ఆమె ఫోటోలు ఎపి, ఎఎఫ్‌పి వంటి అంతర్జాతీయ మీడియా ద్వారా వైరల్ అయ్యాయి. ఇటీవల భారత రాజధాని న్యూఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో ఇలాంటి ఎంతో మంది అఫ్గాన్ రిఫ్యూజీ కళాకారులు పాల్గొన్నారు. అక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులను తమ కళారూపాల ద్వారా వ్యక్తం చేశారు. అఫ్గాన్ సంస్కృతిని, భావాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడమే లక్ష్యంగా వీరు తమ అనంత ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. వీరి అంకిత భావం ఎంతైనా అభినందనీయం.





## 'లయన్ కింగ్' అత్యధిక వసూళ్లు

ది లయన్ కింగ్ న్యూయార్క్ యొక్క బ్రాడ్వేలో ఆల్ టైమ్‌లో: అత్యధికంగా అమ్ముడైన థియేటర్ ప్రొడక్షన్. నేటికీ నడుస్తోంది, ఇది 1997లో ప్రారంభమైనప్పటి నుండి 1.6 బిలియన్ డాలర్ల పైగా వసూలు చేసింది. దీని తర్వాత 2003లో ప్రారంభమైన వికెడ్ 1.37 బిలియన్ డాలర్లు వసూలు చేసింది. 1988లో ప్రారంభమైన ది ఫాంటమ్ ఆఫ్ ది ఒపేరా 1.25 బిలియన్ డాలర్లు రాబట్టింది. టాప్ టెన్లో చేరిన సరికొత్త ఆట కోర్సు హామిల్టన్, ఇది 2015లో ప్రారంభమైంది. ఇది ఇప్పటి వరకూ దాదాపు 650 మిలియన్ డాలర్లు వసూలు చేసింది.



## జిల్లా సమగ్ర అభివృద్ధికి నిరంతర పోరాటం

### రామడుగు లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి




**ప్రజాపక్షం / చెన్నూరు :** జిల్లా సమగ్ర అభివృద్ధికై ప్రజల పక్షాన నిలిచి నిరంతరం పోరాటం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ చెప్పారు. బుధవారం చెన్నూరులో జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని కమిటీ సభ్యుడు బడికెల మధునయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, చెన్నూరు నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ, చెన్నూరు నుంచి గెలిచి ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా పనిచేస్తున్న గడ్డం వివేక్ వెంకటస్వామి ఎన్నికల సమయంలో 40వేల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఆయన ఆ హామీని మర్చిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లాలోని భూగర్భ గనులను అభివృద్ధి చేసి, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సూచించారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రజలకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి జిల్లాలోని పంట పొలాలకు నీరందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చెన్నూరు మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, సుంకరి చందు, సూత్రం నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ డిమాండ్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో సిపిఐ పార్టీ మండల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ ముఖ్య అతిథిగా పాల్గొని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం యుద్ధ ప్రగతిపాదికన పూర్తి చేయాలని ముంపునకు గురైన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, మార్కెట్ వాస్తవ ధర కంటే రెండింతలు అధికంగా ఇచ్చి రైతులను ఆదుకోవాలని, వారికి పునరావసం కల్పిస్తూ ఇల్లు వెంటనే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కనీస వేతన చట్టాలు అమలు చేయాలని అర్హులైన పేదలందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఇం దిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు రుణమాఫీ లాంటి పథకాలు అందరికి వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. అల్వాల్ రెడ్డి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు సి.రాజు, పాల్గొన్నారు. సిపిఐ పార్టీ మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల కార్యదర్శిగా బాగి కృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా ఎండి కలీం ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రాజు, సూరి, ఆంజనేయులు, శ్రీశైలం, రహమతుల్లా, చిన్న జంగయ్య, వెంకటయ్య, నాగరాజును ఎన్నుకున్నారు.



## బడుగు, బలహీన వర్గాల ఆశాదీపం కమ్యూనిస్టు పార్టీ

### వంద సంవత్సరాల పోరాటాల చరిత్ర సిపిఐది : బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/పెనుబల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ది వంద సంవత్సరాల పోరాట చరిత్ర అని, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ ఆశాదీపమని భాగం హేమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామంలో జరిగిన సిపిఐ పెనుబల్లి మండల 9వ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటుందని పేదవాడి భూమి కోసం, భుక్తి కోసం అలుపెరగని పోరాటాలు చేసిందని పాలకపక్షాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిలదీస్తూ ప్రజా ఉద్యమాలు నిర్మించిందని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో భూ పోరాటంలో విజయం సాధించామని అనేక సంవత్సరాలుగా పోడు భూములపై చేసిన పోరాటాలు చేసిన ఫలితంగా హక్కులు సాధించామని ఇది సిపిఐ విజయమని పేర్కొన్నారు. అదే విధంగా దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని గిరిజన చట్టాలను అటవీ చట్టాలను కార్మికుల చట్టాలను మార్చివేస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం పనిచేస్తుందని దుయ్యబట్టారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను దారుణంగా కాల్చి చంపుతున్నారని ఇది చట్ట వ్యతిరేకమైనదని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న మైనింగ్ ను అనుయాయులకు కట్టబెట్టడానికే అడవిలో విధ్వంసకాండ సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు ప్రజాస్వామికవాదులు బిజెపి వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. నా సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ వామపక్ష భావజాలం తక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీగా అనేక సమస్యలపై పోరాడి ప్రజా సమస్యలను పరిష్కరించి ఉద్యమ పార్టీగా కొనసాగుతున్నామని, ఇది ఇక్కడి కార్యకర్తల కృషి అని అభినందించారు. అదే విధంగా భవిష్యత్ ఉద్యమ బలోపేతానికి పార్టీ కార్యకర్తలంతా ఏకతాటిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19, 20వ తేదీల్లో మధిరలో ఖమ్మం జిల్లా మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించబడుతుందని ఈ మహాసభ జయప్రదానికి కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు పిఎసిఎస్ డైరెక్టర్ పద్దం జోగయ్య అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగు నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, జిల్లా నాయకులు సీతామాలక్ష్మి, మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, నాయకులు పొదిల భాస్కర్, తడికమళ్ళ యోబు, చిల్లి ముంత ముత్తారావు, సరియం నాగేశ్వరావు, పైద కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు పోరాటాలు, త్యాగాలు తప్పవు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** హక్కుల సాధనకు పోరాటాలు, త్యాగాలు తప్పవని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ అన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి అధ్యక్షతన బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ హాజరై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, కనీస వేతనాలు రూ.26000 ఇవ్వడం లేదని ఆరోపించారు. కనీస వేతనాలకై యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కమిటీ కూడా వేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వేతన కమిటీ ఏర్పాటు చేసిందని కనీస వేతనాలకై చర్చలు జరుగుతుందని గుర్తు చేశారు. వర్షకాలం రిత్యా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రైన్‌కోట్, గం షూస్, చీపురులు, నూనె బెల్లం, యూనిఫార్మ్‌లు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గజేంగుల రాజు, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి

### మండలంలో ఎర్రజెండా గెలుపుకై కృషి : పంజాల శ్రీనివాస్ పిలుపు




**ప్రజాపక్షం/చిగురుమామిడి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలిచి తమ సత్తా చాటాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలంలో సిపిఐ పూర్వవైభవం కోసం ఎర్ర జెండా ఎగురవేయడానికి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. బుధవారం మండలంలోని ఇందుర్తి రెవెన్యూ పరిధిలోని రెండు ఎంపిటిసి స్థానాల గ్రామాలైన ఇందుర్తి, ఒగులాపూర్, గారెడ్డిపల్లి, గునుకుల పల్లె గ్రామాల సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం సిపిఐ ఇందుర్తి గ్రామ కార్యదర్శి ఎండి ఉస్మాన్ పాషా అధ్యక్షతన జరిగింది. చిగురుమామిడి మండల కేంద్రంలోని అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో చిగురుమామిడి ఎంపిటిసి స్థానం సమావేశం అల్లెపు జంపయ్య అధ్యక్షతన జరిగింది. సుందరగిరి ఎంపిటిసి స్థానం సమావేశం మావురపు రాజు అధ్యక్షతన జరిగింది. లంబాడిపల్లి, సీతారాంపూర్ గ్రామాల ఎంపిటిసి స్థానం సమావేశం కయ్యం తిరుపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి పెట్టింది పేరుగా ఉన్న చిగురుమామిడి మండలంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, ఎంతో మంది త్యాగధనులు ప్రాణాలు సైతం కోల్పోయారన్నారు. ఈ ప్రాంతంలో పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, వారంతా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం గ్రామాల అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. వారి ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు మండలంలో ఎర్రజెండాను ఎగురవేసి తిరిగి గత వైభవం తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై, నాయకులపై ఉందన్నారు. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేసినట్లుగా లేవన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు ఉంటేనే పేదలకు, అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని, వారికి న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశాల్లో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, మండల కా ర్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస రెడ్డి, బూడిద సదాశివ, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి కోమటిరెడ్డి జయపాల్ రెడ్డి, గోలి బాపురెడ్డి తదితరులున్నారు.

## 'బిసి' బిల్లు తక్షణమే షెడ్యూల్ 9లో చేర్చాలి

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** తెలంగాణ అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ 9లో చేర్చాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూలిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2019లో సంవత్సరంలో అగ్రవర్ణాల పేదల కోసం 103వ రాజ్యాంగ సవరణ చేసి పదిశాతం రిజర్వేషన్ ఇవ్వడానికి పార్లమెంట్‌లో బిల్లు తెచ్చి రిజర్వేషన్ అమలు చేస్తున్న విధంగానే 2025లో కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం బిసిలకు 50శాతం విద్యా, ఉద్యోగ చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయడానికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా కమీషన్ ఏర్పాటు చేయాలని, బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద బిసిలకు, దళితులకు పక్కా ఇండ్ల నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించాలని ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విద్యా హక్కు చట్టం ప్రకారం బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి తేవాలని, కార్పోరేట్ పాఠశాల, కళాశాల యూనివర్సిటీల్లో వీరందరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఫీజులు చెల్లించే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో చట్ట సవరణ చేయాలని, బిసిల ఆర్థికాభివృద్ధికి చేతివృత్తుల వారికి చిన్న మధ్య తరహా పరిశ్రమ నెలకొల్పడానికి వ్యాపారులకు రూ.5లక్షల నుంచి రూ.1కోటి వరకు 50శాతం సబ్సిడితో రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి నాయకులు చేగొండి మరళీయాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, అమరారపు పున్నయ్య, తాళ్ల వెంకన్న, పరికె భరత్, శ్రీను, సత్యం, సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## 2025-26 ఖరీఫ్ సీజన్‌కు ధాన్యం మద్దతు ధర

అదనపు కలెక్టర్ వేణు

గ్రేడ్ ఏ రకానికి 2389 రూపాయలు,
కామన్ రకానికి 2369 రూపాయల మద్దతు ధర

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** 202526 ఖరీఫ్ సీజన్ కు ధాన్యం మద్దతు ధర ఖరారయిందని అదనపు కలెక్టర్ డి.వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు రానున్న 202526 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని,గ్రేడ్ ఏ రకానికి 2389 రూపాయలు, కామన్ రకానికి 2369 రూపాయల మద్దతు ధర కేంద్ర వ్యవసాయ శాఖ నిర్ణయించిందని,రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర కంటే తక్కువ ధరకు దాన్యం అమ్మ వద్దని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోహెడలో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించనున్న గవర్నర్



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ గురువారం ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ హైమవతి తెలిపారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హైమవతి పర్యవేక్షించి ఏర్పాట్లు పనులను బుధవారం పరిశీలించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటిలోని 6443 మహిళ సంఘాల్లో 69706 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ఫ్ కింద 164 గ్రామాల్లోని 276 మహిళ సంఘాలు, మెప్మా కింద హుస్నాబాద్ మున్సిపాలిటీ లోని 20 వార్డులో 22 మహిళ గ్రూప్‌లో 5141 మంది సభ్యులు ఉన్నారు. 38 గ్రామ సంఘాలకు స్టీల్ బ్యాంక్ అందించనున్నారు. పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2.5 కోట్ల రూపాయాలతో స్టీల్ బ్యాంక్‌లో 13 రకాల గిన్నెలు ఈ బ్యాంక్‌లో అందుబాటులో రానున్నాయి. ప్లాస్టిక్ వాడకం ద్వారా రోగాల బారిన పడుతుండడంతో స్టీల్ సామాగ్రి వైపు ప్రజలు మారేలా ఈ స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నారు. గవర్నర్ కార్యక్రమానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ ఏసిపి సదానందంను కలెక్టర్ ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత కార్యక్రమంగా పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఆర్డీవో రామ్మూర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, డిఆర్డీవో జయదేవ్ ఆర్య, డిపిఓ దేవకీదేవి, తదితరులు ఉన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/దుబ్బాక:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి, చెల్లాపూర్,మల్లాయపల్లితో పాటు మండల పరిధిలోని అప్పనపల్లి, హసన్‌మీరాపూర్, పెద్దగుండవెల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నత స్థాయి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్య ద్వారా ఆంగ్ల భాషపై విద్యార్థులకు పట్టువచ్చేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రాథమిక దశ నుంచే ఆంగ్ల విద్యానును భోధించడం ద్వారా కార్పోరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించే అవకాశం ఉందన్నారు. ఆనంతరం దుబ్బాకలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న విద్య, సౌకర్యాల గురించి ఆరా తీశారు.

## కొడుకు మరణం తట్టుకోలేక పురుగుల మందు తాగి తండ్రి మృతి



**ప్రజాపక్షం/ముత్తారం :** నవ మాసాలు మోసి కనిపించిన తన కుమారుడు మరణం చూసి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించి మృతి చెందిన సంఘటన ముత్తారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మృతుడి భార్య పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం మండల కేంద్రానికి చెందిన మారం రాజిరెడ్డి తన కుమారుడు రమేష్ రెడ్డి గత సంవత్సరం క్రితం పురుగుల మందు సేవించి మృతి చెందగా అప్పటినుండి తన కొడుకు మృతి చెందాడని దిగులు చెందుతూ తన కొడుకు లేని జీవితం తనకు ఎందుకు అంటూ జీవితం పై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం పురుగుల మందు తన భర్త అయిన రాజిరెడ్డి సేవించి ఇంటి వద్ద పడిపోయి ఉన్నా వారిని వెంటనే పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న క్రమంలో బుధవారం పరిస్థితి విషమించి మరణించడం జరిగిందని తెలిపారు. కాగా మృతుడి భార్య పద్మ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఇందిరమ్మ ఇసుక రవాణా దారులకు అనుమతులు తప్పనిసరి: ఎస్ఐ



**ప్రజాపక్షం/బెజ్జంకి:** ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను రవాణా చేసే వాహన దారులకు అనుమతులు తప్పని ఉండాలని స్థానిక ఎస్ఐ బి.సౌజన్య తెలిపారు.బుధవారం ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక రవాణా చేసే వాహన డ్రైవర్ వెంట సంబంధిత అధికారు ఇచ్చే అనుమతి పత్రం తప్పని సరి ఉండాలని లేని యోడల పోలీసుల తనిఖీ సమయంలో అక్రమ ఇసుక రవాణాగా పరిగణంలోకి తీసుకోని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



**ప్రజాపక్షం/బెజ్జంకి:** ఆర్థిక ఇబ్బందులలో క్రిమి సంహారక మందు సేవించి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది.కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎగోలం రాజేశం (39) గతంలో గల్ఫ్ దేశం వెళ్ళి వచ్చిన అనంతరం ఆటో నడుపుకుంటూ కుటుంబాపన్ని పోషించుకుంటున్నాడు.మూడు సంవత్సరాల క్రితం ఇల్లు కట్టుకున్నాడు.ఇంటి నిర్మాణానికి ఐన ఖర్చు కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్థాపం చేంది తాగుడుకు బానిసయ్యాడు.రోజు మాదిరి లాగే ఉదయం ఇంట్లో నుండి ఆటోను తీసుకెళ్ళి గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రి వద పురుగుల మందు తాగాడు.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'ఇంగ్లీష్ క్లబ్'

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/వీణవంక:** విభిన్న రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శనీయమని, ఆంగ్లంలో పట్టు సాధించేందుకు ఇక్కడ ప్రారంభించిన ఇంగ్లీష క్లబ్‌ను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వీణవంక మండలం చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. విధ్యార్థులు స్వయంగా తయారు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పెయింటింగ్స్ ఎగ్జిబిషన్స్‌ను ప్రారంభించారు. అనంతరం బుధవారం బోధన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లోనూ తీర్చిదిద్దేందుకు చల్లూరు పాఠశాల ఉపాధ్యాయ బృందం తీసుకున్న చర్యలను అభినందించారు. ఇక్కడి విద్యార్థి ప్రపంచ వేదిక టెట్ హెడ్ కార్యక్రమానికి ఎంపికవడం పట్ల అభినందించారు. వినూత్న రీతిలో జడ్పిహెచ్ఎస్ చల్లూరు పేరుతో వార్తా చానల్ ప్రారంభించడాన్ని అభినందించారు. ఇలాంటి వినూత్న ఆలోచనలను ప్రతి పాఠశాలకు చేరవేయాలని, అన్ని పాఠశాలల్లోనూ ఇలాంటి విధానాలు అమలు చేయాలన్నారు. బుధవారం బోధన కార్యక్రమం అన్ని పాఠశాలల్లోనూ అమలు చేస్తున్నామని , ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాఠాలను ఉపాధ్యాయుల సమక్షంలో మరింతగా నేర్చుకోవాలని తెలిపారు. చల్లూరు పాఠశాలలో ఇంగ్లీష్ క్లబ్ ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థిని ఆంగ్ల విద్యలో పట్టు సాదించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, జిల్లా వ్యాప్తంగా ఇంగ్లీష్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. చల్లూరు విద్యార్థులు రూపొందించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పెయింటింగ్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ఈ ఎగ్జిబిషన్‌ను తల్లి దండ్రులకు చూపించాలన్నారు. విద్యాశాఖ వివిధ కార్యక్రమాలపై విద్యావాహిని యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేశామని, ఈ చానల్‌లో ప్రభుత్వ పాఠశాల కార్యక్రమాలు వీక్షించవచ్చని తెలిపారు. విద్యార్థులకు సందేశాత్మక చిత్రాలు చూపిస్తూ వాటిపై రివ్యూ రాయించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవ రణలో మొక్కలు నాటారు. ఎంఈవో శోభారాణి, తహసీల్దార్ రజిత, ఎంపిడివో శ్రీధర్, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్‌చారిలు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**

వీణవంక మండలం చల్లూరులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ఇజల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. లబ్దిదారు ఐలవేణి స్వరూప కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, నిర్మాణం దశను బట్టి వెంటనే ప్రభుత్వం నుంచి సొమ్ము చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, ఎంపిడివో శ్రీధర్ ఉన్నారు.

## నిర్దేశిత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/మల్లాపూర్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా లబ్దిదారులను ప్రోత్సహించి నిర్దేశిత గడువులోగా అధికారులు పూర్తి అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం చిట్టాపూర్ గ్రామంలో లబ్దిదారులు చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలకు మంజూరైన ఇండ్ల గురించి ఆరా తీసి వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేకపోయిన లబ్దిదారులను కలిసి ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటును గురించి అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని దశల వారీగా లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూస్తామన్నారు. అదే విధంగా సాతారం సిరిపూర్ గ్రామాల్లో అయూష్మాన్ భారత్ కింద నూతనంగా నిర్మిస్తున్న అరోగ్య మందిర నిర్మాణ పనులను, సిర్పూర్ గ్రామంలోని నూతన గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పిడి ప్రసాద్, ఎంపిడివో శశికుమార్, ఎంఆర్‌వో రమేష్, ఎంపిఓ జగదీష్, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు రాజశేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'మెప్మా' ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/వేములవాడ:** మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని మారుపాక వద్ద సర్వే నంబర్ 339 లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలం హద్దులు సిద్ధం చేయాలని, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంక్ నిర్మాణ ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పర్యటనలో వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీఓ అన్సార్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు, డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో డెస్క్ బెంచీలు ఏర్పాటు**

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని మారుపాక లోని ప్రభుత్వ విద్యాలయంలో డెస్క్ బెంచీలు ఏర్పాటు చేశారు. వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని మారుపాక లోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డెస్క్ బెంచీలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్న విషయాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా డెస్క్ బెంచీలు వెంటనే సర్దుబాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విద్యార్థులకు సరిపడా డెస్క్ బెంచీలు తరలించి, విద్యాలయంలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసిన కొద్ది గంటలోనే సమస్య పరిష్కారం అవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## సిపిఐ కార్యకర్త నారాయణ రెడ్డికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/ముత్తారం :** సింగరేణి ఆర్జీ టూ ఏరియా జిడికే 8ఏ. ఇంక్లైన్ లో విధులు నిర్వహించి, ఏఐటియుసి యూనియన్‌కు పిట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ చేసిన కర్క నారాయణ రెడ్డిని సిపిఐ పూర్వ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్ బుధవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీ రాంపూర్ లో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భావం జరిగి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీలో క్రియా శీలకంగా పని చేసిన సీనియర్ నాయకులును,కార్యకర్తలను సన్మానించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థులకు అత్యున్నత విద్యాసంస్థల్లో సీట్లు

ఘనంగా సన్మానించిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** చక్కటి ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణతో విద్యను అందించడం ద్వారా ఘన విజయాలను సులభంగా నమోదు చేయవచ్చని, విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించగలుగుతామని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో 2022–23లోని పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు భారతదేశంలోని అత్యుతన్న విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం పట్ల ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచి ఐఐటి, నీట్‌లో అత్యంత అనుభవజ్ఞులైన నిపుణులైన ఉపాధ్యాయులచే చక్కటి ఫౌండేషన్ ఇవ్వడం జరుగుతుందని, తద్వారా ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటి, ఎన్ఎఫ్ఐటి, ఎయిమ్స్‌లలో సీట్లు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 35 మంది విద్యార్థులకు ఐఐటిలో, ఎన్ఐటిలలో, ఐఐఐటిలో సీట్లు సాధించారని తెలిపారు. ఒక విద్యార్థికి హైదరాబాద్ ఎయిమ్స్‌లో , నలుగురు విద్యార్థులకు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాల్లో సీట్లు రాబోతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధమైన విద్య ద్వారా విజయం సాధ్యమైందన్నారు. ఐఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులు ఎన్.అనిరుద్ సాయి. జె.వామిక, ఐఐటి హైదరాబాద్, వి.సంజితారెడ్డి, కె.వీరేంద్ర ప్రసాద్, డి.త్రిదం సాయి ఐఐటి ఖరగ్పూర్, యు.హాసిని ఐఐటి దన్వాద్, జి.ప్రభంజన్‌రెడ్డి ఐఐటి ఇండోర్, మెడికల్ విభాగంలో వి.శశాంక్ రెడ్డి ఎయిమ్స్ హైదరాబాద్‌లున్నారువారి పిల్లలకు అత్యుత్తమ విద్య ద్వారా ప్రతిష్టాత్మక విజయాన్ని సాధింపజేసిన విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డిని తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులున్నారు.

## భూ సమస్య దరఖాస్తులకు ఈ నెలాఖరులోగా పరిష్కారం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** రెవెన్యూ సదస్సులు ప్రజల నుంచి వచ్చిన భూ సమస్య దరఖాస్తులను నిబంధనల ప్రకారం జూలై నెలాఖరు వరకు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో భూ భారతి దరఖాస్తుల పై అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో విజయవంతంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రజల నుంచి భూ సమస్యల పై వచ్చిన దరఖాస్తులను భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి జూలై చివరి నాటికి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి. గంగయ్య, సురేష్, జిల్లాలోని అందరూ తహసీల్దార్‌లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సమన్వయంతో విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి**


జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న చిన్న చిన్న విద్యుత్ సమస్యలను స్థానిక సంస్థల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యుత్ శాఖ తో స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు నిర్వహించిన కన్వర్జెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు విస్తరణ, డ్రైయిన్ నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన చోట విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులు ఆలస్యం కాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ ఈ గంగాధర్ విద్యుత్ శాఖ అధికారి, డిపిఓ వీర బుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ లు వెంకటేష్ ,రమేష్, వెంకన్న, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లోడింగ్‌లో జాప్యాన్ని నిరసిస్తూ డ్రైవర్ల ధర్నా



**ప్రజాపక్షం/ముత్తారం :** వారం రోజులైనా ఇసుక రీచ్ వద్ద లారీలు లోడింగ్ కావడం లేదంటూ జాప్యాన్ని నిరసిస్తూ ఇసుక లారీల డ్రైవర్లు ఖమ్మంపల్లి, మంథని ప్రధాన రహదారిపై రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి వద్ద ఉన్న మానేరు ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్లు బుధవారం ధర్నాకు దిగారు. గత వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నామని క్వారీ యాజమాన్యం డబ్బులు ఎక్కువగా తీసుకొని మాకు లోడింగ్ చేస్తున్నారని వాపోయారు. డబ్బులు ఎక్కువ ఇస్తున్నామని ఎక్కడైనా,ఎవరికైనా చెబితే ఇసుక లోడింగ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.బండి నెంబరు నోట్ చేసుకొని డ్రైవర్లు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. క్వారీ వే బిల్ ఎక్కువగా చూపి స్తుందని బయటి వే బిల్ మిషన్ తక్కు వ చూపిస్తున్నదని తెలిపారు. సరైన టైము లోడింగ్ చేయక మీ దిక్కున చోట చెప్పుకోండి అంటూ ఇసుక క్వారీ యాజ మాన్యం అంటున్నారని వాపోయారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తమ సమస్యలనుపరిష్కరించాలని లారీ డ్రైవర్లు కోరారు.

# నెరవేరనున్న పేదవాడి సొంత ఇంటి కల



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** ఇందిరమ్మ రాజ్యంలో పేదవారి సొంత ఇంటి కల నెర వేరుతుందని జగిత్యాల నియోజకవర్గంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం నాడు జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్, మోతె గ్రామలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జగిత్యాల అర్బన్ ఎంపిడిఓ విజయలక్ష్మి , ఎంపీఓ, ధరూర్ గ్రామ ఇందిరమ్మ ఇండ్ల ప్రత్యేక అధికారి వాసవి, మాజీ ఎఎంసి చైర్మెన్ కొలుగురి దామోదర్ రావు, గ్రామ కార్యదర్శి అజయ్ అందరు కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎఎంసి చైర్మెన్ కొలుగురి దామోదర్ రావు మాట్లాడుతూ... ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇండ్లు కట్టుకోవాలనే పేద ఇంటి ఆడబిడ్డల చిరకాల కోరికని ఇందిరమ్మ ఇండ్ల రూపంలో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇల్లు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్,మాజీ ఉప సర్పంచ్ మహేష్, ధరూర్ గ్రామ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు మల్లేశం, శివ,తిరుపతి, రాజు, శ్రీ లక్ష్మి దేవి, లావణ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రామునిగుండాలపై కొండగట్టు అంజన్న..!

గుట్టపై 108 అడుగుల హనుమన్ భారీ విగ్రహం



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం బికార్నర్ రాజీవ్ రహదారికి అనుకొని రామునిగుండాల కొండపై నిర్మిస్తున్న 108 అడుగుల భారీ హనుమన్ విగ్రహా పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో ధనుర్భాణ రామాంజనేయస్వామి స్వయంభూగా వెలియడంతో భారీ పంచముఖ హనుమన్ విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. విగ్రహాం ఏర్పాటుకు సంబంధించి పునాది, సిమెంటు పిల్లర్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి త్వరగా చేపట్టాలన్నారు. రామగుండం నియోజకవర్గం ప్రజలకు అధ్యాత్మిక కేంద్రంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అంబులెన్స్‌లోనే ప్రసవించిన గర్భిణీ



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలకేంద్రానికి చెందిన బి.లక్ష్మీకి 4వ కాన్పులో పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడి వైద్యులు బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా 108 అంబులెన్స్‌లో గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ సిబ్బంది 108 అంబులెన్స్‌లోనే కాన్పు చేశారు. దీంతో లక్ష్మీ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని, ఈ ప్రసవంలో తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటి అరవింద్ తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ కుటుంబీకులు ఈఎంటి అరవింద్‌తో పాటు పైలెట్ వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

## 6 బంగారు పతకాలు సాధించిన ప్రతిభ



ప్రజాపక్షం/పిట్లం: కోల్‌కతాలో ఇటీవల జరిగిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో పిట్లం మండలం కేంద్రానికి చెందిన తక్కడపల్లి ప్రతిభ 6 బంగారు పతకాలను సాధించారు. అదేవిధంగా సెర్బియాలోని ప్రపంచ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్న జుక్కల్, జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ తక్కడపల్లి ప్రతిభను ఆహ్వానించి ఘనంగా శాలువాతో సన్మానించారు.

## పేకాట ఇంటిపై పోలీసుల దాడి..

### ఏడుగురు అరెస్ట్



ప్రజాపక్షం/సారంగాపూర్ : సారంగపూర్ మండలం అడెల్లి గ్రామంలోని అద్దెకు ఇచ్చిన ఒక ప్రైవేట్ భవనంలోని గదిలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం ఆధారంగా,సారంగాపూర్ ఎస్ఐ శ్రీకాంత్,కానిస్టేబుల్ సిబ్బంది హుటహుటిన దాడి నిర్వహించారు.దాడిలో పేకాట ఆడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుండి రూ. 38,340 నగదు,7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ ఇలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తసీఉకుంటామని హెచ్చరించారు.ఎవరైన పేకాట,మట్కా,జూదం లాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలు నిర్వ హించిన,నిషేధిత మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాలు సేవించిన సరఫరా చేసిన స్థానిక పోలీస్ స్టేషన్ లో లేదా,డయల్ 100 ద్వారా లేదా 8712659599 నెంబర్ కి కాల్ చేసి సమాచారం అందించాలని,వివరాలు తెలిపిన వారి విషయాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ఫోటో 16 నిర్మల్ 16

## నిర్మల్ డిపో నుండి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు..



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ డిపో ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రాల విహార యాత్రల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నమని బుధవారం రోజు,నిర్మల్ బస్టాండ్ నుండి అరుణాచలం,పలని,రామేశ్వ రం, శ్రీరంగం పుణ్యక్షేత్రాలకు ఒక ఒస్సు బయలుదేరినట్లు డిపో మేనేజర్ కె.పండరి తెలిపారు.ప్రయాణికుల కోరిక మేరకు అరుణాచలం ట్రిప్పును ఇప్పటికే చాలాసార్లు విజయవంతంగా నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.భక్తుల సౌకర్యార్థం మీరు కోరుకున్న చోటికి బస్సులను నడుపుతామని మేనేజర్ హామీ ఇచ్చారు.త్వరలో ప్రయాగ్‌రాజ్,కాశీ,అయోధ్య,యాదగిరిగుట్ట,స్వర్ణగిరి,పండరీపూర్ వంటి ఇతర ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా బస్సులు నడుపుతామని ఆయన వెల్లడించారు.ముఖ్య గమనిక :30 మదికి పైగా ప్రయాణికులు ఉంటే,మీ గ్రామం నుంచే బస్సు ఏర్పాటు చేయబడుతుంది. మరిన్ని వివరాల కోసం ఈనంబర్లలో సంప్రదించవచ్చు. 8328021517, 7382842582

## 19న సిపిఐ జిల్లా మహాసభ




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : 19జూలై శనివారం సిపిఐ పార్టీ జిల్లా మహాసభను నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని సిపిఐ పార్టీ నగర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. బుధవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19న శనివారం సిపిఐ పార్టీ జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై చర్చించడంతోపాటు, జిల్లాలో ప్రజలు కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రాబోయే కాలంలో సిపిఐ పార్టీగా ఉద్యమాలకు, పోరాటాలకు రూపకల్పన చేసుకోవడం జరుగుతుందన్నారు. కావున సిపిఐ పార్టీ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర పార్టీ నాయకులు రఘురాం నాయక్, ముత్యాలు, సురేష్, రాధాకుమార్, ఇమ్రాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## కత్తులతో బెదిరించి రూ.3.50లక్షల దోపిడీ

ప్రజాపక్షం/భీమ్‌గల్: హర్వేస్టర కోనుగోలు చేయడానికి వెళ్తున్న వాహనదారుడి నుండి 3.50లక్షల నగదును దోచుకెళ్ళిన సంఘటన కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో జరిగింది.ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగినిపల్లికి చెందిన కోమ్ము లక్ష్మి నారాయణ తన స్నేహితుడితో కలిసి భీమ్‌గల్ మండలం వైపు వస్తున్న క్రమంలో కోనాపూర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నెంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వచ్చి వారిని అడ్డగించి అనంతరం కత్తులతో బెదిరించారని తెలిపారు.వారి వద్దనున్న 3.50లక్షల నగదుతో పాటు వారి సెల్‌ఫోన్‌లను తీసుకోని పరారయ్యారని ఎస్ఐ తెలిపారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనీల్‌రెడ్డి తెలిపారు.

# ‘జన్ మన్’తో గిరిజనుల అభ్యున్నతి

### తిర్యాణిలో కేంద్ర సహాయ మంత్రి హర్ష మల్హోత్ర




ప్రజాపక్షం / తిర్యాణి /వాంకిడి/ ఆసిఫాబాద్ / ఆసిఫాబాద్ : ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కేంద్ర రోడ్డు రవాణా, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్ర తెలిపారు. బుధవారం సుంగాపూర్ గ్రామంలోని శాటిలైట్ సెంటర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పివిటిజి గిరిజన గ్రామాల్లో రహదారులు, త్రాగు నీరు, వైద్య సేవలు, బహుళార్థక ప్రయోజన కేంద్రాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.2.50 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గిరిజనులు సాంప్రదాయ గుస్సాడీ నృత్యంతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పివిటిజి సాంప్రదాయ దేవతల చిత్రాలకు, స్థలదాత ☐లదాత భీమ్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి, ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యత స్టాల్‌ను పరిశీలించి, గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, ముద్ర రుణాలపై వివరాలిచ్చారు. పివిటిజి గ్రామాల్లో 11 రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, శస్త్రచికిత్సలు అందించేలా మొబైల్ యూనిట్ల ద్వారా వైద్య సేవలు అందిస్తామన్నారు. బహుళార్థక ప్రయోజన కేంద్రాలు నిర్మించి, ఒకేచోట అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ, ముఖ్యమైన సేవలను గిరిజన గ్రామాలకు చేరవేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నెలరోజుల పాటు 102 గిరిజన గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ఆధార్, జాబ్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు, జన్ ధన్ ఖాతాలు తెరవడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, పంచాయతీ అధికారి బిక్షపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ మల్లేశ్, ఇతర శాఖల అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్ర పేర్కొన్నారు. బుధవారం వాంకిడి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి తో కలిసి సందర్శించారు. ఔషధ నిల్వల గదిని పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

### మహిళలు, పిల్లల సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాలు కీలకం

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్ర తెలిపారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన ఆదర్శ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి తో కలిసి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పోషక ఆహారంపై సమీక్ష నిర్వహించారు. పిల్లలతో కలిసి అక్షరాభ్యాసం చేయించి, వంటశాలను పరిశీలించారు. పిల్లలు, టీచర్లు ఏకరూప దుస్తులు ధరించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన ఆంగ్ల కథలపై ప్రశంసించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ధ్రువపత్రాలు అందజేశారు. భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ సౌజన్యంతో అందించిన సంచార సైన్స్ ప్రయోగశాలను పరిశీలించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సేవలు అందిస్తున్న డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలను వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి నుంచి అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత సమీకృత జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న మంత్రి హర్ష మల్హోత్ర బృందాన్ని స్టేట్ చాంబర్‌లో జిల్లా అధికారులు శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: బుదవారం పటాన్‌చెరులోని గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సమర్థులైన ఉపాధ్యాయులు ఉన్నారని వారు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్ ,స్టోరూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల్లోని ప్రీ ప్రైమరీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్య ద్వారా ఆంగ్ల భాషపై విద్యార్థులకు పట్టు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక దశ నుండి ఆంగ్ల విద్యను భోదించడం ద్వారా కార్పోరేట్ పాఠశాలల విద్యర్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ పాఠశాల ఉపాధ్యాయులు అధికారులు పాల్గొన్నారు.

## నేడు మెదక్ జిల్లాకు మంత్రి వివేక్

### సమీక్షా సమావేశాల్లో పాల్గొననున్న మంత్రి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు,గనులు అండ్ భూగర్భ శాస్త్ర, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి పర్యటన కార్యక్రమం ఖరారు అయిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన వివరాలు గురించి కలెక్టర్ మాట్లాడుతూ, 17 జూలై 2025 ఉదయం 09:30 మంత్రి రెసిడెన్సీ నుంచి బయలుదేరి బంజారాహిల్స్, రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ నుండి నర్సాపూర్, ఉదయం 11:00 చేరుకుంటారని ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు నర్సాపూర్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం 1:00 నర్సాపూర్ టు మెదక్ చేరుకుని 02:00 నుండి సాయంత్రం 04:00 వరకు మెదక్‌లోని కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశానికి హాజరు కానున్నారు. సాయంత్రం 04:00 నుండి సాయంత్రం 06:00 వరకు పార్టీ సమీక్షా సమావేశాలకు హాజరు అవుతారని తెలిపారు. జిల్లా అధికారులు మంత్రి పర్యటన విజయ వంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## దివ్యాంగులకు ‘యూడిఐడి’ సర్టిఫికెట్‌తో ప్రయోజనం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : దివ్యాంగుల యూడిఐడి కార్డు సర్టిఫికేట్ తో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగుల కోసం యూడిఐడి కార్డు జారీ చేయు ప్రత్యేక క్యాంపును, ప్రభుత్వ ఆసుపత్రి కార్యకలాపాలను క్యాంపులో దివ్యాంగులను పలకరిస్తూ, ఫిజియోథెరపీ యూనిట్, వృద్ధుల విభాగం రోగులతో మాట్లాడి వారి వైద్య సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు (పిడబ్ల్యూ డిఎస్) జాతీయ డేటాబేస్‌ను రూపొందించడానికి, ప్రతి వ్యక్తికి ప్రత్యేక వికలాంగుల గుర్తింపు కార్డు (యూడిఐడి)ను జారీ చేయడానికి వికలాంగుల కోసం ప్రత్యేక ఐడి ప్రాజెక్ట్ అమలు చేయబడుతుందని ఇందులో భాగంగానే ఈరోజు మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు గడిచిన నెల రోజుల్లో 300 మంది దివ్యాంగులకు యు డి ఐ డి కార్డ్స్ జారీ చేయడం జరిగిందని,స్లాట్ బుక్ చేసుకుని 150 మంది మిగిలి ఉన్నారని తెలిపారు. 21 రోజుల్లో స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసి దివ్యాంగులకు యూ డి ఐ డి కార్డ్స్ మంజూరు చేస్తామన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న 85 మందికి క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షించి పోర్టల్ లో డేటా ఎంట్రీ చేసి యు డి ఐ డి సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. తాత్కాలిక,దీర్ఘకాలిక, వైకల్య శాతాన్ని గుర్తించి తాత్కాలిక వైకల్యాన్ని పరిగణలోకి తీసుకుని వైద్య నిపుణులతో చికిత్సలు అందిస్తున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు ఎటువంటి సౌకర్యాలు అవసరమో వాటిని సమకూర్చి నాణ్యమైన వైద్య సేవలు అందించడానికికృషి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మెరుగైన వసతులతో రోగులకు సౌకర్యాలు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.ఈ డాక్టర్ సునీత, డాక్టర్ శివ దయాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డిఆర్‌ఎఫ్ టీం సహాయక విన్యాసాలు

### శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లాలో వర్షాలు,అకాల వరదలు సంభవించిన సందర్భంలో ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం చించోలి బి.సమీపంలోని ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలో నిర్వహించిన విపత్తు నిర్వహణ శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి వచ్చిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం సహాయక విన్యాసాలు,ప్రజలకు అవగాహన కల్పించే ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి,బృంద సభ్యుల పనితీరును అభినందించారు.వారి వద్ద ఉన్న ఆధునిక పరికరాల వినియోగం,అత్యవసర పరిస్థితుల్లో అవి ఎలా ఉపయోగపడతాయన్న అంశాలపై కలెక్టర్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గోదావరి స్వర్ణ,ఎస్సారెస్పీ,కడెం ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు,జీఎన్ఆర్ కాలనీ తదితరలో తట్టు ప్రాంతాల్లో ప్రజలు వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వరదల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయిలో ఫ్లడ్ మాన్యువల తయారు చేసినట్లు పేర్కొన్నారు.కడెం,ఖానాపూర్,సారంగాపూర్,దస్తురాబాద్, బైంసా మండలాల్లోని లోతట్టు ప్రాంతాలకు అవగాహన కల్పించేందుకు గత 15 రోజులుగా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం పనిచేస్తుందని తెలిపారు.అనంతరం మైనార్టీ పాఠశాల ప్రాంగణంలో కలెక్టర్,అదనపు కలెక్టర్లు మొక్కలు నాటి నీరు పోశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,ఆర్డీఓ రత్నకళ్యాణి,తహసీల్దార్ రాజు,ఎంపిడిఓ లక్ష్మి కాంతం,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా చైతన్యంతో విప్లవం

### సమాచార హక్కు చట్టం రాష్ట్ర మాజీ కమిషనర్ ఆర్ దిలీప్ రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్: జర్నలిస్టులు సమాజాన్ని చైతన్య పరచడం ద్వారా విప్లవాన్ని సృష్టించవచ్చని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, సీనియర్ పాత్రికేయులు దిలీప్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాఖారంలోని టిజీ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన సమకాలిన సమాజంజర్నలిస్టుల పాత్ర అనే అంశం పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలి జం వృత్తి పతనమైందని అనేకమంది అంటున్నారని, ఇతర వృత్తులను పోల్చి చూసినప్పుడే మన వృత్తి విలువ తెలుస్తుందన్నారు. సమాజం తో సమానంగా అన్ని వ్యవస్థలు పతనమయ్యాయని, డెమొక్రసీ ప్రమాదంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డెమొక్రసీలోని నాలుగు స్తంభాలు అపవిత్తమయ్యాయని, నాలుగు స్తంభాలతో పాటు సమాజం అపవిత్రమై పోయిందన్నారు. మనిషి సమూహ జీవిగా జీవించగలరని, ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ ముందుకు కదలాలన్నారు. మీడియా ఎప్పుడు సమాచారాన్ని వినిమయం చేస్తూ ఉండాలని, ఇన్ ఫార్మింగ్, ఎడ్యుకేటింగ్, ఎంటర్టైనింగ్, మోటివేటింగ్ ఈ నాలుగు అంశాలతోనే మీడియా నడుస్తుందన్నారు. దేశంలో యాజమాన్యాలు జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, రాజ్యం యాజమాన్యాలను తమ కబంధహస్తాల్లో బంధీలు చేసిందని చెప్పారు. సోషల్ మీడియాకు గేట్ వే లేదని, సమాజమే పరిమితిని విధించుకోవాలన్నారు. సోషల్ మీడియాకు సైతం త్వరలోనే చెక్ పడబోతుందని, చట్టపరమైన పరిమితులు ఏర్పాటు చేయబోతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ మాట్లాడుతూ, గజ్వేల్ ప్రెస్ క్లబ్ అన్ని ప్రెస్ క్లబ్ లకు భిన్నమైనదని, సామాజిక స్పృహ ఎక్కువని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టియుడబ్ల్యు జే సంఘానికి అనుబంధంగా 113 ప్రెస్ క్లబ్ లు ఉన్నాయని, రాష్ట్రంలో ఏ ప్రెస్ క్లబ్ చేయని అనేక సామాజిక కార్యక్రమాలను గజ్వేల్ ప్రెస్ క్లబ్ చేసిందన్నారు. అశ్లీలత, గుట్కా, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర గజ్వేల్ ప్రెస్ క్లబ్ దే అన్నారు. ప్రస్తుతం మీడియా సంస్థలు పెట్టుబడిదారుల, రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లోకి వెళ్లాయని, ఎడిటో రియల్స్ కాస్తా ప్రోప్రైటోరియల్స్‌గా మారిపోయాయన్నారు. సోషల్ మీడియా వచ్చాక ఎవరు జర్నలిస్టులో తెలియడం లేదని, యూట్యూబ్ చానల్స్, పిడిఎఫ్‌ల పేరిట బావ ప్రకటన స్వేచ్ఛ పెరిగినప్పటికీ, అది ఎదుటివారి మనోభావాలను కించపరిచే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, తాసిల్దార్ బాలరాజు, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్, ములుగు ఏడిఏ అనిల్, వెటర్నరీ ఏడి రమేష్ బాబు, ఆర్‌బిడిఈ శ్రీనివాస్, ఏవో శేష శయన, విద్యుత్ శాఖ ఏఈ వాసుదేవ రావు, తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు.బుధవారం నిర్మల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు.ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటైన చిన్న పిల్లల వైద్య విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్,చిన్నారులకు అన్ని రకాల వైద్య సేవలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ,ఔట్ పేషెంట్ వార్డుల్లో చికిత్స కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ,ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,కాలానుగుణ వ్యా ధుల కారణంగా రోగుల సంఖ్య పెరిగే అ వకాశం ఉన్నందున వైద్య సిబ్బంది మరి ంత అప్రమతంగా ఉండాలని పేర్కొన్నా రు.ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించిన కలెక్టర్,చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలతో వైద్యం అందించడం జరుగుతుందని భరోసా కల్పించారు.అంతకుముందు జీడియాట్రిక్ వార్డును పరిశీలించిన కలెక్టర్,వృద్ధును పరిశీలించిన కలెక్టర్,వృద్ధులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్శనలో ఆసుపత్రి పర్యవేక్షకుడు గోపాల్ సింగ్,వైద్యులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత దిశగా ప్రభుత్వ అడుగులు

### ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి




ప్రజాపక్షం/ఎడపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి సంబరాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయని మహిళల సాధికారతే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు విశేష ప్రజాదరణ పొందుతున్నాయని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు కన్వెన్షన్ హాల్‌లో జరిగిన డివిజన్ స్థాయి కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ అంకిత్ తో కలిసి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు బీమా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. సోలార్ ప్లాంట్లు, ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకులు, శక్తి క్యాంటీన్లు బజార్లు, పాఠశాలలు వంటి పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో తాద్పడుతాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, పట్టణ పేదిరక నిర్మూలన సంస్థలను విలీనం చేసి కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకరావాలని లక్ష్యంగా పెట్టుకుందని, మహిళా సాధికారత, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ సంబరాల్లో భాగంగా కళాజాతాలు వంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు లీంకేజీ కింద 112 సంఘాలకు 13.49 కోట్లు, లోన్ బీమా కింద 41మంది మరణించిన సభ్యులకు 40.64లక్షలు, ప్రమాద బీమా కింద నలుగురికి 40లక్షలు, వడ్డీ లేని రు ణాల (పావలా వడ్డీ) కింద 3896 సంఘాలకు 3.91 కోట్లు, స్త్రీ నిధి కింద 632సంఘాలకు 12.78కోట్లు, మొత్తం 30.98కోట్ల రూపాయాల విలువైన చెక్కులను శాసన సభ్యులు పంపిణీ చేశారు. ఈ సంబరాలు మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకవస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా స్థాయి నాయకులు గడుగు గంగాధర్, మండల నాయకులు పులి శ్రీనివాస్, పిడి సాయాగౌడ్, అడిషనల్ డిఆర్డీఓ మధుసూదన్, డిపిఎం నీలిమ, వివిధ మండలాల తహసీల్దార్ లు సంధ్యారాణి, మోహన్, కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

# రీల్

## చూసొద్దాం..



వింబుల్డన్ 2025 పోటీలను తిలకించేందుకు భార్య తబితతో కలిసి లండన్ వెళ్లిన పుష్ప ఫేం దర్శకుడు సుకుమార్.




## వార్-2 సిద్ధం

హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వస్తున్న వార్ 2 సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. తెలుగు హిందీ తమిళ భాషల్లో ఈ సినిమాను ఆగస్టు 14న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ కేవలం నలభై నిమిషాలు మొత్తమే తెరపై కనిపిస్తారని తెలుస్తోంది. ఎన్టీఆర్ కెరీర్‌లో ఫుల్ ఫ్లెడ్జ్‌గా హిందీలో చేసిన తొలి చిత్రం ఇది. యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ చిత్రం ప్రమోషన్స్ కోసం ఇప్పటికే పలు ఈవెంట్స్ ప్లాన్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను ప్రమోట్ చేస్తున్నారు. వార్ 1కు ఎంత ఆసక్తి ఉండేదో వార్ 2పై అంతకంటే రెండింతలు ప్రేక్షకులు ఆసక్తిగా ఉన్నారని ఆయాన్ ముఖర్జీ తెలిపారు.



## 'ఆశ' షూటింగ్ ప్రారంభం

మలయాళ సినిమా పాపులర్ యాక్టర్స్ ఊర్వశి, జోజు జార్జ్ కలిసి చేస్తున్న సినిమా ఆశ. వినాయక అజిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా సఫర్ సనల్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. జోజు జార్జ్, రమేష్ గిరిజ, సఫర్ సనల్ సంయుక్తంగా స్క్రీన్ ప్లే, సంభాషణలు రాశారు.త్రిక్కక్కర వామన మూర్తి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ చిత్రం ప్రారంభమైంది. జోజు జార్జ్, సినిమాటోగ్రాఫర్ మధు నీలకందన్, దర్శకుడు సఫర్ సనల్ జ్యోతి ప్రజ్వలన చేశారు. జోజు జార్జ్ క్లాప్ కొట్టగా, మధు నీలకందన్ కెమరా స్విచ్ఆన్ చేశారు.ఈ సందర్భంగా ఆశ టైటిల్‌లుక్ పోస్టర్ ఆవిష్కరించారు.

## చిట్ చాట్‌లో ప్రవీణ్ పరుచూరి, జెనీలియా



### డైరెక్టర్‌గా రుజువు చేసుకుంటాను

కేరాఫ్ కంచరపాలెం లాంటి సినిమాల్లో నటించిన ప్రవీణ పరుచూరి ఇప్పుడు దర్శకురాలిగా మారారు. 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాకు దర్శకత్వం వహించారు. రానా దగ్గుపాటి సమర్పిస్తున్న ఈ సినిమా 18న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా దర్శకురాలు ప్రవీణ పరుచూరి మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** మీరు నిర్మాత, నటి కదా.. డైరెక్షన్ వైపు రావాలని ఎందుకు అనిపించింది?**

నాకు డైరెక్షన్ చేయాలని ఆసక్తి ఎప్పటి నుంచో ఉంది. చిన్నప్పుడు నుంచిసినిమాలు అంటే పిచ్చి. నేను ఆంధ్ర నాట్యం నేర్చుకున్నాను. తర్వాత కూచిపూడి. అలా నటన సంగీతం సాహిత్యం గురించి పరిచయం ఏర్పడింది. అమెరికాలో యాక్టింగ్ క్లాసెస్ కి వెళ్ళాను. అక్కడ ఫిలిం మేకింగ్ సంబంధించి ఒక షార్ట్ కోర్సు చేశాను. డైరెక్టర్ అనేది చాలా డిఫికల్ట్ క్రాఫ్ట్. ప్రొడక్షన్ చేసి నేర్చుకోవాలని నిర్ణయించకున్నాను. నా గత రెండు సినిమాలు అన్ని క్రాఫట్స్ మీద అనుభవాన్ని ఇచ్చాయి.

*** ఈ కథతో ఏం చెప్పదలచుకున్నారు ?**

కరోనా సమయంలో అందరం బాధపడ్డాం. ఒక డాక్టర్‌గా ఇంకా ఎక్కువ బాధ ఉండేది. ఆ సమయంలో నేను సినిమాల గురించి ఎక్కువ ఆలోచించలేదు. మరో సినిమా చేస్తానని కూడా అనుకోలేదు. అప్పుడు మిక్కీ మేయర్ కొలాబరేషన్‌లో షార్ట్ ఫిలిం చేశాను. తరువాత ఒకసారి ఇండియాకు వచ్చాను. ఈ కథ ఆలోచన అప్పుడే పుట్టింది. ఇది కంచరపాలెం లాగానే ఒక మంచి ఎంటర్టైనర్ అవుతుందనే నమ్మకం ఉంది. డైరెక్టర్‌గా రుజువు చేసుకుంటాను.

*** ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది ?**

నా క్యారెక్టర్ చాలా ఫన్ అనిపించింది. ఊర్లో ఉండే మహిళలు కాస్త టఫ్‌గా ఉంటారు. నాది కూడా అలాంటి టఫ్ క్యారెక్టర్. నా పర్సనాలిటీకి చాలా డిఫరెంట్‌గా ఉండే క్యారెక్టర్ ఇది. ఇందులో నాకు రెండు అద్భుతమైన సీన్స్ ఉన్నాయి. పుష్ప సినిమాలో జాతర సీన్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ఇందులో అలాంటి ఒక సీక్వెన్స్ ఉంది.

*** మీరు డాక్టర్ కదా వృత్తిపరంగా చాలా బిజీగా ఉంటారు. అలాంటిది మీరు సినిమాలు ఎలా చేయగలుగుతున్నారు?**

డాక్టర్‌గా నిరంతరం ప్రాక్టీస్‌లో ఉంటాను. అలాంటి సమయంలో క్రియేటివ్ అవుట్లెట్ కావాలి. చిన్నప్పుడు నుంచి సినిమా అంటే ఆసక్తి ఉండడంతో సినిమా చేస్తే అలాంటి ఒక క్రియేటివ్ అవుట్లెట్ దొరుకుతుందని భావించాను. కంచరపాలెంకి అవకాశమై యాక్టింగ్ చేశాను. అయితే నేను కూడా డైరెక్టర్ కావాలనే అనుకున్నాను.

*** భవిష్యత్తులో ఎలాంటి సినిమాలు చేయాలనుకుంటున్నారు?**

ఈ సినిమా ఆడియన్స్‌కి నచ్చి మంచి విజయాన్ని ఇస్తే మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. నాకు ఒక యాక్షన్ సినిమా చేయాలని కోరిక ఎప్పటినుంచో ఉంది. ఒక మంచి మార్షల్ ఆర్ట్ ఫిలిం చేయాలనుంది.

### ప్రేక్షకులు క్యారెక్టర్ పేర్లతో గుర్తుంచుకోవడం ఆనందం

ఒకప్పుడు తెలుగు సినిమాను ఏలిన హీరోయిన్ జెనీలియా. మహారాష్ట్ర మాజీ సిఎం విలాస్ రావు దేశ్ ముఖ్ తనయుడు మరాఠీ హీరో రితేష్ దేశ్ ముఖ్‌ను వివాహం చేసుకున్న తరువాత సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. చాలా రోజుల తరువాత తిరిగి జూనియర్ అనే కన్నడ సినిమాలో నటిస్తోంది. గాలి జనార్ధన్ రెడ్డి కొడుకు కిరీటి రెడ్డి హీరోగా వస్తున్న జూనియర్ సినిమా తెలుగు, కన్నడలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ వచ్చిన జెనీలియా మీడియాతో చిట్ చాట్ నిర్వహించింది.

*** దాదాపు 13 ఏళ్ల తర్వాత సౌత్ సినిమా సినిమా చేస్తున్నారు. జూనియర్ సినిమాతో రీ ఎంట్రీ ఎలా అనిపిస్తోంది ?**

ఈ ప్రాజెక్టు మూడేళ్ల క్రితం నా దగ్గరికి వచ్చింది. అయితే చేయాలా వద్దా అనుకున్నా. రితేష్ ఈ కథ గురించి నాకు చాలా పాజిటివ్‌గా చెప్పాడు. ఒకసారి విన్న తర్వాత నిర్ణయం తీసుకో అన్నారు. దర్శకుడు ఆ కథ, అందులో నా పాత్ర చెప్పిన విధానం నాకు ఎంతగానో నచ్చింది. నేను బిగినింగ్ నుంచి ఎప్పుడూ చేయని కొత్త క్యారెక్టర్స్ చేయాలనే ఉద్దేశంతోనే సినిమాల్లోకి వచ్చాను. ఇందులో నా పాత్ర చాలా స్పెషల్. ఇప్పటి వరకు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు. అందుకే తప్పకుండా సినిమా చేయాలి అనిపించి చేశాను.

*** ట్రైలర్‌లో మీ క్యారెక్టర్ చాలా సీరియస్‌గా ఉంటుందని అనిపిస్తోంది?**

సీరియస్ అనడం కంటే ఒక మంచి బాస్ క్యారెక్టర్. సినిమా ముందుకెళ్తున్న కొద్దీ ఆ క్యారెక్టర్ లో చాలా మార్పులు వస్తాయి. అవన్నీ కూడా చాలా కొత్తగా ట్రీట్ చేశారు డైరెక్టర్. నేను ఇప్పటివరకు చాలా మంది కొత్త నటులతో పనిచేశాను. అయితే కిరీటి మాత్రం చాలా కాన్ఫిడెంట్ యాక్టర్. అద్భుతమైన డాన్సర్, పెర్ఫార్మెన్స్ అన్ని వండర్ఫుల్‌గా చేశాడు. చాలా హార్డ్ వర్కింగ్ చేసి కంప్లీట్ ఎఫర్ట్ పెట్టాడు.

*** మీరు కెరీర్ చాలా పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు సినిమాలకి బ్రేక్ ఇచ్చారు కదా.. ఆ రిగ్రేట్ ఏమైనా ఉందా?**

లేదండి. జీవితమన్నప్పుడు అన్ని ఉంటాయి. అయితే ఎన్నో అద్భుతమైన సినిమాలు చేశాను. బొమ్మరిల్లులో హాసిని వెరీ మెమొరబుల్ క్యారెక్టర్. అలాగే హ్యాపీలో మధుమతి ఇప్పటికీ ఆడియన్స్ నా క్యారెక్టర్స్ పేరుతోనే నన్ను పిలుస్తుంటారు. అది ఒక నటిగా చాలా గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. కోట శ్రీనివాస రావు లాంటి గొప్ప నటుడితో నటించడం నా అదృష్టం. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఆయన లేకపోవడం సినిమా పరిశ్రమకు తీరని లోటు.

*** ఇక నుంచి రెగ్యులర్‌గా సినిమాలు చేస్తారా?**

ఖచ్చితంగా చేస్తా మంచి క్యారెక్టర్స్ వస్తే నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. చిన్న క్యారెక్టర్ అయి నా గుర్తుండిపోయే క్యారెక్టర్ చేయడం నాకు ఇష్టం.

*** మీకు డ్రీమ్ రోల్స్ ఏమైనా ఉన్నాయా?**

ఇండస్ట్రీలోకి రావడం, ఇన్ని పాత్రలు చేయడం, ప్రేక్షకుల నుంచి విశేషమైనటువంటి అభిమానాలు పొందడం ఇదంతా కూడా నాకు ఒక డ్రీమ్ లాగా అనిపిస్తుంది. ఇంతకుమించిన డ్రీమ్ ఏమీ లేదు.

*** రామ్ చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్ ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. మీ కోస్టార్స్‌గా ఎలా అనిపిస్తుంది?**

వాళ్లందరూ కూడా నా ఫ్రెండ్స్. చాలా అద్భుతమైన ప్రతిభ ఉన్న హీరోస్. ఇప్పుడు వారిని సూపర్ స్టార్స్ గా చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపిస్తుంది.

*** మీ భర్త రితేష్‌తో సినిమా ఎప్పుడు ఉండొచ్చు ?**

మజిలీ రీమేక్ చేశాం. అది అద్భుతమైన విజయాన్ని ఇచ్చింది. మరో మంచి లవ్ స్టోరీ కుదిరితే సినిమా చేయాలని ఆలోచన అయితే ఉంది.

## 'ఆ గ్యాంగ్ రేపు 3' ట్రైలర్ రిలీజ్



'ఆ గ్యాంగ్ రేపు'నకు సీక్వెల్ చిత్రం 'ఆ గ్యాంగ్ రేపు 2' షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించిన టీమ్ నుండి రాబోతున్న మరో సెన్సేషనల్ క్రైమ్ థ్రిల్లర్ 'ఆ గ్యాంగ్ రేపు 3' త్వరలోనే ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. దర్శకుడు యోగీ కుమార్ ఈ సినిమాను ఎంతో ఎమోషనల్‌గా, నిజాయితీగా.. అందరి హృదయాలకు హత్తుకునే విధంగా తెర మీదకి తీసుకొస్తున్నారు. ఇంతకు ముందు ఆయన దర్శకత్వంలో రూపొందిన తొలి ఫీచర్ ఫిల్మ్ లవ్ యూ టూ ఓటీటీలో ప్రేక్షకుల మెప్పు పొందింది. ఈ సారి ఈ ఆ గ్యాంగ్ రేపు 3 ఆయనకు దర్శకుడిగా మరింత గుర్తింపు వస్తుందనే నమ్మకంతో ఆయన ఉన్నారు.

## 'గర్ల్ ఫ్రెండ్' నుంచి నదివే పాట విడుదల




దీక్షిత్, రష్మిక మందాన హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన 'గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి నదివే అనే పాటను విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ సంగీతం అందించారు. ఈ సినిమాను అల్లు అరవింద్‌కు సంబంధించిన గీత ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తోంది. రాకెందు మౌళీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. రష్మిక ఇంతకు ముందు చేసిన పాత్రల కంటే భిన్నమైన పాత్రను ఇందులో పోషించారని గీత ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ అన్నారు. ఇది వైవిధ్యమైన ప్రేమకథా చిత్రమని తెలిపారు. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు.

## హీరోయిన్‌కి మథర్ థెరిసా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్



తమిళ, కన్నడ, తెలుగు నటి సంచితా శెట్టి. సంచితా విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'సూదుకవ్వుమ్', ఆశోక్ సెల్వన్ హీరోగా నటించిన 'విల్లా'తో పాటు ప్రభుదేవా హీరోగా 'భగీరా' చిత్రాలతో పాటు దాదాపు 25 సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. నటనతో పాటు సంచిత చేసిన యూత్ లీడర్ షిప్ సేవలను దృష్టిలో ఉంచుకుని సెయింట్ మథర్ థెరిసా యూనివర్సిటీవారు ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు .కోయంబత్తుర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సంచితకు ఈ అవార్డును ప్రధానం చేశారు. అవార్డును స్వీకరించిన అనంతరం ఇకపై మరిన్ని మంచి పనులు చేయటానికి ఈ డాక్టరేట్ కొత్త ఊపిరిని అందించిందని సంచితా శెట్టి పేర్కొన్నారు. ఈ అవార్డుకు తనను ఎన్నుకున్న కమిటీకి ఆమె కృతజ్ఞతలు తెలియచేశారు.



# జైల్లో ఉండాల్సిన వారు చట్టసభల్లోకి

(మొదటి పేజీ తరువాయి)

భయం వేస్తుందని.. మహిళల నుదిటి ఎరుపు సింధూరం చూసిన ఉలిక్కి పడుతున్నారన్నారు. పేదల కోసం పుట్టిన పార్టీ కమ్యూనిస్టు అని.. వందేళ్లు పూర్తి చేసుకొని నిత్యం సజీవంగా వెలుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో సిపిఐ జిల్లా 4వ మహాసభ పురస్కరించుకొని పట్టణంలో ఎర్రజెండాతో భారీ కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహాసభకు సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారతీయ జనతాపార్టీకి మొదటి శత్రువు ముస్లీంలు, రెండవది క్రిస్టియన్లు అయితే.. మూడోది కమ్యూనిస్టులని ప్రచారం చేస్తున్నారన్నారు. పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న బిజెపి నేతలు దేశభక్తులుగా.. ప్రజల పక్షాన పోరాటం చేస్తూ సమాజాన్ని కాపాడుతున్న కమ్యూనిస్టులను దేశద్రోహులుగా చిత్రికరించటం సబబుకాదన్నారు. కమ్యూనిస్టులంటేనే త్యాగానికి నిర్వచనమని.. దానికి వారసులుగా ఉన్నందుకు గర్వపడుతున్నట్లు తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. బిజెపి, కాంగ్రెస్ దేశానికి పరిమితమైతే.. బిఆర్ఎస్, టిడిపి లాంటి పార్టీలు రాష్ట్రానికే పరిమితమైనాయన్నారు. కమ్యూనిస్టులను అంతం చేస్తామని బిజెపి నేతలు భ్రమపడుతుందని అదివారితో సాధ్యం కాదన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కమ్యూనిస్టుల పోరాటం అజరామరం మని కొనియాడారు.

**ఒక్క సీటు ఇచ్చి కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకుంది :**

రాష్ట్రంలో119నియోజకవర్గాలుంటే సిపిఐకి ఒక్క సీటు ఇచ్చి పొత్తుకుదుర్చుకుందని.. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే ప్రజాసమస్యలపై, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని అన్నారు. ఇంతవరకు ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టికి సున్నితంగా తీసుకెళ్లామని.. ఇప్పుడు ప్రజలతో కలసి పోరాటం చేస్తామని కూనంనేని వెల్లడించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బలమున్న స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. కాంగ్రెస్ నేతలు తప్పులు చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చేది బిజెపి, బిఆర్ఎస్ పార్టీలేనన్నారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీటిని అందించాలన్నారు. ఒక్క సీటు పొత్తు వద్దని..పొత్తు గౌరవంగా ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని కూనంనేని స్పష్టం చేశారు. సిపిఐ వందేళ్ల ముగింపు భారీ బహిరంగ సభ డిసెంబర్‌లో 26 లక్షాలాది మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఐ ఎప్పుడు ప్రజల పక్షమని మరోసారి కూనంనేని స్పష్టం చేశారు.

**ప్రజలకు కూడు, గూడు కల్పించటమే సిపిఐ లక్ష్యం : జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**

పేద ప్రజలకు కూడు,గూడు, విద్య, వైద్యం హక్కులు కల్పించమే ధ్యేయంగా సిపిఐ పోరాటం చేసిందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. పోరాటాల అడ్డ.. ఉద్యమాల ఖిల్లా హుస్నాబాద్ అన్నారు. ఏన్నో పర్యాయాలు హుస్నాబాద్ నుండి శాసన సభ్యులను అందించినట్లు తెలిపారు. ఈప్రాంత తాగునీటి, సాగునీటి సమస్యల పరిష్కారంలో ఎర్రజెండా పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. కమ్యూనిస్టు పోరాట ఫలితంగానే ఇప్పటికే కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందుతుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి కాల్వలు తవ్వితే ఈప్రాంతం పూర్తిగా సస్యశ్యామలం అవుతుందున్నారు. హుస్నాబాద్‌లో సిపిఐ బలంగా ఉందనిహ, మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి తమ సత్తాను చాటుతామని చాడ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మందపవన్, నాయకులు కలవేని శంకర్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ కెడెం లింగమూర్తి, ఆహ్వానసంఘం అధ్యక్షులు గడిపే మల్లేశం, భాస్కర్, భూపేశ్, అశోక్, జెర్రిపోతుల జనార్దన్, గజ్వేల్ మండల కార్యదర్శి, మహిళ సమాఖ నేతలు పాల్గొన్నారు.

# 8 కొత్త బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమితో సహా అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి), ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు జరిగే అవకాశముంది. ఈ ఏడాది చివర్లో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) విషయంలో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య వివాదం తలెత్తే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడం ద్వారా భారత్, పాకిస్తాన్ మధ్య అణుయుద్ధాన్ని నివారించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వం నుండి సమాధానాలు కోరనున్నాయి. మరో నాలుగు కొత్త బిల్లులు మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు, జాన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు, పన్ను చట్టాలు (సవరణ) బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఆదాయపు పన్ను బిల్లు, 2025ను కూడా సమర్పించనుంది. ఈ బిల్లును ఫిబ్రవరిలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అయితే దిగువ సభ సెలెక్ట్ కమిటీకి పంపారు. ప్యానెల్ బుధవారం తన నివేదికను ఆమోదించింది. దీంతో సోమవారం లోక్‌సభలో సమర్పించే అవకాశం ఉంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు కోసం ప్రభుత్వం పార్లమెంటు అనుమతి కోరనుంది. రాష్ట్ర గ్రాంట్ల డిమాండ్‌ను సభ ఆమోదం కోసం ఉంచనుంది. గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు–2024, మర్చంట్ షిప్పింగ్ బిల్లు–2024, ఇండియన్ పోర్ట్స్ బిల్లు – 2025 లోక్‌సభ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి.

# అమృత్ భారత్ స్టేషన్ పథకంలో పనులు వేగవంతం చేయాలి



రైల్వే జిఎం శ్రీవాస్తవ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌లలో నడుస్తున్న పునరాభివృద్ధిపనులను మరింత వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద అభివృద్ధి పనులు నడుస్తున్న నాంపల్లి, చర్లపల్లి రైల్వే స్టేషన్లను సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్,ఇతర సీనియర్ అధికారులతో కలిసి పనులను తనిఖీ చేశారు. స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ప్రయాణీకుల సౌకర్యాలు, వసతులను సమీక్షించారు. బుకింగ్ కౌంటర్, వెయిటింగ్ రూమ్, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, స్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా హైదరాబాద్ స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని కూడా జనరల్ మేనేజర్ పరిశీలించారు. పునరాభివృద్ధి పనుల పురోగతిపై డివిజనల్ అధికారులు వివరణాత్మక నివేదికను సమర్పించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడానికి పనులను మరింత వేగవంతం చేయాలని జనరల్ మేనేజర్ అధికారులను ఆదేశించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ హాల్స్, స్లీపింగ్ పాడ్‌లు, కెఫెటేరియా, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఈవి ఛార్జింగ్ పాయింట్లు మొదలైన ఆధునిక సౌకర్యాలను ఆయన పరిశీలించారు. జనరల్ మేనేజర్ తనిఖీ సమయంలో, బుకింగ్ క్లర్క్, 'సఫాయ్ మిత్ర' సిబ్బందితో కూడా సంభాషించారు. వారి డ్యూటీ వేళలు, పని వాతావరణం మరియు అందుతున్న సౌకర్యాలు గురించి అడిగితెలుసుకున్నారు.

**లాలాగూడలోని కేంద్రీయ ఆసుపత్రి తనిఖీ**

లాలాగూడలోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగ ప్రసాద్‌లు ఉన్నారు. శ్రీవాస్తవ ఓల్డ్ ఔట్‌పేషెంట్ బ్లాక్ (ఓ.పి.డి)లో నున్న ఆప్తోమాలజీ, డెంటల్, ఈ.ఎన్.టి, చెస్ట్ క్లినిక్ వంటి మొదలగు క్లినిక్‌లను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ కొత్త ఓపి డి బ్లాక్‌లో, రేడియాలజీ యూనిట్, డాక్టర్ల కన్సల్టేషన్ గదులు, రిటైర్డ్ ఉద్యోగుల వెయిటింగ్ లాంజ్‌లను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న చికిత్సకు సంబంధించిన సౌకర్యాల గురించి ఆయన పెన్షనర్లు, కుటుంబ సభ్యులతో సంభాషించారు. ఇంకా మెరుగైన వైద్యం అందించడానికి అదనంగా కావాల్సిన సౌకర్యాల గురించి అభిప్రాయాన్ని వారినుండి తీసుకున్నారు. ఇంకా, జనరల్ మేనేజర్ అత్యవసర వార్డు (క్యాజువల్టీ), స్పెషల్ వార్డు, ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్ (ఐసిసియూ), డయాలసిస్ యూనిట్ మరియు నూతనంగా ప్రారంభించబడిన కార్డియాక్ క్యాత్ ల్యాబ్ & రికవరీ రూమ్‌ను తనిఖీ చేశారు.

# 100 జిల్లాల్లో పిఎం ధన్‌ధాన్య కృషి యోజన

- 1.70 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలిగించేలా రూ.24,000 కోట్ల వార్షిక ప్రణాళిక
- కేంద్రమంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ :** దేశంలోని 100 జిల్లాలలో భారీగా వ్యవసాయ ఉత్పాదకత పెంచేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ధన్–ధాన్య క్రిషి యోజన (పిఎం డిడికెవై)కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలియజేసింది. పంటల నాణ్యతా ప్రమాణాలు, పంట మార్పిడి విధానాలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అభివృద్ధిచేసేందుకు ఈ పథకం ప్రవేశపెట్టారు. నికర పంట ప్రాంత విస్తీర్ణతలో హెచ్చుతగ్గులున్నప్పటికీ, అందుకు అనుగుణంగా ప్రతిరాష్ట్రం, కేంద్ర పాలితప్రాంతాలలో కనీసం ఒక్కొక్క జిల్లాకైనా ఈ పథకం వర్తిస్తుంది. కోటీ 70 లక్షలమంది రైతులకు ప్రయోజనం కలిగించేవిధంగా రూ.24,000 కోట్ల వార్షిక ప్రణాళికను మంత్రివర్గం ఆమోదించింది. అదేవిధంగా విజయవంతంగా రోదసీ యాత్ర పూర్తిచేసుకుని వచ్చిన శుభాంశు శుక్లాకు కేంద్రమంత్రివర్గం అభినందనలు తెలియజేస్తూ ఒక తీర్మానం చేసింది. అంతరిక్ష అన్వేషణలో భారతదేశం ప్రపంచస్థాయిలో నిలబడేందుకు ఈ యాత్ర దోహదం చేస్తుందని పేర్కొంది. దేశం తనకుతానుగా మానవ సహిత రోదసీ యాత్రలు చేయాలన్న ఆశయాలకు శుక్లా యాత్ర తొలిమెట్టు కాగలదని తీర్మానం పేర్కొంది. దీంతోపాటు విద్యుత్ రంగంలో సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తుల అభివృద్ధి పెట్టుబడులకు సంబంధించిన ఐదు తీర్మానాలను సిసిఇఎ ఆమోదించింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కాగా పిఎం డిడికెవై పథకం కింద ప్రణాళిక అమలు, పర్యవేక్షణ చేసేందుకు జిల్లా, రాష్ట్రం, జాతీయస్థాయిలలో మూడురకాల కమిటీలను ఏర్పాటు చేస్తారు. జాతీయ లక్ష్యాలు సాధించడానికి వీలుగా ఈ కమిటీలను దేశవ్యాప్తంగా అనుసంధానం చేస్తారు. వ్యవసాయ ఉత్పాదకతపై నెలవారీ పర్యవేక్షణ చేసేందుకు మొత్తం 117 కీలకమైన ఇండికేటర్లను ఏర్పాటు చేస్తారు. జిల్లా ప్రణాళికలకు మార్గదర్శకాలను అందజేసి నీతీ ఆయోగ్ దీనిని సమీక్షిస్తుంది. ప్రతి జిల్లాకు కేంద్ర నోడల్ అధికారులను ఏర్పాటు చేస్తారు. వీరంతా రోజువారీ ప్రాతిపదికపై సమీక్షలు చేస్తారు. 100 జిల్లాలలో మంచి ఫలితాలు సాధించేందుకు వీలు గా పంట ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు, రైతులకు కావాల్సిన సంబంధిత సదుపాయాలను ఈ పథకం కింద సమీక్షిస్తారు. ప్రస్తుతం దేశంలో ఉన్న 11 ప్రభుత్వ విభాగాల ద్వారా అమలు చేస్తున్న 36 పథకాలను ఒకచోట కూడదీసి 'పిఎం ధన్–ధాన్య క్రిషి యోజన' అమలు చేస్తారు. రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఇతర పథకాలను, ప్రైవేటు రంగంలో ఉన్న స్థానిక భాగస్వామ్యంతో ఈ పథకం సమీకృత పద్ధతులలో అమలు అవుతుంది. రైతులు పంటలు పండించే విధానాలలో మార్పులు తీసుకురావడం, పంటల నాణ్యతా ప్రమాణాలు పెంచడం, పంట మార్పిడుల ద్వారా వ్యవసాయ ఉత్పాదకత నాణ్యత పెంపొందించడం ఈ పథకంలో ప్రధానాంశాలుగా ఉంటాయని కేంద్ర సమాచార ప్రసారాలశాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ తీర్మానాలను పాత్రికేయులకు వివరించారు.

**పునర్వినియోగ ఇంధనంలో రూ.20వేల కోట్లు ఎన్‌టిపిసి పెట్టుబడి**

పునర్వినియోగ ఇంధనంలో ఎన్‌టిపిసి రూ.20వేల కోట్లు పెట్టుబడులు సమకూర్చేందుకు ఆర్థిక వ్యవహారాలపై కేంద్రమంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) అనుమతించింది. దీనిద్వారా 2032 నాటికి అదనంగా 60 గిగా వాట్స్ సామర్థ్యాన్ని ఈ రంగంలో సాధిస్తారు. గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లో కూడా పెట్టుబడులు పెట్టేందుకు ఎన్‌టిపిసికి మంత్రివర్గ కమిటీ అధికారాలను పెంచుతూ ఒక తీర్మానం చేసింది. దీంతోపాటు ఎన్ఆర్ఇఎల్‌లో, ఇతర అనుబంధ సంస్థల్లో కూడా రూ.20,000 వరకూ పెట్టుబడి పెట్టడానికి అధికారాలుంటాయి. తొలుత రూ.7,500 కోట్లు వరకూ మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం అనుమతించింది. గ్రీన్ ఎనర్జీకి కూడా భారీ ఊతం ఇచ్చేవిధంగా మంత్రివర్గం ఎన్‌టిపిసి పెట్టుబడుల పరిమితిని పెంచుతూ తీర్మానం చేసింది. ప్రభుత్వరంగంలో రూ.20,000 కోట్లు వరకూ పెట్టుబడులు పెట్టేందుకు ఎన్‌టిపిసికి అవకాశం వస్తుంది. అదేవిధంగా ఎన్ఎల్‌సిఐఎల్ కూడా రూ.7,000 కోట్లు మేరకు పునర్వినియోగ ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టుకోవచ్చు. రాబోయే ఏడేళ్ళకాలంలో 60 గిగా వాట్స్ మేరకు పునర్వినియోగ ఇంధన సామర్థ్యాన్ని సాధించేవిధంగా ఎన్‌టిపిసికి ఈ అధికారాలు దఖలు పరిచారు. కాగా ఎన్ఐఆర్ఎల్‌కు అనుబంధంగా ఉన్న ఎన్‌సిఎల్ ఇండియాకు రూ.7,000 కోట్లు మేరకు గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులు సమకూర్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 2070వ సంవత్సరం నాటికి భారతదేశ కాలుష్యం శూన్యస్థానానికి చేరుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఈ చర్యల నిమిత్తం ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాబోయే ఐదేళ్ళలో 500 గిగావాట్స్ మేరకు శిలాజ ఇంధన సామర్థ్యాన్ని తగ్గించుకునేందుకు వీలుగా ఈ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల మార్గాన్ని కేంద్రం అభివృద్ధి చేస్తోంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com